



# ఆంధ్రజ్యోతి

అమృతాంజనము

# నిరాశయే అపేక్షించు వారికి ఆశ




లివరు, స్ప్లీను వ్యాధులు ముదిరినప్పటికీ జమ్మివారి లివర్‌క్యూర్ "కాంప్లికేటెడ్" వాడటంవలన అసంఖ్యాకములైన పిల్లల ప్రాణాలు రక్షింపబడినట్లు రుజువైనది. పసిపిల్లల లివరు & స్ప్లీను వ్యాధులబారినుండి విశేషంగా పసిపిల్లలు రక్షింపబడటానికి కారణం జమ్మివారి లివర్‌క్యూర్ అని వైద్య ప్రముఖుల అభిప్రాయం. అన్నివిధాలా శ్రద్ధ తీసుకుని పసిపిల్లల లివరు, స్ప్లీను వ్యాధులు కలగకుండా ప్రయత్నించండి.

జమ్మివారి లివర్‌క్యూర్ "సింపుల్" పసిపిల్లల లివరు, స్ప్లీను వ్యాధులను కుదుర్చుటయేకాక, బలవర్ధక ఔషధంవలె గుణమిచ్చి, జీర్ణశక్తిని, ఆకలిని వృద్ధిచేసి, మలబద్ధకం కలగనియ్యక, లివరు స్ప్లీనులు సరిగా పనిచేయు దివ్యౌషధము.

గర్భంలోనున్న పిల్లకు ఏర్పడే అవయవాలలో లివరు, స్ప్లీను, తల్లిననుసరించే ఏర్పడును అన్న ఆయుర్వేద సిద్ధాంతాన్ని సరిగా అనుసరించి గర్భిణీ స్త్రీలకొరకు తయారుచేసిన "జమ్మివారిటానిక్కు"ను లివరు, స్ప్లీను వ్యాధులచేత అదివరకు బాధపడిన, పిల్లలుగల స్త్రీలు వాడవచ్చును.

## జమ్మివారి లివర్‌క్యూర్

చంటి పిల్లల లివర్ మరియు స్ప్లీన్ వ్యాధులకు.

అన్ని చోట్లను దొరకును. దిగువ అడ్రసులలో వైద్యసలహా పొందుడు.

**జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్**

లివర్‌క్యూర్ క్లినిక్ అండ్ ఆఫీసు.

మైలాపూరు, మద్రాసు - బిగ్‌వీధి, కుంబకోణం - తెప్పకుళం, తిరుచునాపల్లి - ఆర్కాట్ శ్రీనివాసాదారి వీధి, బెంగళూరు పేట.

## ఈ సంచికలో కొందరు రచయితలు


| | |
|---|---|
| నార్ల | శ్రీ. శ్రీ. |
| కృష్ణశాస్త్రి | గోఖలే |
| బుచ్చి సుందరరామశాస్త్రి | కుటుంబరావు |
| మునిమాణిక్యం | జి. సూర్యనారాయణ |
| శివరామశాస్త్రి | శరత్‌బాబు మొదలైనవరు |


# ఆంధ్రజ్యోతి

సం॥ చందా 5-0-0 విడి ప్రతి 0-6-0

మీకు ప్రతిమాసం పత్రిక దొరకాలంటే చందాదారుగా చేరండి.

ఆఫీసు : 37 ఆచారప్పన్ వీధి, మద్రాసు. 1.





ప్రతిభా వారి

# ముగ్గురు మరాఠీలు

Producer. Director... G. BALARAMIAH

తారాగణం


కన్నాంబ, కుమారి, కమలాదేవి, రాజరత్నం, [illegible]

జి. వి. సుబ్బారావు, C. H. నారాయణరావు, [illegible]

నాగేశ్వరరావు, శివరావు, ఇతరులు

మే 31-వ తేదీ బెజవాడ – విశాఖపట్నములలో విడుదల!

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1-6-46 | కాకినాడ | – క్రౌన్ టాకీసులో | 5-6-46 | ఏలూరు | – రామకృష్ణా టాకీసు |
| 1-6-46 | రాజమండ్రి | – మినర్వా ,, | 5-6-46 | మచిలీపట్నం | – బృందావన్ ,, |
| 1-6-46 | గుంటూరు | – న్యూసిటీ ,, | 5-6-46 | కర్నూలు | – రామకృష్ణా ,, |
| 1-6-46 | తెనాలి | – వెంకటేశ్వర | 5-6-46 | బళ్లారి | – స్టార్ ,, |
| 5-6-46 | విజయనగరం | – పూర్ణా థియేటర్ | 6-6-46 | నెల్లూరు | – న్యూ టాకీసులో |



స్వర్ణోత్సవము
వచ్చినప్పుడు
పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతము
VAIDYARATNA PANDIT D. GOPALACHARLU'S
JEEVAMRUTHAM
THE BEST NERVINE TONIC
AYURVEDASRAMAM
MADRAS
ఆరోగ్య,
బలములను
చేకూర్చుటలో అమోఘమైన ఈ టానికు గత అర్ధ శతాబ్దిగా బాధిత ప్రజానీకమునకు చేసిన అవిరళ సేవను సగర్వముగా స్మరించెదము.
EASTERNS
ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్, టి. నగర్, మద్రాస్.

# జూన్ నెల భావ పరిచయ పోటీ

## బహుమానం 10-0-0




ముగింపు తేదీ 23-6-46

వివరాలకు 83వ పేజీ చూడండి.

ఆంధ్రజ్యోతి
.....సచిత్ర మాస పత్రిక.....
సంపాదకుడు : చక్రపాణి
సంపుటి 6] 1 జూన్ 1946 [సంచిక 6

# స్వర్గీయ భూలాభాయి దేశాయి

"స్వాతంత్ర్యం మన జన్మహక్కు" అని హృదంతరాళంనుండి గర్జించాడు లోకమాన్య బాలగంగాధర తిలక్. అది మన జాతీయపోరాటంలో నినాదమై, వేలకొలది ప్రజల్ని స్వాతంత్ర్య సమరానికి ప్రోత్సహించింది.

"రాజభక్తికంటె దేశభక్తి యెక్కువయింది. అంతర్జాతీయ చట్టంక్రింద బానిసలకు స్వాతంత్ర్యపోరాటానికి పూర్తి అధికారముంది" అని వాదించాడు భూలాభాయి, లాల్‌కిల్లాలో ఆజాద్‌ఫౌజు వీరుల్ని సమర్థిస్తూ. ఇకముందు అనేకమంది స్వాతంత్ర్య సైనికుల రణభేరీయై వర్ధిల్లుతుం దీవాదం.

లాల్‌ఖిల్లా విచారణలు మనజాతీయ చరిత్రల్లో నూతనశకాన్ని ఆరంభించాయి. మన 60 యేళ్ళ పోరాటంలోను, సైనికులు ఆయుధాలతో పోరాడటంలేదు. ఆవిషయంలో మనకు నేతాజీ మార్గదర్శకుడు. వేలకొలది జాతీయసేన సైనికులను, నాయకులను మృత్యుముఖంనుండి రక్షించి, మన స్వాతంత్ర్య సమరానికి ప్రసాదించింది భూలాభాయి.

1877 వ సంవత్సరంలో సూరత్‌జిల్లాలో బల్‌సూరు గ్రామంలో భూలాభాయి జననం. తండ్రి గవర్నమెంటు ప్లీడరు, అనేకమంది పిల్లలుపుట్టి పోవటంచేత, భూలాభాయిని అతిగారాబంగా పెంచారు. ఎలిఫిన్‌స్టన్ కళాశాలలో బి. ఏ. మొదటివాడుగా ఉత్తీర్ణుడయ్యాడు, కుటుంబంపెద్ద తండ్రి గతించటంచేత, భూలాభాయి అంతకంటె ఉన్నతమైన చదువులకు పోలేక పోయేడు. ఇండియాప్రభుత్వం, I. C. S పరీక్షకు చదివిందికి, భూలాభాయికి సహాయంచేస్తానంది. కాని తల్లి పట్టుదలవలన భూలాభాయి ప్రభుత్వసహాయాన్ని నిరాకరించవలసి వచ్చింది.

"నామాటవిని నీవు ఇంగ్లండువెళ్ళకపోతే, I. C. S కంటె గొప్పవాడవౌతావు" అన్నదా మాతృమూర్తి, ఆమాటలు అక్షరాలా నిజమయ్యాయి.

పట్టభద్రుడైన తరువాత, భూలాభాయి అహమ్మదాబాదులో గుజరాతు కాలేజీలో యెకనామిక్సు ప్రొఫెసరుగా ప్రవేశించాడు, చిన్నప్పటినుండి, వాగ్వాద మన్నా, చర్చలన్నా, రాజకీయాలన్నా ప్రీతి. హైస్కూలు విద్యార్థిగానే వాగ్వాదంలో మంచి నేర్పుచూపించాడు. బర్కు, గ్లెడ్‌స్టన్‌లవలెనే తానుకూడా గొప్పవక్తయై పార్లమెంటువాదాల్లో పాల్గొనాలని భూలాభాయి కలలుకంటూ ఉండేవాడు. "నేనొక నాయకుడినైనట్లు, శాసనసభలో వాదిస్తున్నట్లు, చిన్నప్పుడు యెన్నో ఆటలు ఆడుకొనేవాడ్ని" అన్నాడు భూలాభాయి. తాను కేంద్రశాసనసభలో కాంగ్రెసుపార్టీ నాయకుడైన తరువాత బొంబాయి పౌరులిచ్చిన సన్మానానికి జవాబిస్తూ, చిన్ననాటి ఆ ఆటలే భారతస్వాతంత్ర్య పోరాట చరిత్రలో చిరస్థాయిగానిలచే ముఖ్యఘట్టాలుగా మారేయి.

ఉద్యోగంలోఉండే భూలాభాయి న్యాయవాది పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆనాడు బొంబాయిలో కొద్దిమంది యూరోపియను వకీళ్ళుమాత్రం ఉండేవారు. వారితో సమానుడయ్యాడు భూలాభాయి. ఇతని శక్తిసామర్థ్యాలుచూసి, గోపాల కృష్ణ గోఖలే, Servants of India Society లో చేరమని ఆహ్వానించాడు. ఆనాడు దేశంలో పేరున్నసంస్థ అదొక్కటే. ఆనాటికి కాంగ్రెసు రాజకీయాలు తీర్మానాల్లో నుండేవి. Servant of India Society మాత్రము కొంత సంఘ సంస్కరణ కార్యక్రమాన్ని నడిపించేది. దానిలో, తక్కువజీతాలుపుచ్చుకుని పనిచేసేవారు ఉదార స్వభావులు. "నెలకు వెయ్యిరూపాయిల ఆదాయంవచ్చాక చేరుతాను" అన్నాడట భూలాభాయి. ఒకవెయ్యికాదు, వేలకువేలు ఆర్జించాడు. ఒకసారి ఆదాయపన్నుక్రింద లక్షరూపాయలు చెల్లించాడట.

హోంరూలు ఉద్యమంలో తొలిసారి రాజకీయరంగం ప్రవేశించాడు భూలాభాయి. కాని అతనిలో నిజమైన మార్పురాలేదు. న్యాయవాదివృత్తిచేస్తూ, తీరికసమయాల్లో విశ్రాంతివలె రాజకీయాల్లో ఉండేవాడు. మానసికంగాను, రాజకీయంగాను అతనిలో గొప్పమార్పుతెచ్చి, న్యాయవాదిని జాతీయవాదిగాచేసింది బార్డోలీ రైతుఉద్యమం.

బార్డోలీపన్నుల నిరాకరణోద్యమంలో అనేకమంది రైతులు అరష్టుచెయ్య బడ్డారు, వారిని సమర్థించిందికి వప్పుకున్నాడు భూలాభాయి. వారి బీదతనం, వారి

కుటుంబాల నిరాధారస్థితి ప్రభుత్వోద్యోగుల దుండగీడుతనం, భూలాభాయిలో మార్పుతెచ్చాయి. ఈవిధంగా ప్రజల్ని పీడించి పెరుగుతూన్న ప్రభుత్వాన్ని పడతోయటం తనవిధియని భావించాడు. తన పూర్వజీవితం అతని కళ్ళముందు ప్రత్యక్షమయింది. "నేనుకూడా బీదరైతుబిడ్డను. 7 యేళ్ళ వయస్సులో బడికి వెళ్ళిందికి నేను 5 మైళ్ళు నడవవలసివచ్చింది" అన్నాడట భూలాభాయి, బార్డోలీ రైతులతో. బ్రూమ్‌ఫీల్డు విచారణ సంఘంముందు, రైతుల యదార్థస్థితిని చిత్రించి వారికనుకూలంగా తీర్పుచెప్పించాడు భూలాభాయి. అతని రాజకీయ జీవితంలో విజయపరంపర దీనితోనే ఆరంభమయింది.

తదనంతరం గాంధీజీని సందర్శించాడు. దానితో అతనిలోమార్పు పూర్తయింది. పూర్తియైన జాతీయవాదయ్యాడు. కాంగ్రెసులోచేరేడు. బొంబాయిలో మలబార్ హిల్లులో అతని విశాల భవనాన్ని జాతీయవాదులకు, సర్వ ాల సర్వావస్థల యందు అందుబాటులోఉండే వసతిగృహంగా మార్చేడు.

ఇదిచూసి ప్రభుత్వం కంపించింది, ఇదివరకనేకసార్లు భూలభాయిని తనలోకి తీసుకుందికి ప్రయత్నించింది ప్రభుత్వం. హైకోర్టు జడ్జీగా, తరువాత, బొంబాయి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, ఆతరువాత కేంద్రప్రభుత్వపు న్యాయశాఖా సభ్యుడిగా ప్రభుత్వం అతన్ని ఆహ్వానించింది. కాని వాటినన్నిటిని నిరాకరించాడు భూలాభాయి. అటువంటి భూలాభాయి, కాంగ్రెసులోచేరటం ప్రభుత్వానికి కంటకమయింది.

రెండవ సత్యాగ్రహోద్యమంలో, తొలిసారి భూలాభాయి జైలుకు వెళ్ళేడు. తిరిగీ వ్యక్తి సత్యాగ్రహమప్పుడు రెండోసారి వెళ్ళాడు. అప్పుడే అతని ఆరోగ్యం కూడా చెడింది. నెహ్రూ కుటుంబం తరువాత, అంత సుఖమనుభవించిన జైలు జీవితానికి సిద్ధమయినవాడు భూలాభాయి ఒక్కడే.

శాసనసభలో కాంగ్రెసు పార్టీనాయకుడయ్యాడు భూలాభాయి. స్వరాజ్యపార్టీ వున్నప్పుడు తప్ప కాంగ్రెసెప్పుడూ శాసనసభలను బహిష్కరించేది. తీవ్రవాదుల వలెనే గాంధీజీకూడా శాసనసభా ప్రవేశానికి సమ్మతించేవాడు కాదు. కాని కాంగ్రెసు చివరకు శాసనభా ప్రవేశాని కంగీకరించింది. జాతీయ ఉద్యమంలో చూపిన ఉత్సాహం, శక్తి, శాసనసభల్లోకూడా చూపాలి. దానికి తగిన నాయకుడు కావాలి. స్వరాజ్యపార్టీకి మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్‌దాసులు వుండేవారు.

అనుభవంలేని భూలాభాయిని నాయకుడిగా చేశారు. చాలామంది అతని సామర్థ్యాన్ని శంకించారు కూడా. ఇద్దరు కాంగ్రెసు నాయకులు ప్రత్యేకంగా శాసన సభ ప్రథమ సమావేశానికి హాజరయ్యారట కూడా, భూలాభాయి నాయకత్వం

చూసిందికి. తొలిరోజునే భూలాభాయి, మోతీలాల్, చిత్తరంజన్‌దాసులకు తగిన అనుచరుడనిపించుకున్నాడు. వాదాల్లోను తీర్మానాల్లోనే గాక, పార్టీని క్రమశిక్షణలో ఉంచటంలో అద్వితీయుడని పేరు పొందేడు. హాస్యము, అతని ఉపన్యాసాలకు నూతన శోభనిచ్చేది. ప్రతి కక్షులను, నిర్మొగమాటంగా నిష్కర్షగా విమర్శించటంలో భూలాభాయి ప్రధముడు. అనేకసార్లు అతని విమర్శకు గురియై, చికాకైన పరిస్థితులలో పడ్డవారిలో రామస్వామిమొదలియారు అగ్రగణ్యుడు.

1941 లో యుద్ధంలో పాల్గొనిందికి అస్వతంత్ర భారతదేశపు విముఖతను తెలియచేస్తూ, భూలాభాయిచేసిన ఉపన్యాసం, ప్రభుత్వవర్గాలను ఊపివదలింది. ముస్లిం లీగు నాయకుడు జనాబ్‌జిన్నాకూడా దాని ప్రభావానికి ఆహుతయ్యాడట.

భూలాభాయి అరవై యెనిమిదేళ్ళ జీవితంలోను ఆఖరి ఆరునెలలు, ముఖ్యమైనవి. గత పాతికేళ్ళ రాజకీయ జీవితంలోను అతను సంపాదించిన కీర్తి, ప్రజాభిమానాలకంటె వేయిరెట్లు యెక్కువ ఈ ఆరునెలలలోను వచ్చాయి. లాల్‌ఖిల్లాలో అతని వాదనలు ప్రపంచమంతా మారుమ్రోగేయి. ప్రతి స్వేచ్ఛాపిపాసి హృదయంలోను ప్రతిధ్వనించాయి. కృత్రిమశ్వాస (artifical respiration) తీసుకుని వాదించిన వకీళ్లు అరుదు. అటువంటి నీరసస్థితిలో, వందలకొలదీ ఖైదీలతో సంప్రతించి, జాతీయసేనను భారతదేశానికి ప్రసాదించినది భూలాభాయి. ప్రభుత్వపు సాక్షులు అబద్ధమాడుతున్నారని స్పష్టంగా రుజువుచేశాడు. ఒక సాక్షిచేత, అధికారులు తన నట్లా పలకమని బలవంతం చేశారని వప్పించాడు. జాతీయసేన, స్వతంత్రసేనయని, కొందరు ద్రోహులు ప్రచారంచేసినట్లు జపానుచేతి కీలుబొమ్మకాదని నిరూపించాడు. "విప్లవం పీడితుల ఆయుధం. తిరుగుబాటు వారి ధర్మం. అస్వతంత్ర మానవాళికి, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనే స్వేచ్ఛ, అధికారం వున్నాయి. రాజభక్తి విడనాడైనా దేశభక్తిని ప్రదర్శించాలి"....ఇలాంటి సత్యాలెన్నో పీడిత ప్రజాకోటికి మరొకసారి జ్ఞాపకంచేసిన స్వేచ్ఛాపిపాసి భూలాభాయి. భారతదేశ చరిత్రలో స్వతంత్ర యోధుడుగా చిరస్థాయిగా నిలచియుండే అమరజీవి భూలాభాయి. శాసనసభాచరిత్రలో, ప్రముఖవక్తల తరగతిలో పేరొందిన నాయకుడు భూలాభాయి. భూలాభాయి మితవాదికాడు—తీవ్రవాదికూడా కాడు. మధ్యరకపు రాజకీయాల్లో పాల్గొనేవాడు. కాని తనతో కలియని వారిని ద్వేషించే వాడు కాడు.

నేతాజీ స్థాపించిన జాతీయసేనను భారతదేశానికి సమర్పించి వేలకొలది జాతీయ వీరుల ప్రాణరక్షణకు తన ప్రాణాలర్పించిన స్వాతంత్ర యోధుడు భూలాభాయి. అతని ఆత్మశాంతికి ఆంధ్రజ్యోతి అశ్రుతర్పణం.

# స్వాగతము



రైతు కూలీ ప్రజా స్వామ్య రాజ్యస్థాపనకై ఎంతోకాలంనించి కలలుగంటున్న ఆచార్యా రంగాగారిని ఈనాడు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షపదవి వరించింది. ఈ సందర్భంలో రైతు, కూలీల తరఫున మేము వారిని అభినందిస్తున్నాము.

ఈనాడు ఆంధ్ర కాంగ్రెసునాయకులలో అభిప్రాయ బేధాలూ, మనోమాలిన్యాలూ ఎక్కువవుతున్నై. వీటిని సాధ్యమైనంతవరకు తొలిగించి కలుపుకుపోవలసిన బాధ్యత ఎంతైనా వీరిమీద వున్నది. ఈమధ్య ప్రతి జిల్లాలోనూ ప్రతికక్షులకును అణచటానికి మాజీ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు ప్రకాశంగారు మాజీ దేశభక్తుల్ని కొందరిని పైకి తీసుకురావటానికి ప్రయత్నాలుచేశారు. అవి ప్రజలు ఎంతమాత్రం సహించలేరని వారు తమ అనుభవంవల్ల గ్రహించవలసింది, గాంధి పూజ్యత రాజాజీని పవిత్రుణ్ణిచేయలేక పోయింది. అలాగే ప్రకాశంగారి పూజ్యత, పవిత్రతకూడా ఈ మాజీ దేశభక్తుల్ని పరిశుద్ధుల్ని చేయలేవు.

పోతే ఈనాడు ఆంధ్రప్రజా సామాన్యం, ముఖ్యంగా కాంగ్రెసు అభిమానులు, కాంగ్రెసుకు ఓటుచేసి నందువల్ల ప్రతికక్షుల నించి అనేక చిక్కులు పడుతున్నారు. ఇలాంటి సందర్భంలో స్వార్థ సాధనకు మళ్ళీ, వారిలో చీలికలుతెచ్చి వారి ఐకమత్యాన్ని చెడగొట్టటం రాక్షస కృత్యం. ఇక పట్టాభిముఠాఅనీ, వీరు ప్రకాశంముఠా అనీ, వీరు రంగాముఠా అనీ వేరుపరచటం కాంగ్రెసునాయకులు చేయదగిందికాదు. ప్రజలకు నాయకులందరూ పూజ్యులే—వారు అందర్నీ సమానంగానే గౌరవిస్తారు. వారిలో చీలికలుతెచ్చి మీరు నాపక్షాన ఉంటారా? ఫలానివారిపక్షాన ఉంటారా? అని అడగటం అవివేకం—పిల్లవాణ్ణి నువ్వు తండ్రిపక్షమా తల్లిపక్షమా అని అడిగినట్లు!

కాగా, ఇప్పుడు మేము రంగాగారిని కోరేది ఒకటే-వారుకూడా ఈపద్ధతే అవలంబించక, ప్రతికక్షులనబడేవారిని కలుపుకుని ప్రజాసామాన్యంలో ఐకమత్యం తీసుకురమ్మని మని. అది చేయగలిగిననాడే భారతదేశంలోనూ, దక్షిణాదినా ఆంధ్రజాతి ఒకజాతిగా ఎంచబడుతుంది. ప్రజాసామాన్యానికి మేలు కలుగుతుంది.

# కల్లోల ప్రపంచం

నార్ల

శాంతి అన్ని సందర్భాలలోను వాంఛనీయంకాదు; కల్లోలం అన్నిసమయాలలోను గర్హనీయం కాదుకూడా.

శాంతిని కోరవలసిందే. ప్రపంచం శాంతితోనున్నప్పుడే ప్రజాభివృద్ధి; కళాభివృద్ధి; సారస్వతాభివృద్ధి; అప్పుడే సంస్కృతివికాసం; అప్పుడే సౌఖ్యసంప్రాప్తి.

కాని, శాంతిప్రియత్వం స్వార్థానికి, అసమర్థతకు, భీరుత్వానికి, ధర్మచ్యుతికి కేవలం ఒక మేలిముసుగు అయినట్టి ఘట్టాలు ప్రపంచ చరిత్రలో అనేకం.

ఛేంబర్లేన్ శాంతిప్రియుడే. కాని, చరిత్రకారుడు ఆ మాజీ బ్రిటిష్ ప్రధానిని హర్షించ గలడా ? ప్రతి న్యాయసూత్రాన్ని, ప్రతి ధర్మసూత్రాన్ని, తుదకు రాజనీతిజ్ఞతను మంటకలిపి, ఆస్ట్రియాను బలిపెట్టి, చెకొస్లొవాకియాను యజ్ఞపశువుగాచేసి, అతడు ప్రపంచశాంతిని కాపాడ గోరాడు. కాని, దీనిఫలిత మేమైంది ? నాజీ జర్మనీని మరికొంత బలపరచడమే ! ప్రపంచ కల్లోలాన్ని తథ్యంచేయడమే !

రక్తపాతం, జననష్టం, సంపత్తివిధ్వంసన, సౌఖ్యభంగ, దుఃఖం, దైన్యం మొదలైనవి కల్లోలాన్ని అనుసరించడం సహజం. అయినా, కల్లోలమే స్వాతంత్ర్యాకాంక్షకు, స్వేచ్ఛా ప్రియత్వానికి, న్యాయదక్షతకు, ధర్మసంరక్షణేచ్ఛకు, ధీరోదాత్తతకు ప్రతిరూపమైన ఘట్టాలు ప్రపంచ చరిత్రలో అసంఖ్యాకం.

కల్లోలాలకు కారకులైనారని వాషింగ్టన్, మాజినీ, గారిబాల్డీ, అబ్రహాం లింకన్, కసూత్, లెనిన్, డీవెలరా, గాంధి, సన్‌యెట్‌సెన్, జగుల్‌పాషా ప్రభృతులను ఏ చరిత్ర కారుడు నిందించగలడు ?

అంచేత ప్రత్యేక విశిష్టత ఏదీలేదు; కల్లోలంలో ప్రత్యేకంగా నింద్యమైనట్టిది ఏదీలేదు. వాటి ఉచితానుచితాలు, వాటి గుణావగుణాలు వాటిలో గర్భితమైవుండే శక్తులనుబట్టీ; లక్ష్యాలనుబట్టీ.

* * *

ఇటీవలనే ముగిసిన ప్రపంచమహా సంగ్రామ కల్లోలంలో ఇప్పటి అంతర్జాతీయ రాజకీయ కల్లోలం శతాంశమైనాకాదు. ఇందువల్ల నేటి ప్రపంచ పరిస్థితులేమి, పరిణామాలేమి శతాధికంగా ఉత్తమమైనవని భావిస్తే, దీన్నిమించిన పొరపాటు లేదనవలసి వస్తుంది.

ఇటీవలి యుద్ధం ఎంతటి విస్తృత—ఎంతటి భయానక—కల్లోలమైనా, అది కొన్ని లక్ష్యాలకోసం ఫాసిజం విధ్వంసనాన్ని అది ఆశించింది; మానవ స్వాతంత్ర్య రక్షణను అది కాంక్షించింది; ప్రజాస్వామ్య ప్రతిష్ఠాపనను అది కాంక్షించింది. అంచేత ఎంత వ్యాప్తినందినా,

ఎంత దీర్ఘంగా కానసాగినా, ఎంత భీకరస్వరూపాన్ని ధరించినా, ఆ మహాయుద్ధ కల్లోలం నిందార్హం—కాలేదు.

ఇక నేటి అంతర్జాతీయ రాజకీయ కల్లోలంలో రక్తపాతం, ప్రజానష్టం, జనపదాల విధ్వంసన అత్యల్పమేకావచ్చు. అయినా దీనిలో ప్రాధాన్యం నీచస్వార్థాలకేగాని, ఉన్నత లక్ష్యాలకుకాదు. అంచేత ఇదే ఎక్కువ ప్రమాదకరం; ఇదే ఎక్కువ గర్హనీయం; ఇదే మానవజాతి అధఃపతనానికి త్వరగా దారితీస్తోంది.

* * *

ఉత్తమాశయాలతో ఒకదాని సరసను ఒకటి నిలిచి, నిన్న మొన్నటివరకు శత్రువుతో పోరాడిన మిత్రరాజ్యాలే నేడు నీచస్వార్థాలతో ఒకదానితో ఒకటి, శత్రువుతో చేసుకొన వలసిన సంధివిషయమై పోరాడుకుంటున్నవి.

ఎట్టి మహోన్నత శిఖరాలనుంచి ఎట్టి అధఃపాతాళానికి మిత్రరాజ్యాలు పతనమై పోయినవో తెలపడానికి పారిస్‌లో సమావేశమైన అగ్రరాజ్య చతుష్టయ విదేశాంగ మంత్రుల సభే నిదర్శనం.

ఇటీవలి శత్రురాజ్యాలతో జరగదగు శాంతి ఒడంబడికల స్వరూపాన్ని నిర్ణయించడానికై సమావేశమైన ఈ మంత్రులు తమలో తాము ఒడంబడికకు రాలేక, ఎవరి దారిని వారు వెళ్ళిపోయారు.

ఇక, ఇప్పుడు వీరు ఒకరిపై ఒకరు పారిస్ సభావైఫల్య బాధ్యత మీదంటే మీదని నిందలు వేసుకుంటున్నారు.

సోవియెట్ రష్యా విస్తరణ కాంక్షవల్లనే పారిస్‌సభ విఫలమైనదని యునైటెడ్ స్టేట్సు విదేశాంగ మంత్రి మిస్టర్ బిర్నీ అనగా, "కాదు, ఆంగ్లో - అమెరికన్‌రాజ్యాల ప్రాబల్యాకాంక్షవల్లనే" అని రష్యా విదేశాంగమంత్రి ముష్యూర్ మోలటోవ్ అంటున్నాడు.

తిరిగి జూన్ 5 వ తేదీని పారిస్‌లోనే జరగనున్న అగ్రరాజ్య చతుష్టయ విదేశాంగ మంత్రుల సభలోనైనా, శాంతి ఒడంబడికల విషయమై సమాధానం పొసగకపోతే, ఈ సమస్యను మిత్రరాజ్యసమితి సమక్షంలో పెట్టవలసిందేనని బిర్నీ హెచ్చరించగా, అగ్రరాజ్యాల మధ్య ముందుగా ఒక ఒడంబడిక కుదరనిదే శాంతిసమావేశం జరగడంకల్ల అని మోలటోవ్ పట్టుదల చూపుతున్నాడు.

ఈ సందర్భంలో ఎవరిది తప్పు అని ప్రశ్నిస్తే, "అందరిదీ" అని సమాధానం చెప్పడానికి నిష్పాక్షికులైన వారు సంకోచించ నవసరం లేదు.

* * *

పారిస్‌సభలో చెలరేగిన వివాదాలన్నింటిని ఇక్కడ పేర్కొనడం అనవసరంగాని, ముఖ్యమైన ఘర్షణలను ఉదహరించడంద్వారా స్వార్థచింతయే ఆ సభాస్థలిలో విహారం చేసిందని నిరూపించవచ్చు.

అల్బేనియా, గ్రీసు, యుగోస్లావియా, సోవియెట్ రష్యాలకు ఇటలీ ఎంత యుద్ధ నష్టపరిహారం చెల్లించాలి ?—ఇది పారిస్‌సభలోవచ్చిన ఒకప్రశ్న.

అన్యాయంగా ఇటలీ ఈ అన్నిదేశాలపై దండెత్తి, వాటికి అపారనష్టాన్ని కలిగించింది గనక, పెద్దమొత్తాన్ని యుద్ధనష్టపరిహారంగా చెల్లించవలసిందేనని రష్యావాదం.

అల్బేనియా, గ్రీసు, యూగోస్లావియ్యాలమాట ఏమోగాని, రష్యాపైకి ఇటలీపంపినవి కొద్ది సైనికదళాలే. అవి రష్యాకుచేసివున్న నష్టం సల్పమైవుంటుందని బ్రిటన్, అమెరికాలవాదం.

మీదేశాలపైకి శత్రుసైన్యాలు దండెత్తిరావడంగాని, మీగడ్డపైనే యుద్ధం సాగడంగాని, సంభవించలేదు గనక, ఇట్టి పరిస్థితులలో ఎంతనష్టం కలుగుతుందో మీకేమితెలుసునని రష్యావాదం.

ఇటలీ యుద్ధంవల్ల చితికిపోయింది. అది కోలుకొనడానికి మేము ధనసహాయం చేస్తున్నాము. ఇటలీని పెద్దమొత్తాన్ని యుద్ధ నష్టపరిహారంగా తెమ్మంటే, దా.న్నిమేమే యిచ్చుకోవాలని బ్రిటన్, అమెరికాల వాదం.

ఎవరిచ్చుకుంటారో మాకుతెలియదు. ఇటలీ పునరుద్ధరణ బాధ్యతను మీరువహించాలని మేము కోరలేదు. పైగా, ఇటలీని ఆక్రమిస్తున్న మీసేనల కారణంగా ఇటాలియనులకు ఎంతో వ్యయం, ఎన్నో సాధకబాధకాలు తప్పడంలేదట. మీ సైన్యాలను ఏమాత్రం తగ్గించినా, మేము న్యాయంగా కోరుతున్న యుద్ధ నష్టపరిహారాన్ని మాకివ్వవచ్చు నని రష్యావాదం.

మనతో యుద్ధంచేసిన పాతప్రభుత్వం నేడు ఇటలీలో లేదుగదా అని బ్రిటన్, అమెరికాలవాదం.

ఇప్పటి కొత్త ప్రభుత్వం పాతదానికి దగ్గిర చుట్టమే నని రష్యావాదం.

ఇక, ఎప్పుడు ఏదితనకు అనుకూలంగావుంటే, ఆపక్షంవైపుకు ఫ్రాన్సు మొగ్గు.

* * *

ఇటలీ చెల్లించవలసిన యుద్ధ నష్టపరిహార సందర్భంలో జరిగినట్టి వాదాన్ని పోలిందే ఇటాలియన్ నౌకాబలాన్ని పంచుకొనడం సందర్భంలో జరిగినవాదం.

ఇటాలియన్ నౌకాబలంలో తనకుకూడా భాగంపెట్టాలని రష్యాఅనగా, రష్యాపట్టుకున్న శత్రు నౌకాబలాలలో తమకు భాగంపెట్టడం జరగలేదని బ్రిటన్, ఫ్రాన్సు, యునైటెడ్ స్టేట్సులు అంటున్నాయి.

రష్యాకు ఈ సందర్భంలో బ్రిటన్, ఫ్రాన్సు, యునైటెడ్‌స్టేట్సులు చెబుతున్న సమాధానం సమంజసంగా కనబడవచ్చుగాని, ఇటలీ పునరుద్ధరణను ఇవి నిజంగానే ఎంతో ఆశిస్తూవుంటే, ఇటాలియన్ నౌకాబలాన్ని ఇటలీకే వదిలిపెట్టరాదా ?

* * *

ట్రీస్టీ ఓడరేవు విషయంలోకూడా రష్యా ఒకటంటే, బ్రిటన్, అమెరికాలు మరొకటి అంటున్నాయి.

ఈ ఓడరేవు ఇటలీనుంచి యూగోస్లావియాకు సంక్రమించాలని రష్యా పట్టుదల.

మార్షల్ టిటో పరిపాలనక్రిందవున్న యూగోస్లావియాపై ప్రస్తుతం సోవియెట్ రష్యాకు చాలా పలుకుబడికలదు. అంచేత ట్రీస్టీ ఓడరేవు యూగోస్లావియాకు పూర్తిగా సంక్రమిస్తే, మెడిటరేనియన్ తీరంలోనికి రష్యాకు ప్రవేశం లభించినట్టే.

సరిగా దీన్ని నిరోధించడానికే బ్రిటన్, అమెరికాలు ట్రీస్టీ ఓడరేవును యూగోస్లావియాకు అప్పగించరాదని పట్టుదలచూపుతున్నవి. మధ్యయూరోపియన్ రాజ్యాలు అన్నీకూడా చిరకాలంనుంచి సమష్టిగా ఆ ఓడరేవును ఉపయోగించుకుంటున్నవనీ, ఇకముందుకూడా ఇంతే జరగాలనీ అవి వాదిస్తున్నాయి.

ట్రీస్టీ ఓడరేవు పరిసరప్రాంతమైన వెనీజియా జూలియా పరగణానుగురించికూడా ఇలాగే మతవిభేదాలు, వాద ప్రతివాదాలు, స్వార్థాల సంఘర్షణ తప్పడంలేదు.

* * *

కాగా, ఇటాలియన్ సామ్రాజ్యవిషయంలో ఈ అగ్రరాజ్య చతుష్టయ స్వార్థాలు మరింత స్పష్టంగా కానవచ్చాయి.


ట్రిపోలిటానియాకు సంపూర్ణ స్వాతంత్ర్య మివ్వాలని బ్రిటన్ ప్రతిపాదించింది. ట్రిపోలిటానియాతీరం పరిసరాలలోగల మాల్టా, క్రీట్, సైప్రస్‌దీవులూ తనవేగనక, గ్రీసు తన పలుకుబడిలోనే వున్నదిగనక, మెడిటరేనియన్‌లో నౌకాబలం ప్రాబల్యం తనదేగనక, ఈజిప్టుపై ఇంకను తనకు ఇంతో, అంతో అధికారం కలదుగనక, స్వతంత్ర ట్రిపోలిటానియా తన ప్రాబల్యంలోకి రాకతప్పదని బ్రిటన్ అంచనా.

ఇక, ఇటాలియన్ సోమాలిలాండ్‌ను బ్రిటిష్ సోమాలిలాండ్‌తో కలపాలని, ఈ రెండింటితో అబిసీనియాకుచెందిన ఆగ్డెన్ పరగణాను చేర్చాలని, మొత్తాన్ని తన ప్రొటెక్టరేట్ రాజ్యంచెయ్యాలని బ్రిటన్ ప్రతిపాదన. పచ్చికబయళ్లు, పశుసంపద విస్తారంగాగల ఆగ్డెన్ పరగణా పోయినందుకు ఎరిట్రియా ఎడారిని కొంత అబిసీనియాకు యివ్వవచ్చునట.

పోతే, ట్రిపోలిటానియాను తన ధర్మకర్తృత్వంకింద వుంచమని ఒక ప్రతిపాదనను, ఇందుకు సమ్మతించని పక్షంలో తన అధికారుల సలహానుసరించి ఇటలీయే దానిని (ట్రిపోలిటానియాను) పరిపాలించాలని మరొక ప్రతిపాదనను రష్యాచేసింది.

రష్యాచేసిన ఈ ప్రతిపాదనలలోని అంతర్యం మెడిటరేనియన్ తీరంపైన, ఆఫ్రికా ఖండంలోను తాను కాలూన గోరడమే.

ఇటాలియన్ సామ్రాజ్యం బ్రిటన్‌కో, రష్యాకో మాత్రమే సంక్రమించరాదనే శాసత్రయంతో మిత్రరాజ్యసమితి యాజమాన్యాన దాన్ని అంతర్జాతీయ ధర్మకర్తృత్వంకింద పెట్టాలని ఫ్రాన్సు, యునైటెడ్ స్టేట్సులు ప్రతిపాదించాయి.




సిరియానించి బ్రిటిషువారు, ఫ్రెంచివారు ప్లానుప్రకారం వెళ్లిపోతున్నారు.

ఎవరి పట్టుదలా చెల్లగల ఆశ కానరానందున చివరికి అందరూ చేరి, ఇటాలియన్ సామ్రాజ్యంపై ఇటలీయే మిత్రరాజ్యసమితి యాజమాన్యాన ధర్మకర్తృత్వం వహించాలనే తాత్కాలిక నిర్ణయానికి వచ్చినట్టున్నారు.

కాని, ఈ సందర్భంలో గమనించవలసిన ముఖ్యాంశమిది:—ఈ అగ్రరాజ్య చతుష్టయంలో ఒక్కటైనా ఇటాలియన్ సామ్రాజ్య ప్రజల అభిమతమేమిటని అంతగా ఆలోచించిన పాపాన పోలేదేమి? ఇతరులు కొందరు వారిని తమ చిత్తం వచ్చినట్టు పంచుకొనడానికి వారు సంతలోని పశువులు కాదు గదా? సంతలోని పశువులకైనా కొంత మూల్యం వుంటుంది. కాని, ఇటాలియన్ సామ్రాజ్యంలోని పీడితప్రజలకు అదికూడా లేనట్టున్నది!

* * *

ఇక, ఇటీవల శత్రురాజ్యాలుగానున్న బాల్కన్ రాజ్యాలతో జరగదగు శాంతి ఒడంబడికల సందర్భంలోకూడా పారిస్‌సభలో స్వార్థాల సంఘర్షణ తప్పలేదు.

డాన్యూబ్ నదిపై వర్తకవ్యాపారాలకు అన్నిరాజ్యాలకు సంపూర్ణ స్వేచ్ఛనిస్తే, ఆస్ట్రియా, హంగరీ, చెకొస్లొవాకియా, యూగోస్లావియా, బల్గేరియా, రుమేనియాతో తమకు వర్తక వ్యాపారాలకు కొంత అవకాశం లభించగలదని బ్రిటిన్, ఫ్రాన్సు, అమెరికాలు ఆశపడుతున్నాయి. కాగా, ఇక్కడి మార్కెట్టులలో ఇతరులకు ప్రవేశమివ్వరాదని రష్యా పట్టుదల చూపుతున్నది,

* * *

ఇన్ని స్వార్థాలు ఇంతగా సంఘర్షించినప్పుడు పారిస్‌సభ విఫలమై పోవడంలో అబ్బురం లేదు గదా?

పారిస్‌లో ఒడంబడిక కుదరక పోవడానికి రష్యా విస్తరణాకాంక్ష కారణమని (పేరుమాత్రం ఎత్తకుండా) యునైటెడ్ స్టేట్సు విదేశాంగ మంత్రి మిస్టర్ బిర్నే అన్నాడు. అంతట సోవియెట్ విదేశాంగమంత్రి ముష్యూర్ మోలటోవ్ తెరచాటుకూడా ఏమీ లేకుండా, బ్రిటన్, అమెరికాల ప్రాబల్యాకాంక్షే పారిస్‌సభ వైఫల్యానికి కారణమన్నాడు.

ఈ రెండు అభిప్రాయాలను విని "మీరందరు సమానంగా పారిస్ సమావేశ వైఫల్య బాధ్యతను వహించవలసిన వారే" అని మనం అనవలసివుంటుంది.

* * *

ఫ్రాంస్‌లోనే అగ్రరాజ్య చతుష్టయ విదేశాంగ మంత్రులు తిరిగి జూన్ 5 వ తేదీని సమావేశం కానున్నారు. తొలి సమావేశానికి, ఈ రెండవదానికి మధ్య కాలంలో ఈ అగ్ర రాజ్యాల మధ్య విభేదాలు మరింత పెరిగినవే గాని, తరగలేదు గనక, మొదటి సమావేశం దుర్గతియే ఈ రెండవదానికి కూడా పట్టవచ్చు.

* * *

ఈజిప్టునుంచి బ్రిటిష్‌సేనలను తొలగించడాన్ని సమర్థిస్తూ కామన్సుసభలో బ్రిటిష్ విదేశాంగమంత్రి మిస్టర్ బెవిన్‌చేసిన ఉపన్యాసంలోని ధర్మపన్నాలనుచూచి అంతర్జాతీయ రాజకీయరంగం పూర్తిగా స్వార్థపూరితంకాదని కొందరు భ్రమపడవచ్చు.

కాని, బ్రిటన్ ఈజిప్టునుంచి తన సైన్యాలను తొలగించడానికి ప్రదర్శిస్తున్న సన్నద్ధతకుకారణం న్యాయచింత—ధర్మజిజ్ఞాస—దానికి ఒక్కసారిగా ఇప్పుడు కలగడంకాదు.

అరబ్ రాజ్యాలకు ఇప్పుడు ఈజిప్టు నాయకత్వంవహిస్తున్నది. అంచేత ఇక ఈజిప్టు అభిమతాలను ధిక్కరించడం కేవలం ఈజిప్టును ధిక్కరించడమేకాక, మొత్తం అరబ్ ప్రపంచాన్నే ధిక్కరించడం కాగలదు. ఈ కారణాన ఈజిప్టును సంతృప్తిపరచి, అరబ్ ప్రపంచస్నేహాన్ని సంపాయించుకోవాలని బ్రిటన్ ఆలోచిస్తున్నది.

యుద్ధకారణంగా బ్రిటన్ ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నమైపోయింది. పూర్వంకంటె ఎగుమతులు ఎంతో అధికంగా జరగకపోతే, బ్రిటన్‌కు అధఃపతనం తప్పదు. ఏ ప్రజనైనా వారి అభిమతాలను ధిక్కరించి, సైనికబలంతో పరిపాలించవచ్చుగాని, ఆ బలప్రయోగంతో వారితో వర్తకవ్యాపారాలను సాగించడం అసంభవవిషయం. అంచేతనే అరబ్ దేశాలమైత్రి వాటితో వర్తకవ్యాపారాభివృద్ధికి దోహదమివ్వగలదని బ్రిటన్ ఆశిస్తున్నది.

ప్రళయం బాంబు ఉపయోగంలోకి రావడంతో పాత రక్షణవిధానాలు పనికిమాలినవై పోయినవి. ఒక్క ప్రళయంబాంబును విసిరితే, సూయజ్‌కాల్వ అనవాళ్ళు సయితం మరి

కనబడబోవు. అంచేత ఆకాల్వ రక్షణకోసం దానిసమీపంలో సేనలనుంచడం, అందు విషయమై ఈజిప్టుతో కలహించడం నిష్ప్రయోజనమని బ్రిటన్ భావిస్తున్నది.

ఈదృష్టితోచూస్తే, 1936 నాటి ఆంగ్లో—ఈజిప్షియన్ సంధిసవరణకేమి, ఈజిప్టు నుంచి బ్రిటిష్‌సేనల ఉపసంహరణకేమి బ్రిటన్ ప్రదర్శిస్తున్న సంసిద్ధతలో ఎంత న్యాయచింత కలదో, ఎంత ధర్మనిరతికలదో స్పష్టపడుతుంది.

*　　　*　　　*

తక్కిన అంతర్జాతీయ వ్యవహారాలలోకూడా ఇట్టి స్వార్థమే, కపటమే, ఇట్టికలతలే కానవస్తున్నాయి.

పర్షియానుంచి రెడ్ ఆర్మీ తొలగించబడినా, సివిలియన్ దుస్తులలో కొందరు సైనికోద్యోగులను అజర్‌బైజాన్‌లో రష్యా మిగిల్చిపోయినదని బ్రిటన్, అమెరికాలు అనుమానిస్తున్నవి.

దక్షిణ పర్షియాలో ఇంకను బ్రిటిష్ సైనికదళాలు కలవని, ఆంగ్లో—ఇరానియన్ ఆయిల్ కంపెనీద్వారా బ్రిటిష్‌వారు టెహరాన్ ప్రభుత్వంలో జోక్యంకలిగించుకుంటున్నారని రష్యా ఆరోపిస్తున్నది.

మంచూరియాలో కమ్యూనిస్టులపక్షాన రష్యాజోక్యం, క్యూమింగ్‌పక్షాన యునైటెడ్‌స్టేట్సు జోక్యం ఇంకను తప్పడంలేదన్నట్టు తోస్తున్నది.

ఫ్రాన్సు తనపై దురాక్రమణకు దిగిందని సయాం ఫిర్యాదుచేసుకోగా, ఆ ఫిర్యాదు జరగవలసిన విధంగా జరగనందున, ప్రపంచ భద్రతాసంఘం జోక్యం కలిగించుకొనలేదని దాని ప్రధాన కార్యదర్శి అంటున్నాడు.

*　　　*　　　*

ఈ స్వార్థాలను, ఈ నైచ్యాలను, ఈ కపటాన్ని, ఈ కుటిలత్వాన్ని, ఈ శ్రీరంగ నీతులను, ఈ ధర్మపన్నాలను చూడగా, ప్రపంచానికి ముక్తిమార్గాన్ని చూపగలిగినట్టివి ప్రాచీనకాలపు ఇండియా, చైనాలు మాత్రమేనని తోస్తున్నది.

ఈ రెండుదేశాలు అధిక శక్తి బలసంపత్తులతో తులతూగుతున్న సమయంలోకూడా అన్యరాజ్యాలను తమ పశుబలంతో జయించడానికి ప్రయత్నించలేదు. తమ కళలు, తమ సారస్వతాలు, తమ పరిశ్రమలు, తమ విజ్ఞానం, తమ సంస్కృతి—వీటిని అన్ని దేశాలకు సమానంగా పంచిపెట్టి, దాని ద్వారానే చరితార్థత గాంచడానికి ఇవి ప్రయత్నించాయి.

ప్రాచీనకాలపు ఇండియా, చైనాల ఈమార్గాన్నే నేటి ప్రపంచం అనుసరించకపోతే, దాని స్వార్థాలే విషసర్పాలై దాన్ని కాటువేయగలవు.

# స్వరాజ్యం

జి. సూర్యనారాయణ

"Politics is the gentle art of getting votes from the poor and campaign funds from the rich by promising to protect each from the other"

అన్నాడొక అమెరికన్ సోషలిష్టు. బ్రిటిష్ రాజకీయాల్లో, ఈ పరస్పర వైరుధ్యం ఇంకా యెక్కువగా కనిపిస్తుంది. మనదేశం వచ్చిన బ్రిటిష్ మంత్రులు, యిదివరకు వారుచెప్పిన మాటలు మర్చిపోయి, కాంగ్రెసు - లీగు ఐక్యత సాధిస్తామని ఆరంభించారు. దానితో ఈ అమాత్య దౌత్యం వేరొక నాటకమని పించింది. తిరిగీ యింకొక సిమ్లాసమావేశం కూడా జరిగింది. భారతదేశానికి సిమ్లా సంప్రదింపులయెడ విశ్వాసం పూర్తిగా నశించింది. కాని చివరకు తమ సూచనలు బయటపెట్టేరు అమాత్యులు.

ఇంత గందరగోళంలేకుండా ముందే ఆ సూచనలు బయటపెడితే సులభమయ్యేదే అనుకున్నాం. కాని అలాజరిగితే, యిటువంటి సూచనల నెవరూ హర్షించేవారుకారు. అందుచేత కాంగ్రెసు - లీగులమధ్య ఒడంబడిక అసాధ్యమని ప్రదర్శించి, తరువాత ఈ పరిస్థితుల్లో యిదే శరణ్యమంటే చాలా మంది నమ్ముతారు. కాంగ్రెసు-లీగులమధ్య, ఒడంబడిక యెందు కసాధ్యమో అందరికీ తెలిసిందే !

స్థూలంగాచూస్తే బ్రిటిష్ సూచనలు, వివిధవర్గాల వాంఛలను కలిపినట్లు కనబడుతుంది. వీటిలో పరస్పర వైరుధ్యమైనవి గూడా వున్నాయి. ముస్లిం-లీగు పాకిస్థాన్ వాంఛ అసందర్భమైనదని, అసాధ్యమైనదని స్పష్టంగా చెప్పేరు మంత్రులు. చాలా సంతోషించాం. కాని వెంటనే (గ్రూపింగు) వర్గీకరణ అన్నారు. పేరు గోతప్ప దీనికి పాకిస్థానుకు భేదమేమిటా అని అనుమానం కలిగింది.

ఈ సూచనలప్రకారం, రాష్ట్ర శాసనసభల నుండి పదిలక్షల జనాభాకొక అభ్యర్థి చొప్పున, కేంద్రరాజ్యాంగ నిర్మాణ పరిషత్తునకు యెన్నుకోవటం, ఈ అఖిలభారత సమితిని మూడుభాగాలుగా చేయటం, దానికోసం, వివిధ రాష్ట్రాలను మూడుతరగతులుగా విభజించటం, జరుగుతాయి. రక్షణ, విదేశ వ్యవహారాలు, రాకపోకలు, వీటి కవసరమైన ఆర్థిక శాఖలు కేంద్రప్రభుత్వపు అధికారంలో ఉంటాయి. ఇతరవిషయాల్లో రాష్ట్రాలు సర్వస్వతంత్రాలు. బెంగాలు, అస్సాం రాష్ట్రాలొక తరగతి, పంజాబు సింధు, బెలూచిస్థానం, సరిహద్దు రాష్ట్రాలొక తరగతి, మిగత రాష్ట్రాలొక తరగతిగా విభజించబడుతాయి.

ఈ సూచనలు వివరిస్తూ మంత్రులు, పాకిస్థాన్ సూచనవలన మతసమస్య పరిష్కార



అలెగ్జాండరు



క్రిప్సు



లారెన్సు



ఆ జా ద్

మవదని, ముస్లిం రాష్ట్ర అని పిలవబడే రాష్ట్రాల్లో ముస్లిమేతరులు అధిక సంఖ్యాకులుగా నున్నారని, పాకిస్తాన్‌లో వీరిస్థితి నిరాధారమవుతుందని వెల్లడించారు. అయినా, అస్సాం, బెంగాలులను, వర్గీకరించి, వాటిలోని అధికసంఖ్యాకులైన ముస్లిమేతరుల భావి, కొద్దిమంది లీగు నవాబుల చేతిలో పెట్టేందుకి నిశ్చయించారు. ఆర్థికంగాను, సైనికంగాను దేశవిభజన అరిష్టదాయకమని చెపుతూ, మంత్రులు, వర్తక వాణిజ్యశాఖలు కేంద్రంనుండి తప్పించారు.

జిన్నాగారు పాకిస్థానులోనికి ఆరురాష్ట్రాలు కోరేరు. వాటిలో నాలుగు పశ్చిమభాగంలోను, రెండు తూర్పుభాగంల్లోను ఉండటంచేత, రెంటిని, ఒకచిన్న నడవతో కలుపుతానన్నాడు. ఇది అసందర్భంగాను అసాధ్యంగాను కనుపించింది. అందుచేత మంత్రులు, ఆ అరు రాష్ట్రాలను, ప్రత్యేకించి, వర్గీకరణమన్న పేర, పాకిస్థాన్ అంగీకరించారు. రాష్ట్రాలకు అవకాశమైనంత స్వాతంత్ర్యానిచ్చిందికి కాంగ్రెసు అంగీకరించటం నిజమే. కాని దేశక్షేమానికి భంగకరమైయేటట్లు, యిటువంటి విచ్ఛిన్న విధానాన్ని కాంగ్రెసెన్నడూ అంగీకరించలేదు. రక్షణ, విదేశాంగ శాఖలెంత ముఖ్యమో, వాణిజ్య వర్తక శాఖలంత ముఖ్యం. దేశమంతటా, ఒకరకమైన వర్తకశాసనాలు, సుంకములు లేకపోవటంవలన, ఆర్థికంగా దేశం దెబ్బతింటుంది. పంజాబులోని సిక్కులమాట, సరిహద్దులో లీగుకు వ్యతిరేకమైన అధిక సంఖ్యాకులైన ముస్లింలస్థితి, సింధులో హిందువులగతి, చెప్పనక్కరలేదు. బెలూచిస్థానంలో శాసన సభలుగాని, యెన్నికలుగానిలేవు. ఈ వర్గీకరణంనుండి, రాజ్యాంగ నిర్ణయం జరిగిన తరువాత యే రాష్ట్రమైనా విడిపోవచ్చుట. దాని వలన ప్రయోజనమేమిటి? అస్సాంపౌరులకు హానిచేసే రాజ్యాంగం వారినెత్తిన రుద్దబడిన తరువాత వారు బెంగాలుతో, కలిసివున్నా, విడిపోయినా అట్టే భేదంలేదు. అస్సాంలో సిల్హెట్ జిల్లాలోతప్ప యితరచోట్ల ముసల్మానులు అధిక సంఖ్యాకులుగాలేరు. మొత్తం మీద, అది హిందూరాష్ట్రమనే పిలవబడాలి. అయినా ఆరాష్ట్రంనుండి 3 ముస్లిం ప్రతినిధులు బెంగాలునుండి వచ్చే 33 గురు ప్రతినిధులతో కలిస్తే, అస్సాంలోని ముస్లిమేతరులను ఓడించగలుగుతారు. ప్రతివర్గంలోను అధిక సంఖ్యాకులు ఓటుచెయ్యాలన్న కన్నుతుడుపుపెట్టి, ముస్లిం - మేతరులు హక్కులు రక్షిస్తామన్నారు మంత్రులు. అదే మైనారటీల హక్కుల రక్షించగలిగితే-ముసల్మానులకు ప్రత్యేక కాపుదల ఎందుకు? వర్గీకరణమెందుకు? వారి హక్కులనుగూడ అది సంరక్షించగలదే. అస్సాంతోపాటు అధిక సంఖ్యాకమైన హిందువులుగల పశ్చిమ బెంగాలుకూడా - ముస్లింలీగు ప్రభుత్వంక్రింద ఉండాలి.

ఇది అమాత్యుల ప్రకటనలో తీవ్రమైన దోషం. పాకిస్థాన్, ఐక్యభారతావని కెంత అరిష్టదాయకమో, ఈ వర్గీకరణం ఆ రాష్ట్రాల్లోని సామాన్యప్రజల కంత అరిష్టదాయకం. వారి జీవితాలు భావి, ముస్లిం నవాబుల హస్తగతమౌతాయి.

ఇలా గాక, రాష్ట్రాల పునర్విభజన కంగీకరించి, తిరిగి యెన్నికలు జరిపించటకి మంత్రులు సూచిస్తే చాలా బాగుండేది. ఆనాడు జనాభాను బట్టి నిర్ణయం జరిగేది; అధిక సంఖ్యాకులు అల్పసంఖ్యాకుల అడుపాజ్ఞలలో నుండవలసిన అవసరం వుండేదికాదు.


ముస్లిం—లీగు నవాబుల అధికారంలో ముస్లిం ప్రజలనుకూడా పీడించిందికి వెనుదీయరు. ఈ రాష్ట్రాల్లో తిరిగి నవాబులరాజ్యం యేర్పడుతుంది. ఈ రాజ్యాన్ని నిలుపుకుందికి, ఈ నవాబులు బ్రిటిష్‌వారి సహాయంమీద ఆధారపడి వుంటారు. బ్రెయిల్సుఫోర్డు చెప్పినట్లు, ఆ రాష్ట్రాల్లో తెల్లసేనలను వుంచుతారు. బ్రిటిష్‌వారికి వర్తక సౌకర్యాలిచ్చి, సుంకాలు తగ్గించి, వారి దయకు పాత్రులౌతారు. కాం

గ్రెసు రాష్ట్రాల్లో అలా జరగదు. దీనివలన దేశంలో రెండు రకాలైన వర్తక విధానం అమలులో నుంటుంది. బొంబాయిలో ఒక విధమైన సుంకం, కరాచీలో యింకొక విధమైన సుంకం వుంటాయి. దీనివలన ఆర్థికంగా దేశం వెనకబడుతుంది. ఇంతేగాక ఐర్లండులోవలె, భారతదేశంలోకూడా ఒక భాగంలో బ్రిటిష్ బావుటా ఎగురుతూండడము వలన, స్వతంత్ర భారతదేశభాగం, సదా రక్షణకై సిద్ధంగావుండాలి. ఏనాడు యే దౌర్జన్యం జరుగుతుందోనని భయంగావుండాలి. ఈ రెండు దోషాలను సవరిస్తే, బ్రిటిష్ సూచనలు అంగీకార యోగ్యంగా వున్నాయనవచ్చు. ఇదివరకు మనం బ్రిటనుతో చేసుకున్న ఒడంబడికలన్నిటికంటె, ఈ రెండుదోషాలు మినహా, ఈ సూచనలు, చాలా సంతృప్తికరంగా వున్నాయి. గాంధీ-ఇర్విన్ ఒడంబడికకంటె, 1935 శాసనంకంటె, క్రిప్సు సూచనలకంటె యివి బాగా నయం. కాని వర్గీకరణకు మాత్రం అంగీకరించకూడదు. అది చివరకు పాకిస్థానుకు దారితీస్తుంది.

ఈ దృక్పథంలో గాక వేరొక దృక్పథంలో చూస్తే, యివి చాలా యోగ్యంగా కనిపిస్తాయి. అది ఆర్. హెచ్. టానీ చెప్పినట్లు యెంత యెక్కువమందికి యెన్ని యెక్కువ లాభాలు కలిగిస్తాయన్నది.

Offering the largest possible number of carrots to the largest number of donkeys - Tawney.

ఆ దృక్పథమే, ముస్లింలీగు ఈ సూచనలను అంగీకరించేటట్లు చేస్తుంది. వీటిని నిరాకరించే శక్తి ముస్లిం-లీగుకి లేదు. నిరాకరించి యేం చేయాలో వారికి తెలియదు. అంతర్యుద్ధం, విప్లవం, రష్యాసహాయం, అని ఘనంగా చెప్తారు గాని, అవి సాధ్యమైనవి కావని వారికి తెలుసు. ప్రకటనలు, వుపన్యాసాలు, అయితే చెయ్యగలరు గాని, త్యాగం చేయటం వారికి చాతగాదు. రౌడీలను ప్రేరేపించి కొంత అల్లరి చేయించవచ్చు. కాని అది చాలాకాలం సాగదు. అందుచేత లీగు వీటిని, ఆమోదిస్తుంది. లేకపోతే, లీగులో విభజనవచ్చి, కొందరు ఆమోదించి, పదవు లంగీకరిస్తారు, మరికొందరు స్వంతవర్తకం చేసుకుంటారు!



నెహ్రూ

కాంగ్రెసు కటువంటి అవసరంలేదు. దోషాలను సవరిస్తే ఆమోదించవచ్చు. లేకపోతే నిర్భయంగా నిరాకరించవచ్చు.

ఈవిషయమై నిర్ణయానికి వచ్చేముందు, కాంగ్రెసు నాయకులొక్కటి జ్ఞాపకముంచుకోవాలి. బ్రిటిష్ప్రభుత్వం, ఈ స్థాయికివచ్చిందికి కారణం, 1942 ప్రజా ఉద్యమమని, మన ఆశయమైన "స్వరాజ్యం" పోరాటం ద్వారా తప్పరాదని మర్చిపోకూడదు. ప్రభుత్వంలోపడి, ప్రజాఉద్యమాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. బ్రిటిష్వారు దీనిని, భారత స్వాతంత్ర్యానికి మార్గదర్శకమని పిలిచినా, దీనికీ నిజమైన స్వరాజ్యానికీ చాలాదూరముందని, మనం మర్చిపోకూడదు. యిక తాత్కాలిక ప్రభుత్వంమాట. దానిలో వైస్రాయి వీటో అధికారముండటం, బ్రిటిష్సేనలు విరమించకపోవటం, అసందర్భం! కాంగ్రెసు కార్యవర్గం చెప్పినట్లు ఈ తాత్కాలిక ప్రభుత్వం, రాబోయే రాజ్యాంగానికి పునాది. ఇది బలంగాలేకపోతే స్వాతంత్ర్య సౌధం బలహీనమౌతుంది. అంతేగాక దేశాన్ని యెదుర్కొంటూన్న ముఖ్యసమస్యల నెదుర్కొందికిపూర్తి స్వాతంత్ర్యంలేనిదే సాధ్యంకాదు.

ఈజిప్టుతో ఒడంబడికవిషయం ముచ్చటిస్తూ, బ్రిటిష్ విదేశాంగమంత్రి బెవిన్ ఒక దేశంలో పరదేశసేన లుండటంవలన, ఆదేశ ప్రజలలో న్యూనతాభావం (Inferioivty complex) యేర్పడుతుందన్నాడు. అది భారతీయుల విషయంలోకూడా సత్యమని బ్రిటిష్ ప్రభువులు గుర్తించి తెల్లసేనలను త్వరితంగా గృహోన్ముఖంచేయాలి.

సంస్థానాలవిషయం వేరేగా గమనించాలి. అదికూడా చాలా ముఖ్యమైనదే.

## కబుర్లు

క. స.

కాంగ్రెసు మంత్రివర్గం ఏర్పడింది. మంత్రులు కొంతమంది, తమ తమ స్వగ్రామాల వైపు వెళ్ళి, ఆహారపరిస్థితిని గురించీ, ధాన్యసేకరణ, పంపకము అనుగురించీ విచారించి వచ్చారు.

తరువాత, మంత్రులజీతాలూ, అసెంబ్లీ సభ్యుల జీతాలు నిర్ణయించడానికి అసెంబ్లీ సమావేశం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, ప్రధాన మంత్రి రాష్ట్రంలోని ఆహారపరిస్థితిని గురించి, ప్రభుత్వం యికముందు అవలంబించబోయే విధానాన్ని గురించీ ఒక ప్రకటన చేశారు.

ప్రధానమంత్రి ప్రకటనచూస్తే, ఇంతవరకూ అడ్వయిజర్ల పరిపాలనలో జరిగిన ఏర్పాట్లపట్ల ఆమోదము కనపడుతూ వుంది. ఇకముందు ప్రభుత్వంవారు అవలంబించే విధానం, ప్రధాన మంత్రి సూచనల ప్రకారం చాలావరకు బాగానే కనపడుతూవున్నా, ఆచరణలో యిది ఎంతవరకు ఫలప్రదమౌతుందో, కాటకం రాకుండా మన రాష్ట్రంలోని ప్రజలు బయటపడతారో లేదో, ఇకముందు చూడాలి.


కాంగ్రెసు మంత్రివర్గం ఏర్పడి ఒక నెల అయింది, ప్రస్తుత ఆహార పరిస్థితిని ఇట్టి చూస్తే, కరువుప్రమాదం జులై, ఆగస్టునెలల్లో, ఎక్కువగా కనబడుతున్నది. జులై ఆగస్టునెలల్లో రాష్ట్రంలో ఏప్రాంతంలోనూ కరవు రాకుండా చెయ్యాలంటే, జూన్ మాసాంతంలోపున, అన్నిప్రాంతాల్లోనూ తగినంతగా ఆహార ధాన్యాలు నిలువచేసివుండాలి. లేకపోతే, ఒకవారంలో రేషను బియ్యం సరిగా అందకపోయినా, ప్రజలు భీతావహులై పోతారు. డబ్బున్నవారు ఎక్కువగా ధాన్యాలను, దొంగమార్కెటులోకొని, నిలవచేసుకోవడమూ, పంట ధాన్యాలు వున్నవారు, తమవద్ద వున్న ధాన్యాన్ని విడుదల చెయ్యకపోవడమూ జరుగుతుంది. కరువు, జనం చచ్చిపోతున్నారు అనేటప్పటికి, ఎవరి ప్రాణాలను కాపాడుకోవడానికి వారు ప్రయత్నిస్తారు కాని, పొరుగువాడు బ్రతుకుతాడా లేదా, రోజుకు ఒకపూట అయినా వాడు తింటున్నాడా లేదా అనే ఆలోచన ఎవరికీ వుండదు.

అలాటి పరిస్థితులలో, యెక్కువ దెబ్బతినేది ఎవరంటే, ఏ వారానికి ఆ వారం, లేదా ఏరోజు కారోజు రేషను గింజలు కొనుక్కొని బ్రతికేవారు. అంటే, ముఖ్యంగా నగరవాసులూ, పాటకపు జనమూ నన్నమాట.

కరువువచ్చింది అనేమాట పుట్టకుం డానే వుండాలి గాని, అలాటి పుకారు వచ్చిందంటేమాత్రం పరిస్థితులు చాలా విషమరూపం దాలుస్తాయి. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనూ, ఇలాటిమాట పుట్ట కుండా వుండాలంటే, అన్ని ప్రాంతాల లోనూ, ప్రతి వ్యక్తికీ యివ్వవలసిన రేషను ఏ ఆటంకం లేకుండా దొరు కుతూవుండాలి. అంటే, అన్ని ప్రాంతాల లోను, అవసరాన్నిబట్టి కావలసినంత ధాన్యం వుండాలి. పంటలు చాలని ప్రాంతానికి, పంటలు ఎక్కువగావున్న ప్రాంతంనుంచి, పదిహేను, ఇరవై రోజులు ముందుగానే ధాన్యం వచ్చి చేరాలి. విదేశాలనుంచి వచ్చిన ధాన్యం, సరఫరాలో ఏమాత్రం ఆలస్యంలేకుండా, నిర్ణీతస్థానాలకు చేరాలి.

అలా జరగాలంటే, పంటలు స్థాని కావసరాలకు మించి పండిన ప్రాంతా లలో ధాన్యసేకరణ అతి చురుకుగా జర గాలి. ఈ విషయంలో ఏమాత్రం ఆల స్యం జరిగినా, చిక్కు ఏర్పడక తప్పదు.

విదేశాలనుంచి వచ్చే ధాన్యంమీదనే సంపూర్ణంగా ఆధారపడకుండా, అతి శీఘ్రకాలంలో ఫలించేవీ, ఆహారవస్తువు లుగా అక్కరకువచ్చేవీ అయిన కాయ గూరలనూ, పండ్లనూ, ధాన్యాలనూ పండించడానికి రైతులకు తగినంత ప్రోత్సాహాన్ని ప్రభుత్వం యివ్వాలి. ఈ ఏడాదికి, మా యింటికి సరిపోయిన



"ఎందుకలా వినయంచూపిస్తావు?"
"నేను వినయంచూపటంలేదు, జేబు దాచు కుంటున్నాను."

ధాన్యం వుందికదా అని, ఏ రైతు అయినా, యీ విషయంలో తగిన శ్రద్ధ చూపకపోయినట్లయిదే, అతనిని నిర్బం ధించి అయినా, అదనపు ఆహార ఉత్ప త్తిలో అతన్ని నియోగించాలి.

శాసనసభలలో ఉపన్యాసాలు, కాగి తాలమీద వుత్తరువులు చెయ్యడంతో, మంత్రులూ, శాసనసభ్యులూ తృప్తిపడ కూడదు. ప్రభుత్వోద్యోగులు సంపూర్ణ మైన బాధ్యతతో తమ కర్తవ్యాన్ని నిర్వ హిస్తున్నారో లేదో గమనించాలి. అలా చెయ్యనివారిని మన్నించడానికి వీలులేదు.

'కరువు మా రాష్ట్రంలో కాలుపెట్ట కుండా చేశాము,' అని, ప్రమాదకాలం గడిచిపోయిన తరువాత చెప్పుకోగలిగిన

వాడే. ఈనాడు పరిపాలనను స్వీకరించిన కాంగ్రెసు ప్రభుత్వం, ప్రజల గౌరవాన్నీ, అభిమానాన్నీ పొందగలుగుతుంది. లేని వాడు, లోపం యెవరిదైనా, కాంగ్రెసు మంత్రివర్గానికి మాటదక్కదు.

కొత్తగా పరిపాలనను స్వీకరించిన కాంగ్రెసు మంత్రివర్గం, ఆహారసమస్యా పరిష్కారంలో, మరే యితర కార్య క్రమాలను ఆచరణలోకి తేకపోయినా, కరువురోజులుగడిచిపోయినదాకా ఎవరూ అంతగా పట్టించుకోరు. ప్రజలు ప్రాణా లతో వుంటేనే కదా, మిగతా కార్య క్రమాలన్నీ ! అయితే ఆహారం తరు వాత ప్రధానమైనది కట్టుకోడానికి బట్ట. మిల్లుబట్టలు మనరాష్ట్రానికి తగినంతగా సప్లయికావడమూలేదు. ఆ వచ్చినవి, సక్రమమైన పద్ధతిలో అమ్మకం అవ డమూలేదు. దుకాణదారులతో పరిచయం వున్నవారికీ, అసలు ధరకంటె ఎక్కువ యివ్వగలవారికీమాత్రమే దొరుకు తున్నాయి. మిల్లుబట్టలుమాని, చేనేత వస్త్రాలు కొనుక్కుందామంటే, వాటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

చేనేతబట్టల ధరలను కంట్రోలు చెయ్యడానికి ప్రభుత్వంవారు నిర్ణయిం చారు. బాగానేవుంది. ధరలను కంట్రోలు చేసినంతమాత్రాన, ఆ ధరలకే అవి అమ్ముడు అవుతాయనిగాని, అవసర మున్నవారికి సరిగా దొరుకుతాయనిగాని గ్యారంటీ ఏమీలేదు. కంట్రోలు లేనంత కాలం, ఏవస్తువైనా, దుకాణంలో కన పడుతుంది. దుకాణదారు అడిగిన ధర యిచ్చినవాడికి లభిస్తుంది. లేనివాడికి లేదు.

కంట్రోలు వచ్చిందంటే, ఆ వస్తువు దుకాణంలో కనపడదు. కొంతమందికి లభిస్తుంది. కొంతమందికి లభించదు. అసలు ఎక్కడదొరుకుతుందోకూడా కొంత మందికి తెలియదు. ఏకొట్టులో అడిగినా, మాకోటా అయిపోయింది అనో, ఇంకా మాకోటా రాలేదు అనో జవాబువస్తుంది. కోటా ఎప్పుడువస్తుందయ్యా అంటే, "ఏమో ఎవరికితెలుసు, వచ్చినప్పుడు వచ్చి తీసుకొనివెళ్లు" అని బదులు వస్తుంది. కంట్రోలు వున్న వస్తువు లన్నిటి విషయంలోనూ, సాధారణ సంసారులుపడే అవస్థ ఇది.

ఏవస్తువు లేకపోయినా, మానవునికి గొప్పనష్టం లేదుకాని, తినడానికి తిండీ, కట్టడానికి బట్ట లేకపోతే జరగదు. అం చేత, చేనేత వస్త్రాలకు కంట్రోలు పెట్ట డంతో, ప్రభుత్వంవారు తృప్తిపడక, ఒక నెలరోజులు అయినతరువాత, పరి స్థితులను పరిశీలించి, బజారులో గుడ్డలు

సరిగా దొరుకుతున్నాయో లేదోచూసి, అలా దొరక్క పోయినట్లయితే, గుడ్డలు కూడా రేషనింగులోకి తేవాలి. లేనినాడు ప్రజాబాహుళ్యం యిబ్బందికి మితి వుండదు,

ఈరెండు సమస్యలూ రాష్ట్రానికి సంబంధించినవి.

ఇదిగాక, మదరాసు నగరానికి ముఖ్యంగానూ. కొన్ని యితరపట్టణాల లోను ప్రస్తుతం సంసారులు పడుతున్న యిబ్బంది మరొకటి వుంది, అది అసలు ఉనికికే సంబంధించింది.


మదరాసులో కాపురానికి యిళ్ళు దొరకడంలేదు. అద్దెకు కంట్రోలువున్నా, లోపాయకార బేరాలు లక్ష. పంటధర మునుపటికన్న యెక్కువగా వున్నందున డబ్బుబాగా చేతులో ఆడుతున్నవారూ, యుద్ధపు వ్యాపారంలో బాగా డబ్బుగడిం చినవారూ, పట్నవాసపు సుఖాలను మరిగి విపరీతంగావచ్చి పట్టణంలో, ఎక్కువ అద్దెలుయిచ్చి, కాలం విలాసంగా గడుపు తున్నారు.

ఉద్యోగాలు వున్నవారూ, సొంత యిళ్లవాళ్ళూ, వ్యాపారాలుచేస్తున్నవారూ, అంటే. పట్టణంలో వుండటం నిజంగా అవసరమైనవారు తప్ప, యితరులు పట్ట ణంలో వుండడానికి వీలులేదు అని ప్రభుత్వం ఒక ఉత్తరువుచేస్తేతప్ప. ప్రస్తుతపు యిళ్ల యిబ్బంది తొలగదు. అనవసరంగా, ఒకవ్యక్తి పట్టణంలో వచ్చి ఎందుకువుండాలి? సాధారణ పరి స్థితులలో అయితే, ఎవడి యిష్టంవచ్చి నట్టువాడు నడచుకోవచ్చునుగాని, అసలు పట్టణంలో వుండవలసినవారికే యిళ్ళు చాలక అల్లాడుతూవుంటే, వున్నడబ్బు తగలవేసుకొనడానికి పొరుగువూళ్ల నుంచి ప్రజలను చెన్నపట్టణం రానివ్వ కూడదు. న్యాయమైన వృత్తిలేనివారికి, చెన్నపట్టణంలో రేషను యివ్వకూడదు. వసతి యివ్వకూడదు. అలాటి కట్టు దిట్టం జరిగితేనేకాని, పట్టణంలో యిళ్ళ యిబ్బంది తీరదు.

దీనివల్ల మరొక వీలుకూడా వుంది. గ్రామస్తుల డబ్బు దుర్వ్యయంకాదు. పల్లెటూళ్ళూ, చిన్నిచిన్న బస్తీలూ పాడుపడవు. పట్టణంలో వున్నవారు యిరుకొక్కని బ్రతకవలసిన అగత్యం వుండదు.

ఆహారం, వస్త్రం—యీ రెండింటి తోపాటు, వసతివిషయంలోకూడా ప్రజ లకు సదుపాయం కలిగించడం ప్రభుత్వ విధి,

ఈనాడు చెన్నపట్టణంలో వుద్యో గాలు, వ్యాపారం చేసుకుంటూవున్నవారు ఎంతోమంది, కాపురం పెట్టుకోడానికి వసతిదొరకక, ఒంటరిగా అల్లాడు తున్నారు, వీరికి వసతిదొరకక పోవడం పనిలేనివారు చాలామంది, ఎక్కువ అద్దెలుయిచ్చి, చెన్నపట్టణంలో కాపురం వుండటమే.




పూర్వకాలంలో విద్యాభ్యాస పద్ధతి ఏలా వుండేది అని ఆలోచించడం మొదలుపెడితే ఒకానొక మర్రిచెట్టూ దానికింద మీసాలూ గడ్డాలూ పెరిగిన ఒక తేజస్సూ దాని చుట్టూతా మినుకుమినుకుమంటున్న కొన్ని నక్షత్రాలూ భావనేత్రానికి కనబడతాయి. ఆ తేజస్సు గాలి తోటీ ఆ నక్షత్రాలు ఆకూ అలంతోటీ కడుపు నింపుకున్నట్టు తోచుబడి ఔతుంది.

**బ్రహ్మవిద్య :**

ఇది గురువుదగ్గరకు వెళ్ళి కేవలమూ పుస్తకం పట్టి చదివే చదువుకాదు. దీని కాట్టే పుస్తకాలతో పనిలేదు. పుస్తకాలతో పని ఐపోయినాక గాని అసలు పుస్తకాలతో పనిలేక గాని యీవిద్య ఆరంభమౌతుంది. పుస్తకాలతో పని ఐపోయిన సుకేశా సత్యకామాదులు మొదటి తరగతికి చెందినవారు. ప్రశ్నోపనిషత్తు చూచేది. జాబాలాదులు రెండవ తరగతికి చెందినవారు. [ఛాందోగ్యం చూచేది] ఈ రెండవ తరగతికి చెందినవారు గురువుగారి దగ్గరకువెళ్ళి బ్రహ్మచర్య నియమంలో వుండేవారు. ప్రకృతం జాబాలుణ్ణి తీసుకుందాం. ఇతడు బ్రహ్మవిద్యకోసం గౌతముడి దగ్గరకు వెళ్ళాడు.

ఈ గురువుగారి జీవిక ఏలా వెళ్ళేది? ఈ శిష్యుడున్నూ మిగిలిన శిష్యులున్నూ ఏమి తిని బతికేవారు? ఈ శిష్యుడు గురువుకు ఏమయినా ఇచ్చేవాఁడా?

గౌతముడు జాబాలుడికి 400 ఆవులు అప్పగించి వీటిని 1000 చేసుకోరమ్మని ఆజ్ఞాపించాడు. ఇందులకు మూడు నాలుగేండ్లు పట్టవచ్చు. ఛాందోగ్యం 4, 5, ఖండలు చూచేది.

ఇది ఆఖ్యాయికే అయినా నాటివారి ఊహ ఏలా వుండేదో తెలుస్తుంది.

జాబాలుడికి అడవే అన్నం పెట్టేది. ఆవులు పాలిచ్చేవి. సరే, గౌతముడికి ఈ ఆవు లెక్కడివి? ఈయనకు జీవయాత్ర ఎట్లా సాగేది? అని ప్రశ్నిస్తే 'నీవార షష్ఠాంకిత సైకతాను' అనేది కొంచెం సమాధాన భిక్ష పెటుతుంది. ఇంకో సంగతికూడా మునిముందు తెలుస్తుంది.

**రాజపోషణ :**

ఎక్కడనో ఒకచోట పదుగురూ గుమికూడడమున్నూ అక్కడ ఒకానొక గొప్పవానికి రాజసమ్మానం జరగడమున్నూ ఉపనిషత్తులలోనూ పురాణాలలోనూ కనబడుతుంది. శ్వేతకేతువనే ఋషికుమారు డొకడు పంచాలదేశంలో ఒక సమితికి జిజ్ఞాసువై వెళ్ళినట్లు ఛాందోగ్యంలో వున్నది. పురాణాలలో ఏడ చూచినా బ్రహ్మసత్రాలంటూ కనబడతై. బ్రహ్మసత్రాలంటే హోటళ్ళుకాని అన్నసత్రాలుగాని కావు. ఇవి అన్నం పెట్టడానికిమాత్రమే ఉద్దిష్టాలు కావు. ఐనా అక్కడికి చేరిన జనమందరికీ ఎవరో ఒకరు అన్నం పెట్టవలసేవుంది.

**బ్రహ్మసత్రం :**

దేశంలోవుండే హేమాహేమీ లందరూ ఒకచోట చేరేవారు. వారందరూ ఒహ ఘటా

ఘటీని ప్రవచనం చేయడానికి ప్రార్థించేవారు. ఆ ఘటాఘటీ ప్రెసిడెంట్ అన్నమాట. మిగతా వారంతా ఆయన చెప్పేది వినేవా రన్నమాట.

'తుల్య శ్రుత తప శ్శీలా స్తుల్య స్వీయారి మధ్యమాః
అపి చక్రుః ప్రవచన మేకం శుశ్రూవవో౽పరే.
భాగ-10-87-11.

భాగవతంలోని ఈ బ్రహ్మసత్రం తాలూకు అనుపానులు తెలియవు.

వాయుపురాణంలో అధిసీమకృష్ణుడనే రాజుగారిసమయంలో బ్రహ్మసత్రం ఒకటి జరిగినటులు అన్నది. ఈ అధిసీమ కృష్ణుడు పరీక్షిత్తుకు నాలుగవవాడు. సరే. ఈ బ్రహ్మ సత్రానికి వచ్చిన పెద్దలనూ పిన్నలనూ అధి సీమకృష్ణుడే పోషించాడని సదరు పురాణం వల్లనే ఊహించవచ్చు.

## రాజ సమ్మానం

ఒక రా జెవరయినా యజ్ఞము చేయడ మున్నూ అక్కడికి దేశ దేశాంతరాలలో వున్న విద్వాంసులు పొగడడమున్నూ ఆ రాజు గారికి ఆ విద్వాంసులలో బ్రహ్మిష్ఠు డెవడు చెప్మా అని తోచడమున్నూ పరీక్షకేదో సమ్మానం కల్పించడమున్నూ అందులో నెగ్గినవారికి ఆ బహుమానం ముట్టడమున్నూ ప్రాచీనకాలంలో జరుగుతూ వచ్చేది. ఈ సంగతే బృహదారణ్యకంలో మూడో అధ్యా యంలో ఆఖ్యాయికగా చెప్పబడివుంది. ఇక్కడి రాజు జనకుడు. వచ్చినవారు కురు పంచాల దేశాలలోని హేమా హేమీలు. శంకరాచార్యులవారి సమయానకూడా ఈ కురు పంచాలాలు విద్వత్స్థానాలు. ఇపుడు పక్షిస్థానాలు, సక్థిస్థానాలు. సరే జనకుడు వేయి ఆవులను ఒకచోట కట్టేయించి ఒక్కొక్క కొమ్ముకు $1\frac{1}{4}$ పలం బంగారం చొప్పున తొడిగించి "అయ్యా తమలో బ్రహ్మిష్ఠులెవరో వారు ఈ ఆవుల నన్నిటినీ ఇంటికి తోలుకపోవచ్చు" అని అన్నాడు.

అందరూ తెల్లమొహాలు వేసుక్కూచు న్నారు. ఆపళంగా యాజ్ఞవల్క్యుడు తన శిష్యుణ్ణిపిలిచి "ఈ ఆవుల్ని మనింటికి తోలు కెళ్లు" అని అన్నాడు.

ఈ గాథే ఆంధ్ర జనకుడు శ్రీకృష్ణదేవ రాయలు కొంచెం మార్చివ్రాశాడు.

[ఆముక్తమాల్యద చూచేది.]

ఉపనిషత్తులు విద్వాంసుల కిలా సమ్మా నాలు జరుగుతూ వుండేవని ఊహించిగాని సాక్షాత్తు జరుగుతూంటే చూచిగాని చెప్పినవని మన మూహించుకోవచ్చు.

## మధ్యకాలం

పాటలీపుత్రంలో పతంజలి పరీక్ష యిచ్చి నట్లు చెప్పడాని కాధారముంది. కాళిదాసు మొదలయినవారి కాలంలోగూడా ఈలాటి పరీక్షలున్నటులు తెలుస్తుంది.

ఇహ కాళిదాస మేంఠా
సత్రామర రూప సూర భారవయః
హరిచంద్ర చంద్రగుప్తా
పరీక్షితా విహ విశాలాయామ్.

రాజ - కావ్యమీమాంస.

"ఈ ఉజ్జని పట్నంలో కాళిదాసు.... మొ. వారు పరీక్షచేయబడ్డారు."

పరీక్ష అయితే జరుపబడిటునలు తెలిసింది గాని ఏమి పారితోషికం ముట్టిందో అది మాత్రం తెలియలేదు. ఐనా తెలియకపోవడ మేమిటి? భావబంధువు లయిన వీరందరకూ

కవులందరూ ఋణగ్రస్తులు కారూ? వీరు పెట్టిన పెట్టుబడి అంతా, అక్కడ ముట్టిందే కాదూ?

ఎవరో ఒక మహారాజుగాని ఇంతపరీక్ష పెట్టి ఇంత పారితోషికం ఇచ్చివుండలేడని మనం అనుకోవచ్చు. ఐతే ఒకమాట. ఈ వెనుకటి సంగతులుకూడా ఎవరో ఒక మహారాజో ఏదోఒక సమితో కొందరిని పరీక్షించి బహుమతి చేసేవి అని మాత్రమే తెలుస్తుంది.

## అర్వాచీనకాలం

అక్కడా అక్కడా కొందరు కొందరు రాజులుగాని వారి తాబేదారులుగాని కృతులు పుచ్చుకున్నటులే విద్యాలయాలు స్థాపించేవారు. భాండాగారాలుకూడా ఏర్పాటు చేసేవారు. సామాన్యంగా రాజులందరూ ఇలా చేస్తున్నటులు ఊహించడాని కవకాశాలున్నవి. తంజావూరు లైబ్రరీ అట్టిది. నూజవీటి ప్రభువులు శ్రీ వెంకటరంగయ్యప్పారావు బహద్దరువారి సంస్థానంలోనూ వెంకటగిరి సంస్థానంలోనూ లైబ్రరీలు ఉన్నవి. ఐతే ఇవి ప్రైవేట్ "భాండాగార మఖండ మేవ హృదయే జాగర్తి సారస్వతం" అని అన్నాడు బిల్హణుడు.

## నాగవాపి

పశ్చిమ చళుక్యులు త్రైలోక్యమల్ల, త్రిభువనమల్ల, ద్వితీయ జగదేకమల్లుల కాలంలో [24-12-1052 క్రీ. శ. నాడు] వారి దండనాథుడు మధుసూదనుడు ఒక విద్యాయతనం ఘటికాశాలఅనే పేరున ఏర్పాటు చేసినటులు తెలుస్తుంది.

ఈ నాగవాపి నేడు నాగాయి లేక నాగయిగా మారింది. అక్కడ అరవైస్తంభాల గుడిలో నాలుగుకోణాలుగల ఒక స్తంభంమీద ఒక శిలాలిపి వున్నది. ఈ నాగయి ప్రకృతం మ. ఘ. నిజాంగారి రాజ్యంలో చిత్పూరు రైలు స్టేషన్‌కు దాపునవున్నది.

శ్రీ మధుసూదనుడు చళుక్యులకు దండనాథుడుగాను సాంధి విగ్రహాకుడుగాను వ్యవహరించి కొంకణ మాలవాది దేశములను జయించినా డట. ఇతనికి దండనాథ త్రినేత్ర అనే బిరుదు కద్దు.

## ఘటికాశాల

ఇతడు ఘటికాశాల పేర విద్యాయతనం ఏర్పాటుచేసి అందు 200 మంది వేదవిద్యార్థులకున్నూ పలువురు శాస్త్ర విద్యార్థులకున్నూ అన్నవస్త్రాలకు ఉపపత్తి కల్పించాడు. భాట్టమీమాంస ప్రాభాకరమీమాంస న్యాయదర్శనం చెప్పే ఉపాధ్యాయులకు వరుసవారీగా 35, 45, 30 ఖండాలభూమి ఇచ్చినటుల వున్నది.

## గ్రంథ భాండాగారం

ఈ విద్యాయతనానికి అనుబంధంగా ఒక గ్రంథభాండాగారం వుంది. దీనిమీద ముగ్గురు పండితులు. ఈ పండితుల కొకొక్కరికి 30 ఖండాల భూమి ఏర్పాటు.

నాగాయి పూడికలలో రాతితో చేసిన బెంచీలూ గోడలపై పుస్తకాలుంచడానికి తగిన ఉపకరణాలూ దొరకడాన ఇదే గ్రంథాలయం అని అనుమానించారు.

నేటికి సుమారు 888 ఏండ్లకింద నాగవాపిలో శ్రీ మధుసూదనుడు నేటిరీతిగా రెసిడెన్షియల్ కాలేజి స్థాపించాడని తెలిసికొంటే ఎవరికి సంతోషం కలుగదు.

# ★ రేషను ★

నూకలకేని ముందిఁకను నోచమొకో యనిపించుచుండె శ్రీ
కాకుళ మంతకంతకు చికాకోలు చీకోలు చిక్కులైనటుల్
గోకుడికెట్టులో కడుపుఁ గూటికిఁ గూడను షార్టుకట్టురా
ఆకో యలమ్మొ మేయుటకు నబ్బెన మిప్పటినుండి చేయరా.

పండెడు పంటలోఁ గడుపుపట్టెడు నంత తినంగ రామిచే
బెండె నయమ్మొకింత యనిపించెడి గుండటులుండు నాతఁడున్
బిండములన్న యట్టి యవి పిల్లల యాటల గోలిగుండ్ల దా
కండిగెతద్దినమ్ములను గాటకమిట్టి దెఱుంగ మెన్నఁడున్.

కూటికి గుడ్డ కిట్టులను గొట్టుక చచ్చుట చాలనట్లుగా
గేటులమీఁద గేట్లు తనిఖీల పయిన్ దనిఖీలు రేట్లపై
రేటు లెఱుంగవచ్చె గద! రేషను రేషనటన్ననేమొ యీ
కాటక మేలనైన నధికారులు బండెడయా మహాప్రభూ!

గింజుకొనంగఁ బూటకొక గిద్దెడు పై చిలుకేని బియ్యపుం
గింజలు చిక్కుచుండెనని కేవలమున్ ముదమొందఁబోకు మీ
నంజగముందిఁ కియ్యదియు నాలుక కబ్బునో లేదో యంచు లోఁ
పింజము పింజమంచు ననిపింప దొడంగెను గాల మానముల్.

కడకొక తండులార్ధమును గాని తదర్ధముగాని తెచ్చు నీ
కిడియెడు వాఁడు లేఁడు మునుపిచ్చెడి దానికి హెచ్చుగాక నీ
కడ మఱి హెచ్చుగావలయు కన్నకణం బనియున్నఁ జాలునే
మడిగెదు మూలనున్న ముసలయ్యయు తా నధికారి నీ పయిన్,

కాలుక పోవుచున్నయది కాలమటన్నది యిట్లు కాని పెన్
జాలి వహించి యిప్పటికి సర్వమయుండగు నీశ్వరుండు నీ
పాలన భారమెల్ల మన పాలిటి కాంగ్రెసు కప్పజెప్పె నిం
కేల భయమ్ము తీరగల నింతట నంతట సర్వకష్టముల్,

మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి

# వేమన పద్యములు

## కృష్ణశాస్త్రి

అర్జునకును రాతి నాచారమిచ్చెను;
చచ్చురాతి భార్య సంఘమిచ్చె;
కరకురాతి కూడు దొరతనం బిచ్చెరా;
విశ్వదాభిరామ వినుర వేమ!

గూటిమీద నెక్కి నూటిగా కుక్కపై
విసిరినాడు రాయి అసిరిగాడు;
కుక్క బొంయిమంటె గోల్లుమన్నాడయా;
విశ్వదాభిరామ వినుర వేమ!

వీధిత్రోవ నెపుడు వేంచేయు పంతులు,
పెరటిదారి పంది లరుగుదెంచు,
తొందరపడి సాని పందినే వలచెరా,
విశ్వదాభిరామ వినుర వేమ!

ఆమెకున్న కలిమి ఆకలి కడుపై
అతనికున్న ఆస్తి అవిటికాలు,
ఇరువురకును నడుమ విరితూపు లెగిరెరా,
విశ్వదాభిరామ వినుర వేమ!

సోమయాజిగారి జోలియచూచితే
పొట్టిసాని మనసు పట్టలేదు,
తండులములులేక తటపటాయించారు
విశ్వదాభిరామ వినురవేమ!

నిదురమత్తులోన నీటుగా నామాలు
పెట్టె స్వామివారు పిల్లినుదుట,
పిల్లి భక్తిపుట్టి చెల్లించె పులిహోర,
విశ్వదాభిరామ వినురవేమ!

ముఘులు పాదుషాలు తుఘులక్ నబాబులు
డొక్క చించి తోలు చెక్కరంచు
కట్టు సాయబయ్య కొట్టు బడాయీలు
విశ్వదాభిరామ వినురవేమ!

తాను ముసలుమాను, తాను తామర్లేను,
మనుకి దూది శత్రుగణము, లింక
ఏకె రంయి రంయి ఎందరో కాఫర్ల
విశ్వదాభిరామ వినురవేమ!

అపుడు విష్ణుభక్తి అప్పుడు శివభక్తి
బ్రహ్మభక్తి యిపుడు బయలుదేరె,
ఒక్క దేవునికిని చిక్కదు విశ్రాంతి
విశ్వదాభిరామ వినురవేమ!

సకలమతములన్న చక్కని బుక్కులు
ఎన్నొ సుకవివాక్కు, లన్నివచ్చు,
భక్తవరుని తెలివి బ్రహ్మకు లేదయా
విశ్వదాభిరామ వినురవేమ!

# చీమలు - చిన్ని చీమలు

ఒహో ! మీ రెక్కడికి
ఓ చిన్ని చీమలార !
ఏదేశము, మీరేగెద
రీ తీరున బారుగట్టి.

ఎక్కడికి, ఎక్కడికి
ఈ సమూహమెక్కడికి ?
కయ్యానిక ; వియ్యానిక !
అయ్యారె ! మీ రేగుట ?

ఒకరి, వెనుక, ఒకరు మిగుల
ఓరిమితో పోయెదరు
ఎవరోయి ! మిము నడిపెడి
యింగితజ్ఞు లింత ఘనులు

ఎవడో ! ఒక నేతలేక
యింత కట్టుదిట్టముగా
మనుషులమె నడవలేము
మరి మీ పోకడచిత్రము !

పనిపాటలు లేక మీరు
ప్రాలుమాలి, తిరగరహో !
ఎక్కడికి ఈ ధాన్యము
ఎవరిళ్లకు ఈ ఎగుమతి ?

మడి, మాన్యములేదు మీకు
మరి ధాన్యము సమకూర్తురు
కళ్ళముకాక గింజయైన
కావె, కొల్లలు, కొల్లలు.


ఏ, ఏ, పొలములతిరిగి
ఈ ధాన్యము గూర్చితిరి ?
ఎవడుచూపె కడు దుర్గమ
మైన బ్రదుకుబాట మీకు ?

ఈ వివేక, మీ పొదపు
ఎటనేర్చితిరో కాని
ఈ శిక్షణ మనిషికున్న
యిక లేములు ఎక్కడివి ?

ఎవరివద్ద చదవకనె
ఈ విద్దెలు నేర్చితిరి ?
కోటి విద్యలైన తుదకు
కూటికె గద, మాకైనను ?

ఏమేమొ, నేర్వదలచి
ఎటకెటకో, పోయెదము
కళ్ళముందు ఎపుడుతిరుగు
ఘనుల కానలేము కదా !

పొట్లపల్లి రామారావు



# పల్లె గడ్డమీన పెద్ద మడుసులు

"ఓ నర్చిమ్మయ్యోయ్ - వుండావా గర్భగుళ్ళో ? ఆహాఁ, ఏందోగిరాకీ దగిల్నట్టుందే ? నీమడ్చి బంగారంగాను, ఎప్పుడు జూసినా అదిదంటూగల్లాకొడ్తా నేవుంటావుగాని, వూరగ్గూసూనే కూకోవుగందా ! ఎవురబ్బాయీడ సానామందుండారే. అం-టా"నయి తోల్టం అయిపోయి, సందాల ఏడూఏడున్నర మద్దెల, కోవఁటి దుకానానికొచ్చిన సుబ్బయ్య, ఎప్పటాలె కోవఁటి నర్చిమ్మయ్యతో గబగబమనిపిత్తా, సీకట్లోకి అట్టసూసే తలికి, దుకానం గుమ్మానికవకాడ మంచమ్మీన తెత్తెల్లగా ఎర్రెర్రగా అయిదు యిగ్రహాలగుపించినయి. "కుటుంబయ గారింటికొచ్చిన పెల్లిజనవేఁట్రా ? నీల గొబ్బిరికాయలు అరికేనా ? యిత్తే యిచ్చావుగానీ, యిదిగో ఒకణా పుగాకూ -అదేందీ-ఒక్కాణీ అయిద్రాబాద్ చిగిరెట్లూ, కాత్తె ఒక్కసూరా, ఏదీ, ఏదీ జల్దీయిచ్చెయ్. ఎల్లిపోవాల దొబ్బునా ?" అన్నాడు సుబ్బయ్య.

"ఆఁఆఁ చాల్లే అపు ఎక్కువయిపోతున్నది-ఎక్కడికా తోసుకరావటం-వూఁవూఁ అటు అటు. కళ్లుకనపట్టెల్లా? అవతల పెద్దమనుష్యులు కూచునుంటే మీదపడ్తూ ఒస్తావ్ ? పో, అటు బయటికి వెళ్ళివుండు కొంచెం-అబ్బే వుత్త పల్లెటూర్రకమండి, బాబుగారూ. నేను గాబట్టి యీవూళ్ళో వుండగలుగుతున్నానుగానీ - అబ్బేచాల యాతన పనిగదండీ. యిదిగో కాయ కొడ్తున్నానుండండి బాబూ-వూఁ. అవతలుండు

మా. గోఖలే



కొంచెం," అంటా గొబ్బిరికాయ టావ్ మనిపించాడు దుకానం నర్చిమ్మయ్యా.

"ఏంది నర్చిమ్మయ్యోవ్ కొత్తగా మాట్టాడ్తుండావ్ ! కొత్తమడ్సింజూసి మాటరానియవయ్యోవ్. మడ్సులమీద పడ్డానంటుండావే, అడగరాదా పెద్ద మడ్సుల్ని తెల్సుద్దీ? ఏవిండి అబ్బాయిగారూ మీద పడ్డానంటయ్యా? తెల్లార్లే ఒత్తాపోతాంగందా - హుఁ - కాత్తె యీ పెద్దమడ్సికి ఎవురన్నా సెప్పండిబాబూ?" అంటా పద్ధతి తెలిసిన పెద్దమడిసి యవారంగా అనేసి, రంగు మడ్సులకల్లి సూత్తుండ సుబ్బయ్యకి, మంచంకోడు కాడ కూకుండ ఎర్రకోక కుర్రమ్మాయి "కి హీ" మన్నట్టనిపించింది—" యియవయ్యా నర్చిమ్మయ్యా దొబ్బునెల్లాల?" అన్నాడు సుబ్బయ్యా. యిగసేసేదేందని కండవాతో ముగమ్మీన నయిమట్టి తుడుసుకుంటా.

"యిహ ఎట్లా వీళ్ళతో ! అవతల పాపం వారు కూర్చున్నారూ, నీతొందర నీదేనా ? కొంచెం నేర్చుకోరాదూ మనుష్యల్నన్నాజూసీ ? ఏదో కుటుంబయ్య గారింట్లో పెళ్ళని వొచ్చారుగాని లేకుంటే యీబాబులు మనపల్లెటూళ్ళకు రావల్సిన గతేంపట్టిందీ - ఏం బాబూ, ఏమంటారు? యిదిగోనండి అమ్మాయిగారు, కాయకొట్టానూ, పుచ్చుకోండి - చూశారా బాబూ, అప్పటికీ చెప్పానండి బాబూ ! ఏదో మీలాంటి పెద్దవారు ఒస్తూవుంటారా, వెధవది కొంచెం ఓగ్లాసూ కాసిన చెంబుతో నీళ్ళు తనుపెట్టిపోతే, చూడండి ఆ నీరుతాగటానికి మీరంత కష్టంపడకబోదురు ! ఏం బేరాల్లే, బాబూ, చూస్తుంటే తమకు నవ్వొస్తుంది గూడా, ఏం చెయ్యను ! నీరు బాగున్నాయా, అమ్మా ? అబ్బే, భేషయిన కాయవుతే !" అంటా లాందరెల్తుర్లో నల్లగా అటిటు ఒరుగుతూ. సంతోసంగా బేరం సాగిత్తుండాడు నర్చిమ్మయ్యా.

"ఏవూరేం ?" అన్నాడు సుబ్బయ్యా.

"ఏవూరూ ! హుఁ ! మహరాజులు వారిది ఏవూరవుతే మనకేం ! యీ పల్లెటూరువారికి వింతగావుంది గావాల్నూ. యిట్లా షికారుగా వచ్చి తిరిగిపోతూ - పాపం ఎండాకాలం కాదూ, ఎప్పుడన్నా తిరుగుతారా పెద్తారా - దయచేయమనంగానే ఒచ్చి మంచమ్మీన కూర్చున్నారు. యిట్లాఅని నిజానికి వారనుకున్నారా నువేచెప్పు ? యింతకీ ఆ లక్షణాలు నీకూనాకూ రమ్మంటే వొస్తాయ్ ! అబ్బో

పట్నాలకు పల్లెటూళ్ళకు ఎంతభేదం!" అంటా కూసేపు రంగు మడ్సుల కల్లి సూత్తా, కూసేపు గొబ్బిరికాయలు కొడ్తా, నవుతా, వొరుగుతా పని కానిత్తుండాడు నర్చిమ్మయ్య.

"ఆర్ది సెన్నాపట్టవా? ?" అన్నాడు సుబ్బయ్య.

"కి హి హిహ్" మంది ఎఱ్ఱకోక కుఱ్ఱమ్మాయి,

"దొబ్బునెల్లాల, నువ్వు పుగాకియ వంటయ్యా, నర్చిమ్మయ్యా ?" అన్నాడు సుబ్బయ్య, ఎఱ్ఱకోక కుఱ్ఱమ్మాయిని సందేఅంగా కనిపెడ్తా,


"తమవేపున యిలాంటి రుచిగల కాయలు దొరుకుతయ్యా, బాబూ? పాపం తమకు ఆలశ్యం అవుతున్నట్లుంది, ఏం చేయను, బాబూ సమయానికి కొడవలి కాస్తా కనపడకపోయె! అడగబోకండి బాబూ వ్యాపారం!" అన్నాడు నర్చిమ్మయ్య, యిశారంగా.

"యిదిగో యియవంటయ్యా పుగాకూ-?" అన్నాడు సుబ్బయ్య, పొద్దు పోటంసూసి.

"ఆఁ, ఏమిటా తొందరా? యీ చిల్లరబేరాల్తోనేనండి బాబూ ప్రాణం విసిగిపొయ్యేదీ—అయినా వుత్త యీ మనుష్యులండి యిక్కడంతా. డబ్బులున్నయ్యా ?" అన్నాడు నర్చిమ్మయ్య.

"డబ్బులూ! పొద్దుటాల్నించి నయిమట్టిదోల్తా నేన్దిరుగుతుంటే, యీడికి యీడ డబ్బులు రామంటే ఎట్టొత్తయ్ ? రేపు తెల్లారి యిటుబోతా యియమంటే యియనూ?" అన్నాడు సుబ్బయ్య.

"చూశారా, బాబూ ? యిహ రోజూ



"ఎందుకురా ఏడుస్తావు ?"

"మానాన్న డబ్బుపంపమంటే పుస్తకాలు పంపాడు !"

కానీ అర్ధణా భాగ్యానికి వీళ్ళచుట్టూతా తిరుగుతూ కూచుంటే, మేమేమన్నా దుకాణంలో బేరంచేసుకోవాలా, బాబూ? అబ్బే చెబుతే మీరునమ్మరుగానీ యిక్కడి వీళ్ళలో యింతే, బాబూ—పుచ్చుకోండి. కొబ్బరి యిదిగో అమ్మాయిగారూ యిహిఁహిఁ వెన్నపూసే! చెమ్మాలేదు మన్నించండి, బాబూ." అన్నాడు నర్చిమ్మయ్య.

"ఆనక పుల్లయ్యకి ఎటనన్నా సెప్పుకుంటాగానీ, యిదిగో యీ రూపాయి కాయితం దీసుకొని పుగాకు చిగిరెట్టు యియవయ్యా నీ మడ్చిబంగారంగానూ?" అంటా బొడ్డోనించి బద్రంగా రూపాయి కాయితం దీసాడు సుబ్బయ్య. "వుహుఁ చూశారా బాబూ పద్ధతి? అహఁ మాట వరసకి—ఒక్క మినిట్ మన్నించండి బాబూ మీకే హాయిగా వుంటుంది—వూఁ తేమరీ ?" అన్నాడు సుబ్బయ్య.

"ఒక్క సూర కాత్తె బెట్టు ?" అన్నాడు సుబ్బయ్య.

"వఁణుగు నలభయి రూపాయలు పదపద—అబ్బే నమ్మండి బాబూ పందే రాల్తో మాకెంత నష్టమో—వూఁవూఁ." అన్నాడు నర్సిమ్మయ్య.

"సెక్రం దిప్పుతుండావుగాని, సాల్లే నర్సిమ్మయ్యోవ్! ఎప్పుడన్నా బండి కావాల్సొచ్చుద్ది గ్యాపకం బెట్టుకో" ఎల్లిపొయ్యాడు సుబ్బయ్య. కోడుకాడ ఎర్రకోక కుర్రమ్మాయిని ఓసూపుసూత్తా.

"చూశారా, బాబూ, తమాషా — ఏమిటి? లేస్తున్నారా బాబూ! భద్రంగా లేనండి చీకటి—ఆఁ కొంచెం చల్లబడ్డది లేండి— ఒక్క—సోడా, బాబూ అబ్బే దానికేం, బాబూ! అంత మేలురకం కాదుగానీ, అయినా రుచిచూసి చెప్పండి బాబూ. ఏదో పల్లెటూరి వ్యాపారమా, ఎప్పటికయినా జ్ఞాపకంవుంటే అంతే చాలు—కాయ పావలా బాబూ. అయిదు కాయలూ రూపాయిపావలా — తమకు తెలుస్తుందిగా, బాబూ—అబ్బే, లేదు, బాబూ — అయ్యొయ్యొయ్యొ! కాయ బేడార్ధణా! విచారించి చూడండి బాబూ రూపాయిపావలే — తమరే మా దౌర్భాగ్యానికి యిట్లా సెలవిస్తే ఎట్లాచెప్పండి బాబూ - అబ్బె బ్బె బ్బె. బేడాముక్కా—నా ఎంతమాటా - తమకు నేనేం - పద్దాలు గణాలా! మరి - అబ్బే - నిజం-తమ-యిహ - తుచ్ - "అటనే నిలబడి మెలికలు తిరిగిపొయ్యాడు నర్సిమ్మయ్య. సేతులు మెల్దిప్పుకుంటా.

## జూన్ నెల సొల్యూషన్

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ము | ఖ | 2 ము | ■ | ■ | ■ | 3 వ | ర్ణ | 4 ము |
| స | ■ | 5 ని | 6 సి | ■ | 7 దా | రి | ■ | వ్వ |
| 8 లి | 9 పి | ■ | 10 రా | 11 కా | సి | ■ | 12 గి | న్నె |
| ■ | 13 కి | 14 టి | ■ | ళ | ■ | 15 భూ | రి | ■ |
| ■ | ■ | 16 చె | త్త | ■ | 17 నే | త | ■ | ■ |
| ■ | 18 చె | ట్టు | ■ | 19 మూ | ■ | 20 ము | 21 ది | ■ |
| 22 మ | ర | ■ | 23 కా | గ | 24 డా | ■ | 25 ళ | 26 శి |
| ల్లి | ■ | 27 కీ | లు | ■ | 28 కూ | 29 జా | ■ | ఖం |
| 30 న | లు | డు | ■ | ■ | ■ | 31 గా | ర | డి |

# పిరికి గుండె

కొ. కుటుంబరావు

కోటీశ్వర్రావు ఉద్యోగం సంపాదించాడు. అతనికింకా ఈ విషయం యధార్థ విషయంగా తోచటంలేదు. కలగా వుంది. ఏ క్షణాన అయినా, ఈ కల అంతమైపోయి తాను తన పూరిగుడిసెలో కుక్కిమంచంలో లేచి కూచోవచ్చు. ఒకటి రెండుసార్లు కలలో పూరిగుడిసే, కుక్కిమంచమూ కనిపించినై కూడానూ. మరోసారి కలలో తన ఉద్యోగం పోవటమే గాక ఉద్యోగం చేస్తానని వచ్చినందుకు అధికార్లు తనను మేడలమీదినించి వీధుల్లోకి విసిరిపారేశారు; వీధిలో ట్రాములూ బస్సులూ తనమీదిగా తోలటానికి ప్రయత్నించారు.

చిత్రమేమంటే కోటీశ్వర్రావు దరిద్రం అనుభవించినంత కాలమూ చలించలేదు. ఈ దౌర్భాగ్యపు ప్రదేశంలో తనకన్నా దరిద్రులు—ఈ పూరిగుడిసెకూడా లేనివారు—ఏరోజూ సరిగా తిండి తినని వారున్నారని అతనికి తెలుసు. వారికిలేని సంస్కారం తనకున్నది; దారిద్ర్యాన్ని ధైర్యంతో ఎదుర్కొగలగాలి—ఎదుర్కొన్నాడు. అతను కలంపట్టి ఒక కధో పద్యమో రాసినప్పుడుకూడా దారిద్ర్యాన్ని గురించి ఒక్కముక్క రాయలేదు. కారణం: సాహిత్యంలో సొంత ఘోష రాసుకోవటం అతనికి నీచంగా కనిపించింది. తన సమస్యల్ని ఇతర్లమీద రుద్దటానికి తనకేమి అధికారం వుంది? ఇతర్లంతా ఇంచుమించు సొంత గొడవలే సాహిత్యంలోకి తెస్తున్నారని అతనికి తోచి కష్టంవేసేది. ఆ సాహిత్యాన్ని ప్రజలాదరించటంకూడా అతనికి శోచనీయంగా తోచేది. ఒక్కోసారి కలంపట్టితే చెయ్యి వొణికి రాత సాగేదికాదు.

సాహిత్యంలోనూ భావనా ప్రపంచంలోనూ విలవైన విషయాలన్నీ అభౌతికమైనవిగానే అతనికితోచేది. రచనలోనుంచి ఒక నీతో, ఒక తాత్వికవిషయమో రాందే అది సాహిత్యమల్లే అతనికి కనిపించేదికాదు. యధార్థ జీవితంలో ఇది పొసగదు. ఒక నీతినిగాని తాత్విక సిద్ధాంతాన్నిగాని జీవితానికి తగిలించాలని ప్రయత్నిస్తామేగాని, జీవితంలోనుంచి అవిరావటం అతనికెక్కడా కనిపించలేదు. సాహిత్యానికి జీవితానికి అదే ముఖ్యమైనతేడా అనికూడా అతను విశ్వసించేవాడు. తనకు నచ్చిన తాత్విక నైతిక సిద్ధాంతాలను అతను సులభంగానే ఆచరణలో పెట్టగలిగినట్టు కనపడ్డది. అతను అబద్ధం ఆడి ఎరగడు. తన ప్రవర్తనను జయప్రదంగా శాసించగలిగాడు. అతని ఉన్నతమైన ఆశయాలు చాలావరకు అతన్ని దారిద్ర్యంలో ఉంచటానికి తోడ్పడ్డ విషయం నిజమేకాని అతను దాన్నిగురించి చింతించలేదు. ముఖ్యంగా దారిద్ర్యం అతన్ని బాధించకపోవటానికికూడా కారణం అదే.

కాని ఇప్పుడు—తీరా ఉద్యోగం సంపాదించినాక—తనలో దారిద్ర్యంగురించిన పిరికితనం ఉందనేది బయటపడింది! ఈ ఉద్యోగం పోతుందనే భయం తన్నెందుకిట్లా నిద్రావస్థలో పట్టుకుని వేధించాలి? ఈపాటి ఆర్థిక బలంతోనే తన నైతికబలం దెబ్బతిన్నదా? ఏమో! డబ్బు పాపిష్టిది. ఉద్యోగం వొదిలేసిపోతే? మళ్ళీ ఆ గుడిసెలోకేగా? వొళ్ళు గరిపొడిచింది. ఇక సందేహమేమీలేదు, తనకు దారిద్ర్యంచూస్తే ఇప్పుడు భయమే! కాస్త ఆలోచించిచూసుకుంటే ఈభయం నిద్ర అవసరంలేకుండానే తనకు తెలిసొచ్చేటట్టుంది!

తన పిరికితనంగురించి ఈవిధంగా ఆలో చించినకొద్దీ నిద్రలో దరిద్రపు కలలురావటం కొంత తగ్గింది. డబ్బుగురించి మళ్ళీ తాను నిర్లిప్తత సంపాదించుకోవాలని పనిపెట్టు కున్నాడు కోటీశ్వర్రావు. కాని నిర్లిప్తత కుదర్లేదు. అన్నీ భయాలే. ఈక్షణంవరకూ తన జేబులోవున్న డబ్బులు ఇంటిదగ్గిర అప్పు చేసి తెచ్చినవే! ఉద్యోగమైతే వచ్చిందిగాని జీతండబ్బులు చేతిలోపడేవరకూ తనస్వార్జిత మంటూ ఉండదు. ఎక్కడో అప్పుచేసితెచ్చిన డబ్బుగురించి నైతికదృష్టి కలవాడికి నిర్లిప్తత సాధ్యమౌతుందా? వొట్టిది. అదీగాక—తన ఉద్యోగంకాస్తా మధ్యలోపోతే? ఏదో చెయ్య రాని తప్పుచేసి తనను అధికారులు ఉద్యో గంలోనుంచి తొలగించి, జీతండబ్బు లివ్వక పోగా జరిమానా తగిలిస్తే?

నిద్రలో, కలలో, వెంటాడే ఈ భయాలు తనకు పట్టపగలే రావటంచూసి ఒక్కసారిగా కోటీశ్వర్రావు ఉలిక్కిపడ్డాడు. అంత దారు ణం మామూలు మనుషులకెందుకు జరుగు తుందీ? ఎన్నిలక్షలమంది ఉద్యోగాలు చెయ్యటంలేదూ? వాళ్ళకి జరగని దారుణం తనకెందుకు జరుగుతుందీ? తన మనస్సింత బలహీనమైపోయిందేం? తాను ఇంతకాలమూ చేసిన తాత్విక నైతిక చింతన కంతకీ ఫలితం ఇదా?

మొదటినెల జీతం వచ్చింది. కొంత దగ్గిర వుంచుకుని మిగతాది అప్పులో చెల్లువేస్తూ ఇంటికి పంపాడు. కాని జేబులో నెల ఖర్చుకు గాను ఉంచుకున్న కొత్తనోట్లు తన మన స్సును మాటిమాటికీ ఆకర్షిస్తున్నాయి. జేబులో చెయ్యి పెట్టినప్పుడల్లా అది చేతికి తగిలి వొళ్ళంతా గరి పొడుస్తున్నది. పక్క నున్నవాళ్లు చెప్పేమాటలు వినిపించకుండా పోయి సంభాషణ కిబ్బంది కలుగుతున్నది. ఇది నిజంగా అన్యాయం! తనకు కలగవలి సిన అనుభవం కాదు! తనకి నిజంగా డబ్బు మీద ఇంత మమకారంలేదు. ఇది క్రమేణా పోతుంది. తాగుడంటే అసహ్యపడే వాడు మట్టుకు తాగితే నిషా ఎక్కదా? ఇదీ అటు వంటిదే! రెండుమూడు నెల్లు ప్రైమిస్తే ఈ నోట్ల మీద కలగవలిసిన తృణీకారభావం దానంతట అదే కలుగుతుంది.

రెండుమూడునెల్లు గడిచాయి. ఇంటిదగ్గిర బాకీ తీరిపోయింది. ఇకనుంచీ నెలకు పాతిక చొప్పున మిగుల్చుకోవచ్చును. దగ్గిరుంటే ఖర్చయిపోతుంది. మీనన్‌లాగా బాంకులో వేస్తే పడివుంటుంది. మీనన్‌కు తనకంటె తక్కువ జీతం. వాడు నెలకు నలభైకూడా బాంకులోవేస్తాడు. వాడు ఉద్యోగం ప్రారం భించి ఏడాది అయిందో లేదో బాంకులో మూడొందలున్నది.

కాని బాంకు అనగానే పాస్‌బుక్కులూ, సంతకాలూ అన్నీ ప్రతిబంధకాలే! ఏమయినా డబ్బు దగ్గిరఉంచుకోవటం తద్దినం. రోజూ పెట్టెతెరిచినప్పుడల్లా కనిపిస్తూ వుంటుంది.

మీనన్‌వేసే బాంకులోనే తనుకూడా మూడోనెలాఖర్న వచ్చిన జీతంలోనుంచి ఒక పాతిక వేద్దామనిపించింది. ఏమీ కష్టంలేదు. మీనన్ అయితే ఆరవైవేసును. ఎందుకు వృధాగా డబ్బుతగలెయ్యటం? తను ఎంత దరిద్రం అనుభవించలేదు? తిండీ, బట్టా, గది అద్దె, ట్రాముచార్జీలూ తప్పిస్తే మిగతా దంతా వృధాయేగద?

నాలుగోరోజున పాస్‌బుక్కు చేతి కొచ్చింది. కొత్తబుక్కు. చక్కని అక్ష రాలతో యాభైరూపాయలూ జమవేసివుంది. యాభైరూపాయల నోట్లనుచూసినా కలగని ఆనందం కలిగింది. ఒకటికి పదిసార్లు చూసుకో బుద్ధి అయింది. దానికింద డజను యాభైలు ఊహించుకో గలిగాడు కోటీశ్వ

ౡావు. ఆరొందలు! ఒక్క సంవత్సరాని కల్లా! వచ్చేసంవత్సరం ఈపాటికి! కాని భయంపట్టుకుంది! ప్రతినెలా సాధ్యమవు తుందా? తనకు జబ్బుచేసి డాక్టరుకు నూరు పొయ్యవలిసి వస్తుందేమో? ఆనెల జీతం కూడారాదూ! ఒకవేళ తన చెల్లెలుగాని మరెవరన్నాగాని, "ఇబ్బందిలో వున్నాం, పదిరూపాయలు పంపు," అంటారేమో?

తనభయాలు చూసి కోటీశ్వర్రావు ఆశ్చర్య పోయినాడు. తనకేం తెగులుపుట్టింది? అంద రికీ ఇటువంటి భయాలుంటాయా? ఆ సీతా పతి చిల్లిగవ్వ మిగల్చకుండా జీతమంతా నిశ్చింతగా ఖర్చు చేసేసుకుంటాడే! అతన్ని చూసి తను అసహ్యపడలా? కాని తనకన్న వాడికే ఎక్కువధైర్యం ఉందే? తనకెందుకీ పిరికితనం?

ఖర్చు అనుకున్నంత పొదుపుగా వెళ్ళటం లేదు. ఎవరో సినిమాకి పిలుస్తారు, కాఫీ హోటలుకు పిలుస్తారు. తనడబ్బుకూడా వాళ్లే ఇచ్చేస్తారు. ఎంతకాలమని వాళ్ల ఖర్చున తినటం? రెండుమూడుసార్లు తనే సినిమాకు ఖర్చుచేశాడు. తనతో తిరిగేవాళ్ళని కాఫీ హోటల్లో మేపాడు. పదిరూపాయల అదనపు ఖర్చయింది. ఆ పదిరూపాయలూ బాంకులో నుంచి తియ్యవలిసొచ్చింది. తీశాడు. పాసు బుక్కులోవున్న 50 కాస్తా 40 అయింది. ఆ నలభై అంకె చూస్తున్నకొద్దీ ఏడు పొచ్చింది. ఆ అంకె అంత దుర్భరంగా వుంటుందని అతనదివరకెన్నడూ ఊహించ నైనాలేదు. పైగా అతనా పదిరూపాయలూ కాషియరు దగ్గిర్నుంచి పుచ్చుకుంటే సిగ్గే సింది. తనపక్కఉన్నవాళ్ళు రెండువందలూ, మూడువందలూ, పదిహేనువందలూ పుచ్చు కుంటున్నారు. పదిహేనువందలు! పదిహేను పచ్చకాగితాలు నిర్లక్ష్యంగా పుచ్చుకొని వెళ్ళి పోతున్న పెద్దమనిషికేసి దీనంగా చూశాడు కోటీశ్వర్రావు. తనకి డబ్బంటే ఏమిటో అసలు తెలుసునా? యాభై వెయ్యటమూ, ఏడుస్తూ పది మళ్ళీతియ్యటమూ ఇంతే తన జన్మ! ఒక పదివేలు బాంకులోవేసే శక్తి తనకెప్పుడొస్తుంది? డబ్బు తుచ్ఛమయిందే అవుగాక! ఆమాట అనుకోవటానిక్కూడా తన కర్హతలేదే! వెధవ యాభై బాంకులో వెయ్యటానికి తనకు పెట పెట లవుతున్నది గదా!

ఇంక ఏమైనాసరే, కోటీశ్వర్రావు ప్రతి కానీకూడా ఆదాచెయ్యాలనుకున్నాడు. పిసిని గొట్టుతనం కాదుసుమా! లోభం అంతకంటె కాదు! కాని దీని అంతేమిటో చూడాలి, చాలాడబ్బుంటేతప్ప తనకు నిజమైన నిర్లి ప్తత నిజంగా అలవడదు!....తన ఆఫీసు లోనే అయిదువందలూ, నాలుగువందలూ సంపాదించేవాళ్ళనిచూసి ఓర్చలేనితనం కలిగింది కోటీశ్వర్రావుకి. ఎందుకో, వాళ్లు డబ్బుకు గడ్డితినేవాళ్ళల్లే కనిపించారు.

అనుకున్నంతా అయింది. అతను డబ్బు కూడబెట్టటం ప్రారంభించిన రెండోనెల్లోనే చెల్లెలు పదిరూపాయలు పంపమని రాసింది. కోటీశ్వర్రావు మరో ఆలోచనలేకుండా పంపాడు. కాని తన చెల్లెలు డబ్బుకోసం తనకిరాయటం అన్యాయమనిపించింది. ఆ చెల్లెలు పెళ్ళికి బోలెడంత ఖర్చయింది. తన బావమరిదికి ఉద్యోగంలేదు, అల్లాడు తున్నారు అదీనిజమే. కాని అతను తన దారిద్ర్యాన్ని దీక్షతో సహించక తన చెల్లెలి ద్వారా ఇట్లా రాయించటం పిరికిపని! పంపిం

చటానికి తన కష్యంతరమనికాదు ! అతను కూడా తనలాగే ఏదో చూసుకోగూడదూ ? పెళ్ళాం పిల్లలుకూడా కలవాడుకదా !

తను ఏమీ చూసుకోకుండా గడిపిన ఏళ్ళు కోటీశ్వర్రావుకా క్షణాన జ్ఞాపకం రాలేదు.

రాను రాను కోటీశ్వర్రావుకు పిరికితనం తగ్గిపోయింది. పాసుబుక్కులో పెరిగేసంఖ్య అతన్నిప్పుడు గల్లంతు చెయ్యటంలేదు. కాని అతనికిప్పుడు డబ్బుమీద నిర్లక్ష్యమూ పోయిందిమరి.

"తప్పేముందీ ? డబ్బుకన్న ప్రధాన మయిందిలేదు. డబ్బు వెధవదే కావచ్చుగాక. ప్రపంచం మనని మనడబ్బునుబట్టే లక్ష్య పెడుతుంది." అనుకున్నాడు కోటీశ్వర్రావు.

అతనిప్పుడు ధారాళంగా రచనలుకూడా చేస్తున్నాడు. తృణమో కణమో ఇచ్చే పత్రి కలకే పంపుతున్నాడు. రానురాను అతని పైసంపాదన పెరుగుతున్నది. ఏదైనా తర్జు మాలు చేయించుకునీ, ప్రత్యేక వ్యాసాలు రాయించుకునీ అతనికి డబ్బిస్తున్నారు. డబ్బు పుచ్చుకుని అతను ఒక నటుడిమీద ప్రశంసా వ్యాసం రాశాడు.

యుద్ధంవచ్చింది. ఎవరో స్నేహితుడు తన్నొక వ్యాపారంలో చేరమన్నాడు, గత యుద్ధంలోలాగే వస్తువుల ధరలుపెరిగి బాగా లాభం వస్తుందన్నాడు. కోటీశ్వర్రావు తాను పోగుచేసిన అయిదు వందలూ స్నేహితుడి కిచ్చేశాడు. ఏవో వస్తువులు కొన్నారు, అమ్మారు. చాలా డబ్బొచ్చింది. వ్యాపారం సాగింది. కోటీశ్వర్రావు భాగం పెరిగింది. ఒక సంవత్సరంకాలంలో అతను రెండువేలు లాభంతీశాడు. ముఖ్యంగా మందులమీదచాలా లాభం వచ్చింది.


గుడ్డలవ్యాపారం చేతామన్నాడు స్నేహి తుడు. సరేనన్నాడు కోటీశ్వర్రావు. స్నేహి తుడు బొంబాయివెళ్ళి మల్లులూ, పాప్లినులూ, ట్వీల్లూ పట్టుకొచ్చాడు. రహస్యంగా అమ్మారు. చాలా లాభంవచ్చింది.

మరో సంవత్సరం జరిగింది. కోటీశ్వ ర్రావు అయిదువేలు చేసుకున్నాడు. వ్యాపారం రక రకాలుగా సాగుతున్నది. ఇప్పుడంతా దొంగవ్యాపారమే. స్నేహితు డెక్కడెక్క ణ్ణుంచో సరుకులు తవ్వుకొచ్చి రెండింతలకీ మూడింతలకీ అమ్మేస్తున్నాడు.

ఉన్నట్టుండి దొంగవ్యాపారం బయట పడింది. కోటీశ్వర్రావు ఏమాత్రమూ భయపడ లేదు. తనకేమీ తెలియదనీ, వ్యాపారమంతా తన స్నేహితుడే చేస్తున్నాడనీ కోర్టులో చెప్పు కున్నాడు. కోటీశ్వర్రావుకి వ్యాపారం సంగతి పూర్తిగా తెలుసునని అతని స్నేహితుడు రుజువుచేశాడు. స్నేహితుడికి ఎక్కువగా శిక్ష పడింది. కోటీశ్వర్రావు తేలికలో పోయినాడు. రెండువేలు జరిమానా, ఆరునెల్లు శిక్షపడింది.

ధైర్యంగా కోటీశ్వర్రావు జరిమానా కట్టి జైలుకువెళ్ళాడు. అతనిపేర బాంకులో ఇంకా మూడువేలుంది ! ఆర్నెల్లలో యుద్ధం అయి పోదు. దొంగమార్కెట్టు అంతకన్నా అయి పోదు. భయపడటాని కిందులో ఏముందీ ?

———



# ఎనిమిది-ఎనిమిది

మునిమాణిక్యం

ఒక అమ్మాయీ అబ్బాయీ. ఆ అమ్మాయి చాల చక్కనిది. పదహారేండ్ల వయస్సులో, మాంచి యవ్వనంలో వుంది. ఆ అమ్మాయికి పెండ్లి అయింది; కాని అత్తవారింటికి ఇంకా వెళ్ళలేదు.

ఆ పిల్ల మొగుడికి ఇరవైఏండ్లు. కొంచెం పొడుగ్గా చామనచాయగా అందంగా వుంటాడు.

ఆ అబ్బాయి అత్తవారింటికి వచ్చాడు ఒక రోజున. అల్లుడు వచ్చాడని అత్తగారు మర్యాదచేసి మంచిభోజనం పెట్టింది. ఆ అత్తగారూ, మామగారూ ఎంత సంతోషించారో ఎట్లా మర్యాద చేశారో, అదంతా వివరించ నక్కరలేదు. ఆ చిన్నవాడు అత్తగారింట్లో ఉన్న మూడురోజులూ ఎల్లా ప్రవర్తించాడో వినాలి.

ఆ అబ్బాయి వచ్చినప్పటినుంచీ ఎవరి కోసమో నిరీక్షిస్తున్నట్లు చూడటం మొదలు పెట్టాడు. ఫలహారం చేస్తున్నా భోజనం చేస్తున్నా, అతనిచూపులు ఒకగది కిటికీల మీదికే ప్రసరించేవి; అక్కడా, ఇక్కడా, అంతటా వెతికేవి.

దాపరికం ఎందుకు ? ఆ అమ్మాయి ఎక్కడుందో, ఒకసారి తనకళ్ళకు కనపడితే బాగుండునని అనుకొన్నాడు అబ్బాయి.

గదిలో కనక కంకణ ఝణఝణత్కార ధ్వనులు వినిపించేవి. అతని నేత్రాలు సముజ్వలములు అయ్యేవి. వాటిలోనుంచి రకరకాల కిరణాలు ఉద్భవమై దిక్కుదిక్కులా ప్రసరించేవి. అందులో కొన్ని నిశిత మైనవి, కఠిన శిలానిర్మితములైన కుడ్యములను చీల్చుకొని అంతఃపురాలలో ప్రవేశించి తిరిగి వస్తూవుండేవి. ఆ పెద్దఇంట్లో ఆపిల్ల ఎక్కడ దాక్కుందో కనపడలేదు.

అతని మనోవీధి అంతా నిబిడాంధకార బంధురమైపోయింది. కాని మధ్య మధ్య శయ్యామందిరాంతర్భాగాలలోనో, నిష్కుట ప్రాంతాలతోనో, గవాక్షాలలోనో ఆపిల్ల తళుక్కుమనేది. అదికూడా లేకపోతే అతడు తత్ క్షణం వెళ్ళిపోయేవాడు.

ఆ కుర్రవాడి తలలో విపరీతపు ఆలోచనలన్నీ వచ్చిపడ్డాయి. ఎవ్వరూలేకుండా చూచి ఆపిల్లతో మాట్లాడాలనీ, ఆ అమ్మాయి కళ్ళల్లో ప్రణయజ్యోతులు వెలిగించాలనీ బుద్ధిపుట్టింది.

ఆ సాయింత్రమే ఆ అమ్మాయిని కిటికీలోనుంచి చూశాడు. ఆపిల్ల మళ్ళీచూచింది. పిల్లలు ఇల్లాగ ఒకరివంక ఇంకొకరు చూచుకొన్నారని విని నక్షత్రాలు ఆకాశంలోనుంచి తొంగిచూచి నవ్వుకొన్నవి. ఈ కబురువిని ఎక్కడోవున్న గాలిదేవుడుకూడా రంయ్యిన పరుగెత్తుకుంటూ వచ్చాడు. వచ్చి ఆపిల్ల బుగ్గలనూ, ముంగురులనూతాకి ముద్దెట్టుకొని వెళ్ళాడు ఆ ముసలితాత,

ఆరాత్రే ఒంటరిగా వుండగా ఆ పిల్లను మాట్లాడిద్దామని ఆ అబ్బాయి అనుకొన్నాడు. స్నానంచేసి వస్తూ వస్తూ ఆగది కిటికీవంకే ఊరికేచూస్తూ నడిచాడు.

ఆరాత్రి ఆ కుర్రవాడికి సరిగ్గా నిద్రపట్ట లేదు. ఆ పిల్లను మాట్లాడిద్దామని పట్టుదల మాత్రం ఎక్కువైంది. ఆరాత్రి అంతా అల్లాగ అనుకొంటూనే నిద్రపోయినాడు. తెల్లవారింది. మళ్ళీ అనుకొన్నాడు సమయం జూచి ఆపిల్లను పలకరిద్దామని.

రెండవరోజు రోజు రోజంతా ఎంత ప్రయత్నంచేసినా అతనికి ఆపిల్ల ఒంటరిగా చిక్కలేదు. ఆ ప్రొద్దస్తమానమూ ఆ చిరుత ప్రాణి ఎంత తల్లడిల్లిందో నేను చెప్పలేను. చాలా జాలికలిగించే విషయము ఏమిటంటే పాపం ఆబిడ్డ అల్లాగే నిరుత్సాహంతో, నిస్పృహతో ఆ నిశీథంలో నిద్రపోయినాడు.

ఆరాత్రి అతడు సరిగా నిద్రపోయినాడని ఏ దుర్మార్గుడూ అనడు. అయితే ఒకటి రెండుసార్లు కాస్త కునికితే కునికివుండవచ్చు. అదైనా కలతనిద్రే: మెలుకువ వచ్చినప్పు డల్లా, అనుకొనేవాడు ఆపిల్లను తప్పకుండా రేపు మాట్లాడించాలే అని.

రెండురోజులు, అంటే ఒకలక్ష సెకనుల కాలం, వృథాగా గడిచిపోయింది. ఒక్క నిమేషమాత్రం ఒక్కమాట మాట్లాడటానికి అతనికి అవకాశం చిక్కలేదంటే ఏమనుకో వాలె! విధి అల్లాచేసింది! అవకాశం వచ్చి నప్పుడు ఆపిల్ల ఈ కుర్రవాణ్ణిచూచి చటు క్కున వెళ్ళిపోతూ వుండేది. పాపము ఆ అబ్బాయికి ఏమీ తోచలేదు. అంతేగాని అతడు ప్రయత్నమేమీ తక్కువ చేయలేదు.

ఇంతలో భళ్ళున తెల్లవారింది. అది మూడోరోజు. ఆ మరునాడు వెళ్ళిపోదామని కూడా అనుకొంటున్నాడు. ఆరోజున అయినా తనకు మంచి అవకాశం కలిగించవలసినదని భగవంతుణ్ణి ప్రార్థనచేశాడు ఆ అబ్బాయి. అతడు ఎంతగా బాధపడ్డాడో తెలిసికోగల రసజ్ఞులుకూడా లేరుగదా ఈ లోకంలో!!

## 2

భగవత్కృపవలన ఆరోజున ఆ అబ్బాయికి, మంచి అవకాశం వచ్చింది. ఎల్లాగంటే ఆ పిల్లవాడు మేడమెట్లు ఎక్కుతూవుంటే అదే సమయానికి ఆపిల్ల కిందికి దిగుతూవున్నది. ఆ అబ్బాయి వస్తున్నాడని ఆపిల్లకూ తెలిసిందీ, ఆ అమ్మాయి కిందికి దిగుతున్నదని ఆపిల్లవాడికీ తెలిసింది.

ఆ అబ్బాయి ఇల్లా అనుకొన్నాడు మనస్సులో. 'ఆపిల్ల నన్ను జూచి తప్పక వెనక్కు తిరిగి పారిపోవటానికి ప్రయత్నం చేస్తుంది. అప్పుడు నేను 'ఏయ్ అమ్మాయ్ మాట' అందామని నిశ్చయించుకొన్నాడు.'

సరిగ్గా ఆ సమయానికే ఆ పిల్లకూడా ఇల్లా అనుకొన్నది మనస్సులో. 'ఈ పిల్లవాడి సంగతి ఏమీ బాగుండలేదు. రెండు రోజులనుంచీ చూస్తున్నాను. పోనీ పోనీ అని ఊరుకొంటున్నాను. సరే కానీ! వస్తున్నాడు. కదా, నన్ను జూచి తొలిగిపోతాడో మర్యాదగా, సరే సరి. అల్లాగ లేక సరాసరి పైకి వచ్చి నన్ను రాచుకొంటూ పోయినాడో విల వేసి నాలుగు చీవాట్లూ వెయ్యాలె.

ఇల్లాగ ఇద్దరూ కృతనిశ్చయులై ఒకరికి ఎదురుగా ఒకరు నడిచారు. ప్రచండమైన వేగంతో పోతూవున్న రైళ్ళు ఒకదానితో ఒకటి కొట్టుకోబోతున్నవి. ఒక పరమాణువు మరియొక పరమాణువుతో ఢీకొనబోతున్నది.

ఈ సంఘటనను గురించి చదువుతూ వున్నప్పుడు ఎవ్వరి గుండెలు కొట్టుకోకుండా వుంటయ్యో, ఎవ్వరు నిబ్బరంగా వుండగలరో నేను వూహించలేను.

ఒక స్త్రీ హృదయం, మరొక పురుష హృదయం సమాకర్షణపొంది వున్నట్లయితే ఇంతగా భయపడవలసి వుండేదికాదు. ఇక్కడ ఒకదానిని ఒకటి ప్రతిఘటిస్తున్నది. శివ, శివ ఎల్లాంటి అపచారము జరుగబోతున్నదో కదా! ఆ పిల్లవాడు పైకి వస్తున్నాడు—! ఆపిల్ల మెట్లు దిగుతూవున్నది!

అరెరే, ఆ పిల్లవాడు రాబోయే ఉపద్రవాన్ని ఏమాత్రం తెలుసుకోలేకుండా వున్నాడు సుమా! "అరే అబ్బాయీ, ఆపిల్ల పల్లెటూరులో పెరిగింది. ఔపాసన కాకముందు మొగుడితో మాట్లాడటం మహాపాపం అని అనుకొనే మనిషి. దానికి తోడు పెంకె. నీవు మూర్ఖపు పట్టుదలతో ఆ అమ్మాయిని పిలిచినా, చెయ్యి పట్టుకొన్నా ఆపిల్ల పెద్దగా కేకలువేసి, వాళ్ళ అమ్మనూ, వాళ్ళనూ పిలిచి నిన్ను అల్లరి పెడుతుంది. మరీ మూర్ఖం చేస్తివా నీ చొక్కాపట్టుకొని లాగి, నిన్ను మెట్లమీదినుంచి క్రిందికి నెడుతుంది కూడానూ!

"ఏయ్! అమ్మాయి! నీవు మటుకూ! ఏమిటా పెంకెతనము! ఆ అబ్బాయి మొగుడు గదా, అతను వస్తున్నాడని తెలిసికూడా తగుదునని యెదురుగా పోవటం యేమంత మంచిపని!"

కాని ఆపిల్ల మెట్లు దిగుతునేవుంది. ఈ అబ్బాయి మెట్లు ఎక్కుతునే వున్నాడు.

అబ్బాయి తల వంచుకొన్నాడు. కొద్దిగా భయపడుతూ వున్నట్లుకూడా స్పష్టంగా తెలుస్తునేవుంది. కాని అమ్మా! అతను రెండు రోజులనుంచీ ఆలోచించి ఆలోచించి, చివరకు బాగా ధైర్యం చిక్కబట్టాడు. ఆ అమ్మాయిని పలకరిద్దామని చాలా గట్టిగా నిశ్చయించుకొన్నాడు.

ఆ పిల్లకూడా ఆ కుర్రవాణ్ణి అవమానపరుద్దామని గట్టిగా అనుకొన్నట్లుంది. లేకపోతే ఎందుకు అల్లాగ భయం లేకుండా వస్తుంది?

"అరే, వస్తున్నాడు!" అనుకొన్నది ఆ పిల్ల, కుర్రవాడు మలుపుతిరిగి ఆమె దృష్టిపథంలోకి రావటంతోనే. "అదుగో వస్తున్నది!" అనుకున్నాడు ఆ పిల్లవాడు, ఆమె మలుపు తిరిగి అతని దృష్టిపథంలోకి రావటంతోనే.

కొద్దిగా గమనవేగం తగ్గినా, ఇద్దరూ ఎదురు బొదురుగా నడుస్తునే ఉన్నారు. మరీ సమీపంలోకి వచ్చారు.

తొణకకుండా నడుస్తున్నాడు కుర్రవాడు గంభీరంగా, ధైర్యంగా. ఆ పెంకెపిల్ల ఎదురుగా వస్తునేవుంది సుస్థిరబుద్ధితో స్తిమిత మతితో.

అరిబాబా! ఎంతప్రళయం జరగబోతున్నది! తప్పకుండా, ఇదేదో పెద్ద అల్లరి కావలసిన విషయమే!

అయితే తమాషా ఏమిటంటే ఏవిధమైన అల్లరీ జరగలేదు! ఆపిల్లదారిని ఆపిల్ల వెళ్ళిపోయింది; ఈపిల్లవాడిదారిని పిల్లవాడూ వెళ్ళిపోయినాడు. అమ్మాయి అతగాడిని కన్నెత్తి అయినా చూడలేదు. ఆపిల్లవాడు ఆ అమ్మాయిని నోరెత్తి అయినా పలుకరించలేకపోయినాడు.

అబ్బాయి నావంక చూచినట్లయితే ముక్కచీవాట్లు వేసేదాన్ని అనుకొన్నది ఆపిల్ల. ఆపిల్ల తలవంచుకొని వెళ్ళిపోయిందిగాని ఒక కన్ను నామీద పారేసినట్లయితే తమాషాచేసేవాణ్ణి అనుకొన్నాడు ఈ ధీరహృదయుడు.

ఇల్లాజరిగింది ఆరోజున ప్రొద్దున ఎనిమిది గంటల యాభై నిమిషములకు.

# 3

పదిగంటలకల్లా భోజనాలైపోయినవి. పదకొండింటికల్లా ఇంట్లోవున్న ఆడవాళ్ళ భోజనాలుకూడా అయిపోయినవి. ఆపిల్లవుండే గదికూడా ఆ అబ్బాయి గుర్తుపట్టి ఇక సాగించాడు తన దండయాత్రలు.

ఆపిల్ల ఆ కిటికీదగ్గరకు ఎందుకోరావటం తోనే ఈ అబ్బాయి ధైర్యంగా ఆ అమ్మాయి వంకచూచి నవ్వాడు. నిజంగా ఆగుండె నిబ్బరాన్ని మెచ్చుకోక తప్పదు.

తనేదో ఘనకార్యం చేశానని ఆ అబ్బాయి అనుకొన్నాడు కాని ఆపిల్ల ఏమనుకొం

టున్నదో తెలిస్తేనా! ఆ అమ్మాయి ఇల్లా అనుకొంటున్నది. "ఈ అబ్బాయి నన్ను జూచి నవ్వటంకూడా మొదలుపెట్టాడు. నేను ఊరుకొన్నానా ఇది చాలాదాకా పోతుంది. ఎవ్వరైనాచూస్తే ఈపిల్ల కాకముందే మొగుడితో మాట్లాడుతున్నది, ఇదెక్కడి విడ్డూర్యమమ్మా అని ముక్కులూ మూతులూ విరుస్తారు. ఎందుకొచ్చిన అల్లరి! మొదట్లోనే ఏదో గట్టిగా చీవాట్లువేయాలె."

మళ్ళీ కాసేపువుండి అనుకొన్నదీ, "నేను చేయదలుచుకొన్నది ఏమంత కష్టమైన పని కాదు. మా అమ్మతోచెపితే ఆమె అల్లుడి గారినిపిలిచి నాలుగూపెడుతుంది."

మరికొంతసేపు అయిన తరువాత ఇంకో విధంగా అనుకొన్నది. "ఛా. ఛా. ఎవ్వరితోనూ చెప్పకూడదు. ఆ అబ్బాయి ఏమన్నా అనుకొంటాడు. ఒకరికిచెప్పటం ఎందుకూ? నేనేం చిన్నదాన్నా! ఆ నాలుగు మాటలూ నేనే అంటాను. అదైనా తొందరపడి అని వేయకూడదు. ఈ వ్యవహారం ఎందాకా పోతుందో కొంచెంచూడాలె. బహుశః నన్ను పిలుస్తాడు. పిలిచి ఏమంటాడో చూస్తాను! ఏమని పిలుస్తాడూ!! నాపేరుపెట్టి పిలుస్తాడా? ఛీఛీ. పెళ్ళాన్ని పేరుపెట్టి పిలుస్తాడా? తప్పుకాదూ? అతడి గొంతుచాలా మధురంగా వుంటుంది. అతని మాటల్లో సంగీతం దాక్కునివుంది. అయితేఏం! నేను ఆమాటలు వినిపించుకోను."

"ఆ అబ్బాయి నాచెయ్యి పట్టుకొంటాడేమో! ఆ అబ్బాయి అల్లాగచేసేలాగునే ఉన్నాడు. అల్లాగచేస్తే తమాషాగా వుంటుందనుకొంటున్నాడు. అమ్మ దొంగ! ఈ అబ్బాయి ఎంత తమాషాచెయ్యాలని ఆలోచిస్తున్నాడూ! నేను ఒప్పుకుంటానా! అసలు ఆ అబ్బాయికి చిక్కుతానా? కార్యంకాని పిల్లలు అసలు మొగుడిసమీపంలోకే పోకూడదు. నాకుతెలియదా ఏమిటి అసంగతి! ఆ అబ్బాయికళ్లు ఎల్లాగో మెరుస్తూవుంటవి. తళుక్కు తళుక్కుమంటూ వుంటవి. ఆ అబ్బాయి ముఖంవంకే చూడకూడదు."

ఇల్లాగ ఆ అమ్మాయి చెప్పుకొని గుండె గట్టిచేసుకొన్నది. అప్పుడు మధ్యాహ్నాం పన్నెండుకొట్టారు.

అది మిట్టమధ్యాహ్నామే కావటానికి. కాని శ్రావణమాసం కావటంచేత ఆకాశం మేఘచ్ఛన్నమై చల్లగా హాయిగావుంది. ఆ అబ్బాయి తల దువ్వుకొని, తెల్లనిచొక్కా తొడుక్కున్నాడు ఎవ్వరూ వున్నట్లులేదు ఆ చుట్టు ప్రక్కల. ఆతడు ఎకాయకీని వెళ్ళి ఆ కిటికీ దగ్గర నుంచున్నాడు.

కిటికీలో పెద్ద అద్దం ఒకటి నిలబెట్టి, అందులో చూచుకొంటూ ఆపిల్ల తల దువ్వుకొంటున్నది. పిల్లవాడు పిల్లను బాగా చూశాడు. 'ఎంత అందంగావుందీ ఈఅమ్మాయి! ఒక్కమాట మాట్లాడితే బాగుండునే!అనుకొన్నాడు.

ఆ అబ్బాయి నవ్వుముఖము చూచేసరికి ఆ పిల్లకు ఏదో తమాషాగావుంది. అందమైన కుర్రవాడులాగానే వున్నాడు. అక్కడే నుంచుని ఇంకా ఆ అబ్బాయిని చూద్దామనీ, ఏమైనా మాట్లాడితే విందామనీకూడా అనుకొన్నది:

అబ్బాయి ఎట్లాగయినా ధైర్యంచేసి "ఇదిగో అమ్మాయ్"—అని అయినా అందామని అనుకొంటున్నాడు. ఇంతలో ఆ పిల్ల "ఛీ కార్యం కాని పిల్లలు ఎక్కడైనా మొగుడు వంక చూస్తారా, తప్పుకాదా," అని అనుకొని తుర్రున వెళ్ళిపోయింది, అబ్బాయి తెల్లపోయినాడు.

## 4

అరెరె, మాట్లాడించటానికి ధైర్యం లేక పోయింది గదా, ఎంత తెలివితక్కువ పని చేశాను, ఇప్పుడు ఏం చెయ్యాలె! అని ఇల్లాగ అనుకొంటూ అతడు గదిలోకి వెళ్ళి పోయి కుర్చీలో కూర్చున్నాడు. ఏమీ తోచ లేదు. ఏదో పత్రికచూడటం మొదలుపెట్టాడు. పత్రికలో తనను బాధిస్తూవున్న సమస్యకు సమాధానం ఎక్కడా కనుపించలేదు. అసలు అతనికి అక్షరాలే కనిపించలేదు!

ఇంతలో ఆపిల్ల అక్కడికి వచ్చింది ఎందుకో. ఆ అబ్బాయిని చూడటానికే వచ్చింది అనటంమాత్రము అన్యాయము.

అయితే ఒకటి. ఏదో పనిమీద వచ్చిన మనిషి అయితే, అక్కడే తారట్లాడుతూ, మంచుని వుండటానికి కారణం ఏమిటీ అని అడగవచ్చు. దానికి సమాధానం చెప్పలేము. ఆపిల్ల మనస్సులో యేమి అనుకొంటూ వున్నదో, ఏమో! అక్కడ ఎవ్వరూలేరు కూడాను. వాళ్ళ అమ్మా వాళ్ళూ లోపల ఎక్కడో వున్నారు. తండ్రి ఇంట్లో లేడు. అల్లాంటప్పుడు ఆపిల్ల, అల్లాగ ఒంటరిగా రావటం చాలా తప్పు అన్న విషయం. ఒప్పు కుంటూ. కాపురంచేస్తున్న పిల్లఅయినా అల్లాగ బరి తెంచుకొని పట్టపగలు మొగుడికి యెదు రుగా రాదు. అయితే ఆ పిల్లకు తన మొగుడు అక్కడున్నాడని తెలియకపోవచ్చు. అసలు ఎందుకు వచ్చిందో ఏమో!!

చుట్టుపక్కల ఎవ్వరూ లేకపోవటం, ఆ పిల్ల ఒక్కత్తే అక్కడ నిలబడి వుండటం, ఎంత ప్రమాదం తెచ్చింది ఆ అబ్బాయికి. ఎట్లా ధైర్యం వచ్చిందో ఏమో చటుక్కున అనేశాడు "ఏయ్ పిల్లా, మాట" అని.

ఆ అబ్బాయిని చీవాట్లు వేయటానికి మాంచి సమయం దొరికింది ఆ పిల్లకు. "ఏమిటది? అమ్మతో చెప్పనా?" అనో, "తప్పు పిలవ కూడదు" అనో అందామని నిశ్చయించు కొన్నది. గుండె నిబ్బరంగల పిల్ల కాబట్టి అల్లాగ అనాలని అయినా తోచింది.

ఆ ధీరశీల అల్లా అందాము అనుకొన్నది, నోటిదాకా వచ్చినై మాటలు. కాని అనలేక పోయింది. ముక్కుపైన వేలువేసుకొని తప్పు అని మాత్రం అనగలిగింది, అదీ ధైర్యంగల పిల్ల కాబట్టి.

అయితే ఈమాటలు గంభీరంగా కొట్టొచ్చి నట్లు అనవలసింది. పాపం పసిపిల్ల కేమి తెలుసు? నవ్వొచ్చింది ఆ పిల్లకు. అందుకని ఈమాటలు అని పక్కుననవ్వి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

అప్పుడు మూడుగంటల పదినిమిషాలైంది.

## 5

రాత్రాను తప్పు పని చేశానేమోనని, ఆ తరు వాత, ఆ పిల్లవాడు చాలా భయపడ్డాడు. నోరుజారి అనేశాడు. దీనివల్ల ఏం ప్రమాదం వస్తుందో! ఈ సంగతి ఆపిల్ల తల్లితో చెపితే ఎంత నవ్వుబాట్ల పని! ఏవో గుసగుసలు విని పించినై! పాపం పిల్లవాడి గుండెలు తల్లడిల్లి పోయినై.

పాపం ఆపిల్ల అయినా ఎంతో హడిలి పోయింది. ఎందుకో ఆ అమ్మాయి గుండెలు దడదడ కొట్టుకొన్నయి.

ఆ పిల్లవాడు అక్కడ, ఈపిల్ల ఇక్కడా, భయభ్రాంతులై వుంటూ వుండంగానే గడి యారం నాలుగు, అయిదు, ఆరు, ఏడు, గంటలు కొట్టుకుపోయింది.

అబ్బాయికి బైటికి వెళ్ళటానికి ముఖం చెల్లక, కాళ్ళాడక ఇంట్లోనే వుండిపోయి నాడు. ఆ రోజున శ్రావణ శుక్రవారం అవటం మూలాన తల్లివాళ్ళూ పేరంటానికి వెడుతూ

అమ్మాయినికూడా, రమ్మంటే - ముస్తాబై కూడా, చివ్వరకు ఆ అమ్మాయికి నలుగురి లోకి పోవటానికి భయంవేసింది. ఏదో నెపం చెప్పి వాళ్ళను పంపించి తాను వుండిపోయింది. ఇద్దరూ చిన్నపిల్లలు కావటం మూలాన చాలా హడలిపోయినారు.

సాయంత్రం ఏడుగంటల యాభై అయిదు నిమిషాలు అయింది. ఆ సమయంలో అబ్బాయికి గదిలో కూర్చోటం కష్టం అనిపించింది. గాలిలో డాబాపైన పచార్లు చేద్దామని బుద్ధి పుట్టింది.

ఒంటరిగా గదిలో కూర్చోటం కష్టంవేసి ఆ పిల్లకూడా అంతకు పూర్వమే డాబాపైన చాపవేసుకొని కూర్చున్నది. ఠాకూరు కథలు చదువుతున్నది. అబ్బాయి వెళ్ళాడు. ఆ అమ్మాయి అక్కడ కనిపించింది.

ఇందాక మాట్లాడిచ్చినందుకే హడిలిపోయిన కుర్రవాడు, ఇప్పుడు ఆపిల్ల ఒంటరిగా అక్కడ వుండటం చూచి "ఛా మనకెందుకు, ఆ పిల్లతో మాట్లాడటానికి మనమెందుకు ప్రయత్నంచెయ్యాలె ?" అని అనుకొని కిందికి వెళ్ళిపోవచ్చునా ? వెళ్ళిపోక ఆపిల్ల వున్న చోటికి వెళ్ళటానికి సాహసిస్తున్నాడు.

"ఇందాక ఆ అబ్బాయిని చూచి నవ్వటమే తప్పు అని నా అంతరాత్మ చెప్పింది. కార్యం కాని పిల్లను మొగుడితో మాట్లాడటం మహా పాపం" అనుకొని ఆపిల్ల అయినా, వెళ్ళిపో కూడదూ ! వెళ్ళలేదు.

ఇద్దరూ ఇద్దరే ?

ఎవ్వరూ వెళ్ళిపోలేదు. కాని వాళ్ళు బుద్ధి పూర్వకంగా ఉందామని ఉండిపోలేదు. పాపం వాళ్ళిద్దరికీకూడా మతిపోయింది. ఆ అమ్మాయి గుండెకొట్టుకొంటూఉన్నది. ఆ అబ్బాయి గుండెకూడా దడదడలాడ్తూ ఉంది.

అయితే ఒక్కసంగతి. ఆపిల్ల ఈ అబ్బాయిని చూడలేదేమో ఎందుకంటే ఈ పిల్లవాడు వచ్చేసరికి ఆ అమ్మాయి అటుతిరిగి పుస్తకం చూస్తున్నది.

ఆ అబ్బాయిమట్టుకు, ఒక్కక్షణం ఆలోచించి, కొద్దిగా వెనక్కుతగ్గి, ధైర్యంతెచ్చుకొని మళ్ళీ ముందుకు వడుస్తున్నాడు. ఆపిల్లవైపు ఆకర్షింపబడ్డాడు. దగ్గరకుకూడా వెళ్ళాడు. ఆపిల్లమటుకు ఇతనివైపు తిరగలేదు.

ఎందుకు తిరగలేదూ ? తను అక్కడికి రావటం ఆపిల్ల చూడలేదని ఆ కుర్రవాడు అనుకొంటున్నాడు. ఇల్లాగ అనుకోవలెననే ఆపిల్ల వుద్దేశంకూడానూ ! అందుకని అటు తిరిగేవుంది.

నిజంసంగతి ఏమిటీ అంటే ఆపిల్లకు ఈ అబ్బాయి మేడమెట్లు ఎక్కుతున్నప్పటినుంచీ జరిగినదంతా తెలుసు ! ఆ కుర్రవాడు మేడ మెట్లు ఎక్కుతున్నాడనీ, డాబాపైకి వచ్చాడనీ, తనవైపు చూస్తున్నాడనీ, దొంగలాగా నడుస్తున్నాడనీ, అన్నీతెలుసు.

ఆ అమ్మాయి ఇల్లాగ అనుకొంటున్నది. "ఈ పిల్లవాడు నాదగ్గరకు వస్తున్నాడు. నేను అతనివంక చూడకూడదు. కార్యం కాని పిల్లలు మొగుడివంక చూడకూడదని నాకు తెలుసు. అందుకని అసలు అటుతిరగను."

"నేను ఆ అబ్బాయివంక చూడకపోతే అతడు నన్నేంజేస్తాడు. పాపం కాసేపు చూస్తాడు, తలలోపెట్టుకొన్న, ఈ మల్లెపూలు కనపడతవి. అవిమటుకు ఎందుకు కనపడాలె ! అని ఆ అమ్మాయి తన పమిట

చెంగు జడపైన కప్పుకొన్నది. ఆ సన్నని చీరచెరుగు ముసుగులోనుంచి ఆ మల్లెపూలు నవ్వటం మొదలుపెట్టినవి.

ఆ అమ్మాయికి అప్పుడు కొత్త ఆలోచన వచ్చింది. ఆ అబ్బాయి తనను ముద్దుపెట్టుకొంటాడేమోనని తోచింది. అటువంటి ఆలోచన ఆపిల్లకు ఇదివరకు ఎప్పుడూ రాలేదు. అప్పుడు ఎందుకువచ్చిందో.

అల్లాంటి ప్రయత్నం ఆ అబ్బాయిచేస్తే ఏంచెయ్యాలా అన్నది పెద్దసమస్య అయిపోయింది. ఆపిల్లకు అది తలకుమించిన ఆలోచన.

ఏంచెయ్యాలో ఆపిల్లకు చప్పున తోచలేదు. చాలాసేపు ఆలోచించింది, చివ్వరకు భగవంతుడి దయవల్ల ఆ అమ్మాయికి ఒకఉపాయం తోచింది. అది ఏమిటీ అంటే, ఆ అబ్బాయి కనుక ముద్దుపెట్టుకొంటానికి ఎల్లాంటి ప్రయత్నంచేసినా, తానుమాత్రము అట్టిపనికి అవకాశం ఇయ్యకూడదనీ, ముఖం అటూ ఇటూతిప్పి అతనికి అందకుండా చేద్దామనీ. ఈ ప్రయత్నాలవల్ల అతనిని వారించ లేకపోతే, ఆపిల్లవాడి చెంపమీద చిటుక్కున కొడదామనీ! ఇల్లా చెయ్యిఎత్తి, ఇల్లాగ కొట్టాలె అని ఆ అమ్మాయి కొట్టేపద్ధతికూడా అభినయించి చూచుకొన్నది.

అయితే మొగుణ్ణి అల్లాగ చెంపమీద కొట్టటం తప్పు అని ఆపిల్లకు ఒకక్షణంలో తోచిందికూడా. చాలా వ్యాకులపడ్డది. చివ్వరకు ఇల్లా అనుకొని మనస్సులో సమాధాన పడ్డది. "ఆ అబ్బాయి నన్ను ముద్దుపెట్టుకోటం తప్పుగాదా? అతడు ఆ తప్పుపనిచేస్తే, అతనిని ఆ మహా పాపకార్యాన్నుంచి వారించటానికి ఇల్లాగచేయటం మంచిదే!"

ఇల్లాగ అనుకొని ఆపిల్ల ఆ కుర్రవాడి చెంపమీద చిటుక్కున కొట్టాటానికీ, తన కన్యాత్వాన్ని కాపాడుకొంటానికీ, కృతనిశ్చయురాలై అందుకు కావలసిన ధైర్యంకోసం, అనసూయ, అరుంధతి మొదలైనవారి పవిత్ర చరిత్రలలోని కొన్ని సంఘటనలను జ్ఞాపకం తెచ్చుకొంటూ ఉన్నది.

ఆపిల్ల అల్లాగ చెయ్యదల్చుకోటం తప్పు కాదా అని తోచటంలో విపరీతంఏమీలేదు. కాని సత్యభామ మొగుణ్ణి ఎడమకాలితో తన్నింది అంటే చిరునవ్వునవ్వే మీరూ, ఈ పిల్ల మొగణ్ణి కాస్త చెంపమీద ఇట్లా అనాలని నిశ్చయించుకొన్నదీ అంటే హడిలిపోవటానికి కారణం ఏమిటో నేను ఊహించలేకుండా ఉన్నాను.

అయినా నేను ఆపిల్లను వెనకేసుకొచ్చి ఆ అమ్మాయి తప్పుఏమీ లేదని అనటమూ లేదు. ఇంత చిన్నపిల్ల ముగ్ధ, వ్రీడావతి ఇల్లాగ నిశ్చయంచేసుకొన్నదేమానని నాకూ ఆశ్చర్యంగానేవుంది. అయితే ఒక్కటి.

ఆపిల్ల ఏది ఉచితమో, ఏది అనుచితమో తెలుసుకోలేని వయస్సులో వుంది. కామసూత్రాలు చదివిన మనిషికాదు. అందుకని ఆ అమ్మాయి క్షమించతగినదని మాత్రం నేను గట్టిగా అంటాను.

ఆ అమ్మాయిని ఇంతవరకూ ఎవ్వరూ ముద్దెట్టుకోలేదు. అందుకని ఈ కుర్రవాడు తనను ముద్దెట్టుకొంటే ఎల్లాగవుంటుందా అని ఆపిల్లకు ఒక ఊహావచ్చింది. ఎల్లా వుంటుందో ఊహించలేక ఆప్రయత్నం మానేసి అతని చెంపమీద కొట్టటానికే, మరీ నిశ్చయించుకొన్నది ఆపిల్ల.

ఆ అబ్బాయి ఊహాలు విపరీతంగా పోతున్నాయి. ఆపిల్లను కౌగలించుకొందామని తన హృదయానికి గట్టిగా ఆ అమ్మాయిని అదుముకొందామనీ, ఆ అమ్మాయి మృదువైన బుగ్గలను తాకుదామనీ, తలపైని చెయ్యివేసి నిమిరుదామనీ, ఇల్లాంటి ఆలోచనలన్నీ అతని తలలో ప్రవేశించినవి. ఇల్లాంటి పాపపు ఆలోచనలు రాకుండా వుండటానికే కళాశాలలో భగవద్గీతపాఠం చెప్పాలని పెద్దవాళ్లు కొట్టుకొని గోలపెట్టేది !.

ఈ పిల్లవాడు ఇల్లాగ అనుకొంటూ మెల్లిగా పోతున్నాడు. ఆ అమ్మాయి దృఢసంకల్పం ఏమాత్రం తెలిసినా ఆ అబ్బాయి బతికిపొయ్యేవాడు పాపం, విధి తరుముకొని తీసికెళ్ళింది.

పైగా అతనికి ఏమితోచిందీ అంటే, "ఈ సమయాన్న జారవిడిచానా ఈజన్మలో మళ్ళీ ఇల్లాంటి సదవకాశం దొరకదు. జన్మాంతరం, తలచుకొన్నప్పుడల్లా, వళ్లు గగుర్పాటు కలిగించే, తియ్యని తలపులనిచ్చే, సుకృత్యం ఏదైనా చేయదలుచుకుంటే సాహసించి ఇప్పుడే చెయ్యి ! సమయందాటినతరువాత, అరే, ఎంత బుద్ధితక్కువ పనిచేశాను. ఆ అమ్మాయిని కౌగలించుకోవాలిసింది పొరపాటైపోయింది. అని ఎంత ఏడ్చినా ఏమీ లాభంవుండదు."

ఆ అబ్బాయి చాలా భయస్థుడు పిల్లదగ్గరకు వెళ్ళి నుంచున్నాడు. ఆపిల్లను మాట్లాడిద్దామనుకొన్నాడు. కాని నోరు పెగలలేదు.

ఆ అమ్మాయి ఏమీ ఎరుగనట్టు అటు తిరిగే, ఉంది. ఇటు చూడనైనాలేదు. ఈ అబ్బాయికి ధైర్యంలేదు ఆ అమ్మాయితో "ఓ అమ్మాయ్, ఇటుతిరుగూ" అని అనటానికి. ఇల్లాంటి దుర్భరమైనస్థితి వచ్చింది పాపం ఆ అబ్బాయికి !.

వెన్నెలకూడా వస్తున్నది. వెలుగు అంతకుముందే పోయింది. అయినా ఆపిల్ల పుస్తకంవంక చూస్తునే వుంది ఆ సంజె చీకట్లో అక్షరాలు కనపడుతున్నట్లు. ఆ అబ్బాయికి ఏమీ తోచలేదు. ఆపళంగా ఆ కుర్రవాడు, ఏమీ ఆలోచనలేకుండా ఆపిల్ల రెండు కళ్ళనూ తన రెండుచేతులతోనూ మూశాడు.

ఏంజెయ్యాలా అనే పెద్దప్రశ్నవచ్చింది ఆ అమ్మాయికి. ఆ అబ్బాయిచెయ్యి ఆపిల్లమీద పడేసరికి ఆ అమ్మాయికి ఎంతో కోపము రావాలిసింది.

తనను ముద్దు పెట్టుకొంటే, అతన్ని చెంప చిటుక్కుమనిపించటానికి, ఆపిల్ల సిద్ధంగానేవుంది. అంతవరకే ఆలోచించింది. కాని తన కళ్ళుమూస్తే ఏమి చెయ్యాలో ఆ అమ్మాయి ఆలోచించుకోలేదు. అప్పటికప్పుడు ఏమీ తోచలేదుకూడాను. మహామహా వాళ్లే అల్లాంటి సమయంలో తల్లక్రిందులౌతారు, పాపం అభం, శుభం తెలియని ఆ పిల్లకేం తెలుస్తుంది. అందుకని ఆ అమ్మాయి మాట్లాడకుండా వూరుకొన్నది.

ఆ అబ్బాయి కరస్పర్శ తగిలేటప్పటికి ఆ అమ్మాయికి తమాషాగా వళ్ళంతా ఝల్లుమన్నది. ఆపిల్ల తన శరీరంపైన గగుర్పాటు కలగటం ఎప్పుడూ ఎరుగదు. వళ్ళంతా మొగ్గలు తొడిగింది. ఏమిటబ్బా ఇంత హాయిగా వుందనుకొంటూ ఆ అమ్మాయి ఏమీ చెయ్యలేకపోయింది.

ఆ పిల్లవాడికికూడా ఏదో తమాషాగావుంది. గుండె కొట్టుకొంటున్నది. వేడిరక్తం శరీరంలో బహు వేగంతో ప్రవహిస్తున్నది.

నిజం మాటకు అతనికి ఏమీ తోచలేదు. ఇల్లా చేయడంవల్ల ఏమి కొంపమునుగుతుందో అన్న భయంకూడా పోయింది. తనకెందుకు అంత హాయిగావుందో అతనూ తెలుసుకోలేకపోయినాడు.

నిజం సంగతి చెపుతున్నాను. ఇందులో అసత్యం ఏమీలేదు. ఏమిటంటే అమ్మాయిని ముద్దుపెట్టుకొందామని ఆ అబ్బాయి అంతకు పూర్వం ఎప్పుడూ అనుకోలేదు. ఆ క్షణంలో అతనికి ఆ అమ్మాయిని ముద్దుపెట్టుకొంటే బాగుండునని తోచింది. ఎందుకు అట్లా తోచిందో ఎవ్వరికీ తెలియదు. ఈ రోజుకూ అది రహస్యమే. ఇల్లాగ తోచినవెంటనే అతను ఏమి చేశాడంటే ఆ అమ్మాయిని గట్టిగా కౌగలించుకొని బుగ్గపైన ముద్దు పెట్టుకొన్నాడు. అప్పుడు సరిగ్గా ఎనిమిదీ, ఎనిమిది అయింది ఇన్‌డియన్ స్టాండర్డు టైమ్.


కొంతమంది, ఏమంటారూ అంటే, కార్యం కాని పిల్లను ముట్టుకొని ముద్దెట్టుకోటం ఆ పిల్లవాడి తప్పు అనీ, అదేమి అని అనకుండా మెదలకుండా వూరుకోటం ఆపిల్ల తప్పు అనీ అంటారు.


నేను అనటం ఏమిటంటే ఆ పిల్లది ఏమీ తప్పులేదనే! మొదట కళ్ళుమూస్తే యేమి చెయ్యటానికి తోచలేదు. ఆ తరువాత ముద్దెట్టుకొన్నప్పుడుకూడా ఆపిల్ల ఏమీ అనలేకపోయినమాట నిజమే. ముద్దుపెట్టుకొంటే ఇల్లాగ తమాషాగా, సంతోషంగా, హాయిగా, సుఖంగా, ఆనందంగా వుంటుందని ఆపిల్ల ఎప్పుడూ వూహించలేదు. ఆ సుఖంలో చెంపమీద కొడదామని అనుకొన్నమాటే మరిచిపోయింది పాపం!!

ఆ ఒక్కమాటే కాదు. ఆపిల్ల అన్నీ మరిచిపోయింది; తన వళ్ళు తనకే తెలియని స్థితిలో వుండిపోయింది.

ఆ అబ్బాయి ఒక్క బుగ్గపైనే ముద్దులు కురిపిస్తూవుంటే, ఆపిల్ల రెండోబుగ్గ అందించగలిగింది. అంతే. అంతకంటే పాపం ఆ పిల్లకు ఏమీ తెలియలేదు.

అయితే ఆ పిల్ల పేరేమిటీ అన్న ఒక్క విషయం చెప్పటం మరిచిపోయాను. ఆ అమ్మాయి పేరు కాంతం.





# పరాక్రమ గొబ్బి

శ్రీ పాల్గొ.. ఉమా మహేశ్వరరావు

ఇక్ష్వాకులు సామ్రాజ్యాధిపులుగా ఉన్నప్పుడు కమఠ భూమిపై ఒక సామంత రాజ్యాన్ని ఏలుతున్న వేంకట భూపాల చౌదరికి బాల్యముననే భార్య అయింది గొబ్బి.

వారిద్దరికీ మేనరికమైనా, అతి బాల్యంలో సరస సరసగా పెరిగినా వివాహము కాగానే వేయివరహాల సిగ్గుతో గొబ్బిన్నీ అంతకన్న ఎత్తుకెత్తు మాటు తనంతో మోమాటతో చౌదరిన్నీ కాలం గడిపారు ఇద్దరూ. పాతికేండ్ల వయస్సు చౌధరికి—పన్నెండేండ్ల వయస్సు గొబ్బికి వివాహమునాటికి.

అసలు పనితీరికలేమిచే చౌధరికి విశ్రాంతిలేక ముఖ్యంగా మాటు తనం వచ్చింది. సామ్రాజ్యాధిపుని ఆంతరంగిక సభానాయకుడౌటచే చౌధరి సామ్రాజ్య నగరుకు మాటిమాటికి పోవడమవసరం. అదీ కారణం.

అయితేనేమి కొన్ని సంవత్సరాలకు ఇద్దరికీ ఆంతరంగిక ప్రేమ వృద్ధియైంది. వంశపారంపర్యానికి ఇద్దరూ బద్ధులే. ఇద్దరికీ ఒక కుమారుడూ ఇద్దరు కూతుర్లూ జనించారు. సంతానాన్ని సరిగా చూడడానికైనా తీరికలేదు ఇద్దరికీ. రాజప్రాసాదాన్ని సంబాలించుకునేది గొబ్బి. సామ్రాజ్య నగరున కార్యక్రమాలు నిర్వహిస్తూండేవాడు చౌధరి.

ఇద్దరు బాలికలకూ దాదులుండేవారు. క్రమశిక్ష ఉండేది. ఆటలుండేవి, పాటలుండేవి.

రాజకుమారునికి రంగైన మహలులో ఏరికోరిన ఉపాధ్యాయులూ ఒక ముఖ్యోపాధ్యాయుడూ శిక్షణ మిస్తూండేవారు. రాజ్య నిర్వహణవిద్యలో రాణింపు కొస్తున్నాడు.

అయితే సంతానముమీద నిగూఢమైన ప్రేమ గొబ్బికీ చౌధరికీ బాగా యుండేది. వంశపారంపర్యానికా ముగ్గురు సంతానమే ముఖ్యులు.

కొద్దిదినాలకాలం కమనీయంగా గడిచిన తర్వాత ఓ రోజున సామ్రాజ్య నగరుకు పోయి వస్తానన్నభర్త ఇంకా రాలేదని హృదయంలో దిగులూ మనస్సులో పరాకూకల్గి రాత్రియంతా నిద్రలేక జాగరణచేసింది గొబ్బి. అయితే ఆ దిగులుగాని ఆ పరాకుగాని ఆ ముఖాన మాత్రం కన్పించడంలేదు. ఇక్ష్వాకు కులంలో ఇసుకలో పాతిపెట్టినా నిశ్చలత్వం చూపిస్తారు.

ఆరాత్రి వానవచ్చింది. ఎవరో యోధుడొకడు వానచినుకులలో తడిసి రాజప్రాసాదానికి వచ్చాడు.

గొబ్బితో ఆ యోధుడిట్లన్నాడు. "నీ భర్త మహాయోధుడు. అయితే

ఇక్ష్వాకు సామ్రాజ్యానికి పట్టుకొమ్మ. కావుననాతని బందీ చేయాలెనని మా సామ్రాట్టు కళింగ దేశాధీశుడు మమ్ము లను పంపాడు. మేమనేకసార్లు పొంచి యున్నా మాకాయన చిక్కలేదు. ఈసారి అతను బహుస్వల్పసైన్యంతో గర్వంతో ప్రయాణం చేస్తుంటే చిక్కాడు. మే మాతనిని కళింగ సామ్రాజ్య నగరుకు తీసుకొని పోతున్నాము. పోవుదారి మీ రాజధాని ప్రక్కను గుట్ట కానుకునియే ఉన్నది. వలయుచో నీవు ఒంటరిగా వచ్చి అయిదు ఘడియలు ఆయనను దర్శించి పోవచ్చును."

ఆ మాటలు విన్నది గొబ్బి. అదెంత నిజమో, అదెంత మోసమో !

అయినా ఆ యోధునడిగింది: "నీవు క్షత్రియుడవేనా ?"

"అవును. నేను క్షత్రియుడను. యోధుడను," అన్నాడతను.

"నీవు క్షత్రియుడవు గనుక క్షాత్ర మర్యాదలెరిగిన వాడవు గనుక నీవు శత్రువైనా మిత్రుడవైనా నీతోవస్తాను నాభర్తను చూడడానికి." అన్నది గొబ్బి. బయల్దేరింది.

ఆ యోధుని గొబ్బి నమ్మినా ఆ రోజులు భయానకమైనవి. అందుచేత అంగుళీకములో అసాధారణమైన పాషా ణాన్ని కొంచెము నింపుకుని బొడ్డున బాకును దూర్చుకుని కూతుర్లను సూరి అనే దాసిదానిపరంగా వప్పజెప్పి కుమా రుణ్ణి ముఖ్యోపాధ్యాయుని పరంగా ఇచ్చి తర్వాత పయనమైంది.

వాన వెలిసింది. వీధులు నిశ్శబ్దంగా ఉన్నవి. వెన్నెల కొద్దికొద్దిగావస్తున్నది, ఆ చిరువెన్నెలలో ఆ యోధుని కర వాలము కొంచెము కొంచెము తళుకు లను విసురుతున్నది. గొబ్బి యంగుళీక మునను్న వజ్రపు మెరుగులు మిణు గురులల్లే ప్రకాశిస్తున్నాయి. కొంత తడవునకు రాజనగరు చివరన ఉన్న గుట్టచేరారు. శత్రు శిబ్బందితో వస్తూన్న చౌధరి కొరకై వేచి చూస్తున్నారు.

కొంత తడవుకు గుర్రాల డెక్కల శబ్దం వినవచ్చింది. మరికొంత తడవుకు మిణుకు మిణుకుమని దీపాలు కనబడ్డవి. హటాత్తున ఆ శబ్దాలన్నీ ఆగినవి. ఎదుట కొంతసిబ్బంది మధ్య ఒక మేనా గూడ ఆగింది. మేనాలో ఇరువైపుల గుర్రాలనెక్కి కావలికాస్తున్న ఇద్దరు యోధులమధ్య ఉన్నాడు చౌధరి. ముఖమువాడి ఉన్నది. కళ్లు కావురు కావురు మంటున్నవి.

భర్తను చూచింది గొబ్బి, ఒక నిము షము ఇద్దరూ ఊరుకున్నారు. ఒక నిము షము చుట్టుపక్కలంతా ఊరుకున్నది.


గొబ్బినిచూచి "ప్రేయసీ నా కరవా లము నీ పరంగావుంచి నిన్ను నమ్ము తున్నాను." అన్నాడు చౌదరి.

అంతే అన్నాడు చౌదరి.

చౌధరి అన్న ఆ ఒక్క వాక్యార్థ మా ఇద్దరికే తెలుసు.

వారి కుమారుని సంగతి మాటాడు కుంటారేమో వానినిగూడ పట్టుకోవచ్చనే ఆశతో ఆ శత్రుసిబ్బంది వింటున్నదని వారిద్దరికీ తెలుసు.

కూడావచ్చిన శత్రుయోధుడు ఆమెను చూడకుండా ఆమె పాదాలను మాత్ర మొకసారి చూచి వెనుదిరుగకుండా తన



సిబ్బందితోనూ ఖైదీతోనూ పరిచేల కడ్డంగాపడి వేగంగా వెళ్ళిపోయాడు.

వెనక్కు తిరిగి ఒంటరిగా రాజ ప్రాసాదానికి బయల్దేరింది గౌబ్బి.

చౌధరి అన్నమాటలకర్థం "ప్రేయసీ నా తర్వాత నా కరవాలము ధరించేవాడు మన పుత్రుడు. నేను మృత్యువునోట ఉన్నాను వానిని పెంచి గద్దె ఎక్కించే భారము నీపరంగా ఇస్తున్నాను" అని. ఆ అర్థమే తలంచుచూ రాజప్రాసాదాన్ని చేరింది గౌబ్బి.

కబురుకై కాస్తూన్న ఖాసా వాళ్లు గౌబ్బిరాగానే దణ్ణాలు పెట్టుకుంటూ ఆవిడను లోపలికి తీసుకుపోయారు. రోజులు గడుస్తున్నాయి. ఆసామంత రాజ్యభారమంతా యవ్వనవతియైన గౌబ్బి మీదనే పడ్డది. భారము భద్రంగా నిర్వహిస్తున్నది.

ఇట్లుండగా ఓనాడు రాజనగరి తేవిణీ నాయకుడు "అనేకులు శత్రుసైనికులు ముట్టడించడానికి వస్తున్నా"రని గూఢ చారులవార్త గౌబ్బికి వినుపించాడు,

గౌబ్బి దాదులకూ, పరిచారకులకూ, ఉన్నదే కొద్దిదైన సిబ్బందికి వారివారి విధుల్లెలా నిర్వహించాలో అవన్నీ నిదానంగా నిబ్బరంగా తెలియజేసింది.

రహస్యమార్గంగా సిబ్బందిపోయి అక్కడా అక్కడా కాపలా ఉండిపోయారు.

ఇద్దరు ఆడబిడ్డలకూ ఓణీలువేసి కాసె బిగించి కాశెలో కటారిదూర్చి దాదిసూరికి వప్పజెప్పి ముందు సాగనంపింది.

రాజకుమారునికి రాజలాంఛన యుతంగా దుస్తులువేసి చేతికి కరవాలం ఇచ్చి ముఖ్యోపాధ్యాయుని చేతబెట్టి వారిని సాగనంపింది.

గౌబ్బి! గౌబ్బి!

గౌబ్బిమాత్రం కొంతమంది పరిచారకుల సాయ్యంతో రాజప్రాసాధానికి రవరవా నాలుగు మూలలా నిప్పంటించింది. ఎక్కడివార నక్కడకి బొమ్మన్నదీ. తానొకదాసిని తీసుకుని బయల్దేరిపోయింది. అంతా కోటదక్షిణవైపున్న ఒక కొండ గుహలోకు చేరుకున్నారు. అచట అందరికీ మరలా ఆజ్ఞలు పంచిపెట్టింది. ముప్పైమైళ్ళ దూరంలో వ్యవసాయం చేసుకుంటున్న ఒక పూర్వ సైనికుని ఇంటికి కూతుళ్ళను దాసిసూరిపరంగా ఇచ్చిపంపింది.

ముఖోపాధ్యాయుని పరంగా రాజ కుమారుని పంపింది.

తానూ తనదాసి ఆరామడల దూరాన తనను చిన్నతనాన పెంచి ఇపుడు ఆల మందలను పెంచుకుంటూ జీవిస్తున్న దాయి ఇంటికి పోయింది.

కష్టదినాలు రెండు సంవత్సరాలు గడిచాయి.

దినమొకయుగమూ అంటే అటు వంటి దినాలు చూడాలి.

రెండు సంవత్సరాలతర్వాత ముఖో పాధ్యాయుడు రాజకుమారుని తీసుకుని గొబ్బివద్దకు వచ్చాడు.

"ఎక్కడెక్కడకు పోయారు ? ఎట్లా కాలంగడిపారు ? విశేషాలేమిటి ? అని వారిని అడిగింది గొబ్బి.

"నన్ను ముఖోపాధ్యాయుడు తీసు కుని నమ్మకమైన ఒక మేదరవాని ఇంటికి పోయాడు, అచట కొద్దిదినా లుండగా శత్రుసైనికులావైపుగా పోతు న్నారని వార్తవచ్చింది. ముఖోపా ధ్యాయుడొక పన్నాగం చేశాడు. కొత్త గాదెలను లోపల ఏమీలేవన్నట్టుగా వాల్చాడు. భర్తీగాదెలమీద గడ్డి బనా యించి అట్లే ఉంచాడు. వాటి వీటీ మధ్య ఒక ఖాళీ గాదెలో నన్ను దాగ పెట్టాడు. గాదె సగమునుంచీ మూతి వరకూ వడ్లు పోయించాడు. శత్రు సైనికులు వచ్చేటప్పటికి మానికతో వడ్లు కొలుస్తూ కూర్చున్నాడు. సైనికులటూ ఇటూ చూచుకుంటూ భర్తీగాదెలను మాత్రం ఈటెలతో పొడుస్తూ ఏమీ కానక వెళ్ళిపోయారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు కళింగాధిపతికి ఇక్ష్వాకు సామ్రాట్టుకు సంధి అయింది. ఖైదీల నిరుపక్షాలగూడ వదలివేశారని కబురొ చ్చింది. నన్నుతీసుకుని ముఖోపా ధ్యాయుడిక్కడికి వచ్చాడు". అని తెలియజేశాడు రాకుమారుడు.

ముఖోపాధ్యాయునికి కృతజ్ఞతా వందనాలిచ్చింది గొబ్బి. కూతుళ్ళకై కబురంపి పిలుపించుకుంది. భర్తకై ఎదురు చూస్తున్నది.

నెలరోజులకు చౌధరి గొబ్బిదరికి చేరాడు. జరిగినయుదంతమంతావిన్నాడు. భార్యను కావలించుకుని కన్నీళ్లు విడి చాడు. బిడ్డలను చూచాడు. ముఖోపా ధ్యాయునికొక అగ్రహారం వ్రాసిఇచ్చాడు.

మూడు దినాలు ప్రయాణముజేసి రాజధానీ నగరుకుపోయి మూడుదినా లచట ఉండి మరి మూడుదినాలలో స్వజనం చేరుకున్నాడు. సిబ్బందిని ఎక్కువచేసుకున్నాడు, నూతన రాజ ప్రాసాదము కట్టించుకున్నాడు. దానిపేరే దగ్ధభవంతి.

గొబ్బి నిర్వహణాశక్తినివిని అది వరకే కబురుచేశాడు ఇక్ష్వాకు సామ్రాట్టు. కుటుంబయుతంగా సామ్రాట్సభలో ఉన్న గొబ్బికి పూలహారాలు బహుమతులు ఇచ్చాడు, అదిగాక ఆమెను పరాక్రమ గొబ్బి అని పిలిచాడు. తండ్రి వంశనామ మునూ తల్లి బిరుదునామమునూ కలిపి ఇంటిపేరుగా పెట్టుకున్నాడు చౌదరి కుమారుడు. అప్పటినుంచి నిలిచింది వేంకట పరాక్రమ వంశము.

---



# అందము అమరిక

"స్త్రీ" అనే మాటకు సంస్కృతంలోనూ, తెలుగులోనూ వున్న పర్యాయపదాలలో అధిక సంఖ్య, 'మంచి శిరోజములు గలది' అనే అర్థం యిచ్చేవే. అంటే, స్త్రీ అందానికి, ఒక ప్రధానభాగం శిరోజాలేనని రూఢి అవుతుంది.

చాలా పొడుగ్గానూ, దట్టంగానూ, మంచి నలుపుతోనూ వున్న జడగల సోదరిని చూసినప్పుడు, మన అందరికీ ముచ్చటవేస్తుంది. అలాటి శిరోజాలు లేని మనలో కొందరు అసూయపడటం కూడా సంభవిస్తుంది.

శిరోజ సౌభాగ్యం చాలావరకు మన స్వప్రయత్నంమీద ఆధారపడివుంటుంది. ఆకర్షణీయమైన జడను అమర్చుకోవడం విషయంలో మనమందరమూ శ్రద్ధ చూపించాలి. ఆకర్షణతోపాటు, శిరోజాలా ఆరోగ్యాన్ని కాపాడుతూ వుండాలి.

శిరోజాలంకరణను గురించీ, పెంపకాన్ని గురించీ మన పూర్వీకులు ఎంతో పరిశోధనచేశారు. ఇప్పటికీ, పాశ్చాత్య దేశాలలో యీ విషయమై పరిశోధనలు జరుగుతునేవున్నాయి. అయితే, వారి అలంకరణ విధానం వేరు. మన పదతి వేరు.

మన సాంప్రదాయాన్ని అనుసరించి, అందమైన, ఆరోగ్యయుతమైన శిరోజాలను కలిగివుండాలంటే, మనం పాటించవలసిన విషయాలుచాలా వున్నాయి.

మొదటిది జుట్టు దీర్ఘంగా ఎదిగేటట్టు చూచుకోవాలి. ఈ విషయంలో కొంతమంది, అసలు జన్మతః అదృష్టం కలిగినవారు వుంటారు. కొంతమందికి అలాగకాక, జుట్టు సరిగా ఎదుగదు. అంతా చూస్తే గుప్పెడు జుట్టుకూడా వుండక, సవరాలు పెట్టుకొని, యేదో

శ్రీమతి సౌదామిని

కొంతజుట్టు వుందనే భ్రమను కలిగించు కుంటారు. అలాటివారు, తలకుదుళ్ళకు బలంకలిగే వుపాయం చూచుకోవాలి.

గుంటకలగర ఆకురసం, ఉసిరికాయ రసం, నువ్వులనూనె కలిపి, కొంచెం సేపు మరగనిచ్చి, దానిని రాసుకుంటూ వుంటే, జుట్టు కుదుళ్ళకు బలంకలుగు తుంది. అంతేగాక, భోజనంలోకూడా, నూనె పదార్థాలు, వెన్న, నెయ్యి కొంచెం ఎక్కువగా తినడంమంచిది.

శిరోజాలు దట్టంగావుండక, బట్టతల లాగ పలచగావుండి, సరిగా ఎదగకుండా వుంటే చిన్నపిల్లలుగావుండగానే, జుట్టు బాగా యెదిగేదీ లేనిదీ స్పష్టంగా తెలిసి పోతుంది కాబట్టి, ఆలాటి పిల్లలకు శిరోముండనం చేయించవచ్చు,

జుట్టుబాగా పెరగడంకోసం ఉపయోగించే నూనెలను ఏ యింటిలో, ఎవరికి వారు తయారు చేసుకోవడం మంచిది.

కొంతమంది తలమీద జిడ్డు ఎక్కువగా వుంటుంది, ఇవ్వాళ తలంటిపోసుకుంటే, మళ్ళీ ఎల్లుండికి తల జిడ్డువాసన వేస్తూ వుంటుంది, అలాటివారు తలంటుకునేటప్పుడు, తలకుదుళ్ళకుకూడా తగిలేటట్టు, పెసరపొడుము నీళ్ళతో కలిపిన పిండి తలకురాసుకుని, తరువాత తలలో వున్నపిండి అంతా పోయేటట్టు బాగా రుద్ధి వెయ్యాలి. నూనె పదార్థాలు, వెన్న, నెయ్యి ఎక్కువగా తినకూడదు. పళ్ళు



జడ్జి :—అంతమంది ఉండగా జేబెట్లా కొట్టావు?
దొంగ :—అదేముందండి బాబూ, సార్వీసు.

ఎక్కువగా తినాలి. తలకునూనె ఎక్కువగా రాచుకోకూడదు, జడబిగించి వేసుకోకూడదు. పళ్లు ఎడమెడంగావున్న దువ్వెనతో తల దువ్వుకోవాలి, తలంటి పోసుకున్నతర్వాత, శుభ్రంగా జుట్టు తుడుచుకొని, సాంబ్రాణిపొగ వేసుకోవాలి,

కొంతమంది శిరోజాలు, రాగిరంగులోనూ, వెలాతెలాపోతూనూ వుంటాయి. అలాటివారు ఎక్కువగా మందారపువ్వులు వేసి కాచిన నూనెనుగాని, జీడిగింజలు వేసి కాచిన నూనెనుగాని తలకు రాచుకుంటే, నలుపురంగు వస్తుంది.

తలకు పూలు పెట్టుకోవడం అందానికీ, ఆకర్షణకూ, సువాసనకూ మాత్రమే కాక, జుట్టుకి బలం యివ్వడానికికూడా వుపయోగపడుతుంది. మల్లె, గులాబి, సంపెంగ, మొగలిపట్ట మొదలైనవి,

మంచి సువాసనను ఇస్తాయి. ఈ పుష్పాలను, పుష్పొడి రాలిపోకుండా జడలో పెట్టుకుంటే, ఆ పుష్పొడి, శిరోజాల కుదుళ్ళకు ఎంతోబలం కలిగిస్తుంది. జుట్టుకు పేలుపట్టిన స్త్రీలు, తులసిదళాలను జడలో, ముచ్చిలిగుంట సమీపంలో పెట్టుకుంటే పేలుపోతాయి.

ఇదే కాక, తల దువ్వుకోవడంలో కూడా నేర్పరితనం చూపించాలి. ఒకరి ముఖానికి సరిపడిన పదతి మరొకరి ముఖానికి సరిపడదు. కొందరి నుదురు చాలా ఎత్తుగావుండి, నుదురు పైన అరఅంగుళం మేరదాకా శిరోజాలు వుండవు. అలా వుంటే, జుట్టు పైకి దువ్వక ప్రక్కలకు దువ్వాలి. ఆ దువ్వడంలో, జుట్టును వీలైనంత ముందుకు పడేటట్టుగా, అమర్చాలి.

కొంతమంది నుదురు చిన్నదిగా వుండి నుదుటిమీదనుంచే శిరోజాలు ఆరంభమౌతాయి. అలాటివారు, జుట్టును పైకి దువ్వితేఆ కాస్తలోనే నుదురు విశాలంగా కనపడుతుంది.

అద్దం ఎదుటకూచుని, ఏ విధంగా దువ్వితే, ముఖానికి అందంగావుంటుందో, చూసుకొని, అలాగ దువ్వుకోవాలి గాని, ఒకసోదరి ఒకవిధంగా తలదువ్వుకుంటే ఆమె అందంగా వుందికదా అని, ఆ పద్ధతినే మనమందరం అనుకరించకూడదు.

ఒకరిదువ్వెనను మరొకరు ఉపయోగించకూడదు. ప్రతివారికి ప్రత్యేకంగా వుండాలి.

దువ్వెన, రెండు మూడురోజులకు ఒకసారి శుభ్రంగా కడిగివేస్తూ వుండాలి. దువ్వెనపళ్ళలో చిక్కుకున్న నూనెమడ్డిని శుభ్రంగా తీసివేసి, కడగాలి. లేకపోతే, దువ్వెన పళ్ళలో, మడ్డి చిక్కుకుని వున్నందువల్ల, జుట్టులో వున్న మడ్డిని యివతలకు లాగలేదు.

శరీరంలోవున్న మలినం చర్మరంధ్రాలద్వారా పైకివస్తుంది. తలలోనుంచి పైకివచ్చిన మలినపదార్థం, తలకు రాచుకున్న నూనెతోకలిసి మడ్డిగా తయారవుతుంది. దానికితోడు, దుమ్ము ఎక్కువగా ఎగిరే ప్రాంతాలలో నివసించేవారి తలలమీద దుమ్ముకూడా పడి, యీమడ్డి మరీ ఎక్కువ అవుతుంది. ఎప్పటికప్పుడు యీ మడ్డిని కడిగివెయ్యకపోతే, తలమీది సూక్ష్మరంధ్రాలకు అది అడ్డుపడి, తలలోని మాలిన్యాన్ని పోనియ్యదు. శిరోజాల కుదుళ్ళకు సరిగా గాలి, సూర్యరశ్మి తగులదు. అంచేత తలమీద మడ్డి ఎక్కువగా చేరుతూవుండే వారికి వారానికి రెండుసార్లుకూడా అభ్యంగనం అవసరం.

ఇలాంటి తగిన జాగ్రత్తతీసుకుంటేనే గాని మంచి శిరోజాలు వుండవు.

---

# పత్రికలు నడపటం

పత్రికలు నడపటం ఒక విద్య—ఒక కళ—ఒక ఉద్యమం. పత్రికలు నడుపుదామని సంకల్పించినవాళ్ళు ముందు పత్రికలు పెట్టాలి. పత్రికలు పెట్టటం రాజకీయాలకిందికి వస్తుంది. పత్రికలు నడపటం లాగా అది నేర్చే విద్య కాదు. పత్రికలు నడపగలవాళ్ళంతా పత్రికలు పెట్టలేరు. (కనకనే కొంతవరకు బతికిపోయినాం!) కాని పత్రికలు పెట్టేవాళ్ళంతా వాటిని నడిపేవిద్య నేర్చుకోవచ్చు. రాజకీయాలలో ప్రవేశంలేని వాడవటంచేత ఈ రచయిత పత్రిక పెట్టే అవకాశంలేదు అందుచేతనే ఈ వ్యాసం.

పత్రికలు నడపదలిచినవారు మొట్టమొదట తెలుసుకోవలిసిన రహస్యం ఏమిటంటే పత్రికలు నడవ్వు—కదలనైనా కదలవు; వాటినెవరైనా కదిలించి, నడిపించాలి. కొందరు అమాయకులు తమ పత్రికలు మరీవేగంగా నడిచి పారిపోతాయేమోనని భయపడతారు. కాని ఇది పొరపాటు. మనం పడుకున్న పత్రికలను చూస్తాంగాని పారిపోయిన పత్రికల్ని చూడం. అయితే ఒకటుంది, మనం పైకిపంపించేసిన సంచికలు, కాలిపోయిన అవ్వాయి చువ్వల మొహాలేసుకుని మళ్ళీ తిరిగి రావటానికి అవకాశంవుంది. పత్రికల్ని పైకి నడిపించటం ఎంతకష్టమో, అవి వెనక్కు తిరిగిరావటం అంత సులభం. అందుచేత తెలివిగా పత్రికలు నడిపేవారేం చేస్తారంటే పత్రికల్ని బయటికి పంపేసి తలుపు బిడాయించేస్తారు—"మిగిలిపోయిన కాపీలు వాపసు తీసుకోబడవు" అని ఏజంట్లకు ఒకషరతు పెడతారు. ఈ షరతుప్రకారం కొందరు ఏజంట్లు మనపత్రికను స్వార్జితంతో పోషించవలిసి వస్తుంది. ఇటువంటి ఏజెంటు విశేషకాలం దక్కడు; సమయంకోసం కనిపెట్టుకునివుండి పత్రికలమ్మిన డబ్బు పులుసులోవేసుకుని ఏజన్సీ విరమించుకుంటాడు. ఏజెంటు హతకులిటువంటి దుర్మార్గానికి పాల్పడకుండా వాడిదగ్గిర తగుమాత్రం డిపాజిట్టు తీసుకోవాలి.

ఈ డిపాజిట్లు మన ఏజెంట్లుతోక ఝాడించకుండా చూడటమేకాక మన పత్రిక నడపటానికి ఆర్థికంగా చాలావరకు సహాయపడగలవు. ఎంతో డబ్బుంటేగాని పత్రికలు నడపలేమనుకునేవాళ్ళు ఈ రహస్యం ముఖ్యంగా గుర్తించేది.

పత్రికలు నడిపేవాడి కష్టాలింతటితో గట్టెక్కవు. మనం వేసే పత్రికలన్నీ అమ్ముడుపోయినా, ఏజెట్లందరూ, పైనెల మొదటివారం లోపల డబ్బు పంపిస్తున్నా పత్రికమీద లాభాలుండవు. సహృదయలోకానికి మన సర్క్యులేషను రెట్టింపుచేసి చెప్పినప్పటికీ ఈ కొరత తీరదు. పత్రికకు తైలం లేందీ నడవదు. ఈ తైలం ప్రకటనలద్వారా వస్తుంది. ప్రకటనలు సులభంగా రావు. వాటికోసం కొంతకాలం ప్రయత్నించిన తరవాత అవి అసలు రానే రావని తేలిపోతుంది.

కె. కె. రావు

అప్పుడు పత్రిక నడిపేవాడు పెద్ద సత్యం గ్రహిస్తాడు. పత్రికలు నడిపేవాడి మహోన్నత ఆశయం ప్రకటనలు తెచ్చుకోవటమని ! పత్రికల్లో కులభేదాలున్నాయి. ఆ భేదాలు పత్రికతో పడే వ్యాసాలనుబట్టి గాని, బ్లాకులను బట్టి గాని, పత్రిక రంగులనుబట్టి గాని, ప్రింటింగుబట్టి కాని రావు ; పత్రికలోపడే ప్రకటనలుబట్టి వస్తాయి. మీకేమీ సందేహం అక్కర్లేదు, లింటాస్, జే. వాల్టర్ థాంప్సన్ ఈస్టర్న్ లిమిటెడ్ మొదలయిన పెద్ద ఏజన్సీల ఎడ్వర్టయిజుమెంట్లు తెచ్చుకునేవాడు ముష్టిసాహిత్య సేవకులతో మాట్లాడడు. ఎందుకు మాట్లాడాలీ ? చాతనయితే నువ్వు కూడా ఆ ప్రకటనలు తెచ్చుకో !

నిజంగా డబ్బిచ్చే ప్రకటనలు తెచ్చుకోవటానికి పుష్-కలం కావాలి. అన్నికలాలకూ పుష్ ఉండదు. గొప్పవాళ్ళు కాదలచినవారు రెండురకాలుగా ఉంటారు: గొప్పవాళ్ళలో కొద్దివాడుగానైనా తిరుగుదామనుకునే వాళ్ళూ కొద్దివాళ్ళలోనే అయినా గొప్పగా తిరుగుదామనుకునేవాళ్ళూ. రెండోరకంవాళ్ళు ప్రకటనలు తెచ్చుకోలేరు. దానిసంగతంతే !

పత్రికలు నడిపేవాడి ఆఖరుసమస్య రచయితలూ, వ్యాసాలూనూ. ఇది ప్రధాన సమస్యకాదు, కనకనే దాన్ని ఆఖరుకు వేశాం. పత్రికల్లో కొన్నివ్యాసా లుండాలి, వాటిని ఎవరో ఒకరురాయాలి. అంతకంటె ఇందులో ఏమీ సమస్య లేదు. పరమ తుక్కు రచనలు వేసే పత్రికలుకూడా హాయిగా నడుస్తున్నాయి. ఆమాటకొస్తే అవే బాగా నడుస్తున్నాయి. "మంచిరచనలు, మంచిరచనలు" అని ఆరాటపడే పత్రికలు సోదిలోకి రాకుండా పోతున్నై.

ప్రఖ్యాత రచయితలచేత రాయించటం పత్రికకు ఆకర్షణ అని కొందరపోహ పడతారు. ఇది కేవలమూ భ్రమ. అస్తమానమూ ప్రఖ్యాతరచయితలవ్యాసాలే వేస్తుంటే ఇక సంపాదకుడు చేసేదేముంది ? అందుచేత సంపాదకుడు ప్రఖ్యాతరచయితలమని భ్రమపడేవాళ్ళరచనల్ని తొక్కిపెట్టి, తన యిష్టం వచ్చినట్టుచేసి పత్రికకు సంపాదకు డెవరో స్పష్టంగా తెలియజేయాలి. పత్రిక కెప్పటికైనా పేరొస్తే అది సంపాదకుడి సంపాదకత్వబలంవల్ల రావాలిగాని ప్రఖ్యాతరచయితల మూలంగా రాకూడదు. అమాటకొస్తే పత్రిక చూడటానికి అసహ్యంగాకూడా ఉండాలి. పత్రిక ఎంత అసహ్యంగా ఉంటే సంపాదకుడంత పేరు సంపాదకిస్తాడు. అనామకులైన కుర్రకారును పక్కనవేసుకుని గొప్పనటులు కొందరు పేరుకు పేరూ, డబ్బుకు డబ్బూ కూడా గడించే సూత్రంమీదే సంపాదకుడు కూడా పేరూ, డబ్బూ సంపాదకించవచ్చు.

కొందరు పత్రికలు నడిపేవారు వ్యాసకర్తలకు డబ్బీకపోవటం గురించి కించపడతారు. కాని నిజం ఏమిటంటే, అనేక సంవత్సరాలనుంచీ అవిచ్ఛిన్నంగా సాగే పత్రికలు కూడా వ్యాసకర్తలకు డబ్బివ్వటం మొదలుపెడితే తక్కున దివాలాతీసి ఊరుకుంటై. పత్రికలెప్పుడూ దివాలా అంచున నడుస్తూ వుంటై. అందుచేత ప్రెస్సుబిల్లూ, ప్రకటనలు తెచ్చేవాళ్ళకిచ్చే కమిషనులూ, అప్పుడప్పుడూ ఏజెంట్లు ఎగేసేదిపోను, పత్రికనడిపేవాడికి ఇంటిఖర్చు బొటాబొడిగా వస్తుంది. ఇందులో వ్యాసకర్తల కివ్వటమంటూ పెట్టుకుంటే, ప్రెస్సుబిల్లెగ్గొట్టాలిసొస్తుంది, లేదా ప్రకటనలుపోతై. అదీకాదా ఏజెంట్లు టోపీవెయ్యటానికుండదు. అదీకాక పత్రికకు ఉచితంగా

వ్యాసాలు కట్టలకు కట్టలు వచ్చిపడుతుండగా కొన్ని వ్యాసాలకు డబివ్వటం న్యాయంగా వుండదు. ఇస్తే అన్నిటికీ ఇవ్వాలి. పోతే, ఊరికేవచ్చే వ్యాసాలక్కూడా డబ్బివ్వటం హాస్యాస్పదంగా ఉంటుంది. అందుచేత వ్యాసకర్తలకు డబ్బివ్వటమనేదాన్ని, సాహిత్యం విలవలాగే, కాలం నిర్ణయించేస్తుంది.

పత్రిక పాలసీగురించి ఒక ముక్క. పత్రికలు జనసామాన్యంకోసం నడుపుతాం. ఓ యస్, పత్రిక ప్రజాసాహిత్యాన్ని ప్రచారం చెయ్యాలి. నిజమైన ప్రజాసాహిత్యం ఏదంటే జనసామాన్యానికి నచ్చే రాజకీయభావాలూ, విమర్శలూ పత్రికలో ప్రచారం కావాలి. ప్రజలకి పనికొచ్చే భావాలని పేరుపెట్టి తమ యిష్టం వచ్చిన నినాదాలు ప్రచారం చేసే వాళ్ళు, నిజమైన ప్రజాహితులు. ప్రజల స్థితిని చూసీ, వారి అజ్ఞానాన్ని చూసీ అసంతృప్తి చెందరు. ఒకవేళ ప్రజల అభిప్రాయాల్లో తికమకలుంటే మన పాలిసీకి మరీ మంచిది. ఎటురావినా సులభంగా సమర్థించుకోవచ్చు. జనసామాన్యం గాంధీజీని తిడితే మనమూ తిట్టాలి. అందరూ తిట్టక పూర్వమే మనం కూడా తిట్టటం అది దేశద్రోహం అవుతుంది. ఆంధ్రులకు అరవలంటే మంట గనక మనం అరవలను దుమ్మెత్తి పొయ్యొచ్చును. ఇతరులెవరో రాజకీయాల్లోకి జాతివిభేదాలు తెచ్చిపెడతారు గనక మనజాతిని మనం గట్టిగా సమర్థించటం మన ఉత్కృష్ట ధర్మం.

కొత్తగా బయల్దేరే ఉద్యమాలని పత్రికలు నడిపే వాళ్ళం బెదురుతో చూడాలి. ప్రతి ఉద్యమంలోనూ గర్భితంగా వున్న మంచిచెడ్డలూ, శక్తులూ ఎవడు అంచనా కట్టుతూ కూచుంటాడు? అందుచేత ప్రతి కొత్త ఉద్యమాన్నీ ముందు ఎదుర్కొని చూడాలి. మనం ఎంత ఆపినా ఆగకుండా అది ముందుకొస్తే అప్పుడు మనంకూడా దాన్ని మెచ్చుకోవచ్చు. వెనక నువు తిట్టావే అని ఎవడూ అడగడు. ఉమర్ ఖయ్యాం చెప్పినట్టు "నిన్న" అనేది ఎవడిక్కావాలి?

మన ప్రయత్నం లేకుండా పైకొచ్చే వ్యక్తులనుకూడా పత్రికద్వారా ట్రాజాలల్లే పొగడాలి. తాలూకాఫీసు గుమాస్తాలు రెవెన్యూ ఇనస్పెక్టర్లయినప్పుడూ, ప్లీడర్లు మునసబులైనప్పుడూ మనం వారికి తగుమాత్రం జిడ్డు రాచి వదలాలి. ప్రపంచం మారటానికి మనమేమీ చెయ్యరాదు. వాటంతట అవి జరిగినప్పుడల్లా ప్రతి మార్పునూ మనం గుర్తించి శ్లాఘించాలి. మనంవేసే టమటమాలో కేకల పస తక్కువైనప్పుడు డప్పు మరింత గట్టిగా కొట్టాలి.

ఎవరన్నా ప్రఖ్యాత పురుషులు చచ్చిపోతే మనం సంపాదకీయకంగా కిందబడి మూర్ఛపోయి, పొర్లి, రాగాలుపెట్టి ఘట్టిగా ఏడిచి, మనకన్న మరెవ్వరూ ఏడవలేరనేది రూఢీ చేసుకోవాలి. చచ్చిపోయిన ప్రతివాడి గొప్పా అన్వేషించి చెప్పటానికి మనకి నిజంగా టైముండదు.

ఈ పద్ధతులమీద తెలుగుపత్రికల్ని నడిపినట్లయితే తెలుగు జర్నలిజం చక్కని సర్కసులాగా తయారు కావటానికేమీ సందేహంలేదు.




(గతసంచిక తరువాయి)

- 19 -

క్రోడుకునోట ఈ సంగతి వినగానే కోపం, విరక్తి, నిరాశా ప్రకోపించి రాసవిహారి బ్రహ్మజ్ఞానమూ, సంస్కారమూ అనే బురఖా వదిలి అసలువ్యక్తి బయటపడ్డాడు. అతను కటుస్వరంతో—"హిందువులు మనల్ని అలగా జాతులనేది ఇందుకేగా, నాయనా! నువ్వు బ్రాహ్మమతం పుచ్చుకుంటే ఏం, ఏమయితేనేం—నీ కులబుద్ధి ఎక్కడికి పోతుందిరా? బ్రాహ్మలా కాయస్తులా పిల్లవాడివయితే నీవు ఒకరు చెప్పకుండానే నీ మంచిచెడ్డలు తెలుసుకునేవాడివి. ఛో, ఇకపోయి గాడిదలు కాచుకు బతుకు. నీకు రాత్రింబగళ్ళూ చిలకకు చెప్పినట్టు చెప్పాను; ముందు ఆ ముడి కాస్తా పడనివ్వు, ఆ తర్వాత నీ ఇష్టమొచ్చినట్టు ఎగరవచ్చు అని. కాని, నీకు ఆత్రం ఆగి ఏడిస్తేగా—ఆ పిల్లను చెలికితివి. నీలాంటి మొహాలేనా ఆ పిల్లతో డీకొనగలిగేది? వాళ్ళవంశం ఎలాంటిదో తెలుసా? వాళ్ళతాత హరిరాయ్ పేరుచెప్పితే పులీ, మేకా ఒకరేవులో నీళ్ళు తాగేవి? నువ్వా ఆ పిల్లకు ముక్కుతాడు వెయ్యాలని చూసేది? తెలివితక్కువ దద్దమ్మా! పరువు మర్యాదలు పోయినై—ఈ జమీందారీ చేజిక్కే ఆశపోయింది, నెల నెలా రెండువందల రూపాయలువచ్చేవి పోయినై—ఛో, ఇక పొలందున్ని బతుకు! పైగా నా దగ్గరికి వచ్చావా, ఆ పిల్లమీద కళ్ళురుముతూ? ఛో, ఛో నా యెదటినించి మూర్ఖుడా! కొరగాని వెధవా!" అని కొడుకును చివాట్లుపెట్టాడు.

ఈ తగువు జరగకండా ఉంటే చాలా బాగా ఉండేదని విలాసుడు అనుకుంటున్నాడు. పైగా తండ్రికూడా ఇలా తనమీదనే ఎగరటం చూసేవరకు అతను నీరయ్యాడు. అయినా అతను దీనికి సమాధానమేదో చెప్ప బూనుకునేవరకు తండ్రి కోపంతో అది వినిపించుకోకుండా ఇంకో గదిలోకి వెళ్ళిపోయాడు. కాని కొడుకును కోపంతో ఏమన్నా అనసీ, పనిపడ్డప్పుడు రాసవిహారి ఉద్రేకంతో గానీ, తొందరపడి గానీ ఏపనీ పాడుచెయ్యలేదు—అలాగని జాగుచేసి కూడా పాడుచెయ్యలేదు. అందుకనే రెండుమూడు రోజులు ఓర్పువహించి, విజయ చల్లబడటానికి కొంచెం అవకాశం యిచ్చి, నాలుగోనాడు రాసవిహారి అతి గంభీరంగానూ, శాంతంగానూ విజయ ఇంటికివచ్చి హాల్లోవున్న కుర్చీవొకటి లాక్కుని కూర్చున్నాడు.

ఆ పిచ్చికోపం తగ్గిపోగానే, తను అలా మొరటుగా మాట్లాడినందుకు, ప్రవర్తించినందుకు విజయ సిగ్గుతో కుంగిపోతున్నది. ఇంటో నౌకర్లద్వారా తన ప్రేలుడంతా ఊళ్ళోకి పాకిఉంటుందనీ, ఊళ్ళోవాళ్ళు చిలవలకు పలవలుచేసి నీలాటిరేవుల్లోనూ, రచ్చసావిళ్ళలోనూ చెప్పుకుని తన్నుగురించి నవ్వుకుంటూ ఉంటారని విజయ భావించింది. ఈ సంగతులు తలుచుకున్నప్పటినించి ఆమె బయటికి రాలేకండా ఉన్నది. అన్నిటికంటే ఆమెకు చిన్నతనంగా ఉన్న

దేమంటే ఇవ్వాళ అందరి ఎదటా నౌకరని వెళ్ళగొట్టిన మనిషినే రేపు భర్తగా స్వీకరించవలసి ఉన్నది—ఈ సంగతి దాచాలంటే మాత్రం ఎన్నాళ్లు దాగుతుంది?

అందుచేతనే, రాసవిహారి ప్రసన్నవదనంతో గదిలోకివచ్చి కూర్చోగానే విజయ తల ఎత్తి అతనివంక చూడలేకపోయింది. కాని ఇతని రాకకోసం విజయ ప్రతినిమిషమూ ఎదురు చూస్తూనేఉంది. వాళ్ళు అడగబోయే ప్రశ్నలకు ఈమె జవాబులుకూడా నిన్నటినించి సిద్ధంచేసుకుని ఉంచింది. కాని వృద్ధుడు ఆమె ఊహించుకున్నదానికి అంతా విరుద్ధంగా మాట్లాడి ఆమె బిత్తరపోయేటట్టు చేశాడు. రాసవిహారి కొన్నిక్షణాలు అలాగే కూర్చుని, దీర్ఘంగా నిట్టూరుస్తూ—"తల్లీ, విజయా! ఇది విన్నప్పుడు నాకెంత ఆనందం కలిగిందంటే అప్పుడే నీ దగ్గరికి పరుగెత్తుకువద్దామనుకున్నాను—కాని వాతనొప్పులు మూలాన కదలలేకపోయాను. చిరంజీవివి కా తల్లీ! నాకోరిక ఇదే; ఇదే నీనించికోరేది!" అని ఇంకా పెద్దగా నిట్టూర్చి—"సర్వశక్తి వంతుడూ, మంగళమయుడూ అయిన భగవంతుణ్ణి నేను ప్రార్థించేదేమంటే మంచిచెడ్డలలో, కష్టసుఖాలలో ధర్మంనించీ, న్యాయంనించీ నన్ను వైదొలగకుండా చేయమని; నా కా గట్టి మనోనిగ్రహం ఇవ్వమని." అని రెండుచేతులూ తలకు ఆనించి, కళ్ళుమూసి బహుశా ఆ సర్వశక్తివంతుడికి ప్రణామం చేశాడనుకుంటాను.

ఆ తర్వాత కళ్ళుతెరిచి హఠాత్తుగా, ఉత్తేజితుడైనట్టు చెప్పనారంభించాడు:—"కాని ఒక్క విషయంమాత్రం నాకు అర్థంకాకుండా ఉంది, విజయా! నాబోటి అమాయకుడికి, ఉదాసీనుడికి, వీతరాగికి విలాసుడివంటి లౌకికుడు విషయవాంఛాపరుడు ఎలా పుట్టాడా అని? ఎవని తండ్రికి ఇంతవరకు పనిపాటలు చేయించుకునే మెలకువగానీ, లాభనష్టాల జ్ఞానంగానీ రాలేదో, అతని కొడుకు ఈ చిన్న వయసులోనే ఇంత నేర్పరి ఎలా అయాడా అని? వాడి ప్రవర్తనలో నటన ఏదో, యదార్థం ఏదో తెలుసుకోలేము తల్లీ!" అని ఇంకోమాటు కళ్ళు మూసుకుని తలవంచాడు.

విజయ మాట్లాడలేదు. రాసవిహారి కొంచెంసేపు మౌనంగాఉండి మళ్ళీ చెప్పనారంభించాడు:—"కాని ఏదీ అతిగాపోతే బాగుండదు. విలాసుడికి పనిపాటలంటే ఇష్టం! అక్కడ వాడికి రెండో ఆలోచన లేదు! జరగవలసిన పని జరగనప్పుడు వాడికి గుండెల్లో శూలం గుచ్చుకున్నట్టు ఉంటుంది; ఈ సంగతులన్నీ మనకు తెలును; కాని పెద్దమనుషుల మానం కాపాడవద్దా? దయాళులాంటి వ్యక్తుల లోపాలుకూడా మనం క్షమించకపోతే ఎట్లా? బీదవాళ్ళు కానీ, భాగ్యవంతులు కానీ, పెద్దవారు కానీ, చిన్నవారు కానీ చేసినతప్పు తప్పేననుకో; అలాగని దాన్ని ప్రతివారిపట్లా అమలుజరపడం ఎట్లా? సరే, పనిచేయకపోవటం తప్పే; చెప్పకుండా నాగా వెయ్యటంకూడా తప్పే; ఆఫీసు డిసిప్లిన్ చెడిపోతే ఆఫీసు మేనేజరే దానికి బాధ్యుడు, అదీ పెద్దతప్పే; కాని దయాళుణ్ణికూడా?—లేదు తల్లీ! నేను ముసలివాణ్ణి. నాలో ఆ బలమూ లేదు, ఆ పట్టుదలాలేదు—దొరలు కర్తవ్యపాలనను ఎంతైనా పొగడనీ, ఎంత ముఖ్యమని అయినా అనుకోనీ—కాని మనంమాత్రం అంత మంచిదని అనుకోలేము. తల్లీ, నా కొడుకని నేను ఈ నోటితో అబద్ధం ఆడలేను! నేను చెప్పేదేమంటే పని ఇవ్వాళ కాకపోతే రెండు రోజులు ఆలస్యమవుతుంది. మహా అయితే పదిరూపాయలు దండగ అవుతుంది; అంత మాత్రంచేత మానవదౌర్బల్యాన్నీ, పొరపాట్లనూ క్షమించకండా ఉండటమా? విలాసుని మన సంతా నీ జమీందారీ బాగుహోగులమీదే ఉందని తెలుస్తూనే ఉందే!....తల్లీ, ఈ విషయంలో మాత్రం నువ్వు నన్ను పొరపాటుగా అర్థం చేసుకోవద్దు. నేను ప్రాపంచిక విషయాల్లో ఎంత విరక్తి చెందినప్పటికీ ఆస్తిపాస్తులను రక్షించుకోటం గృహస్థుల పరమధర్మమని నే నొప్పుకుంటాను. దాన్ని పెంచటంకూడా ధర్మమే—ఎందుకంటే అదిలేంది ప్రపంచానికి మేలు చేయలేము. ఇక విలాసునిచేతిలో నీ జమీందారీ రెట్టింపూ, నాలుగురెట్లూ ఆఖరికి పదిరెట్లు అయిం

దని విన్నా నేనేమీ ఆశ్చర్యపడను—ఇప్పుడు అవుతున్నదికూడా అంతే. అంతా బాగానేఉంది, గాని ఆస్తి పెంపకం విషయంలో ఏ కాస్తైనా అడ్డువచ్చినా వాడంత తల్లక్రిందులవటం బాగా లేదు! అందుకనే, ఆ అద్వితీయ నిరాకార పరబ్రహ్మ పాదపద్మాలలో నేను నిరంతరమూ కోరే భిక్ష ఏమంటే, వాని అణకువలేనితనానికి నీవు చేసిన శాస్తినించైనా వాడు గుణపాఠం నేర్చుకుని ముందుజాగ్రత పడుగాక! అని.–పని! పని! మనం ప్రపంచంలోకి వచ్చింది కేవలం పనికోసమేనా! పనికోసం దయా ధర్మాలుకూడా వదిలిపెట్టవలసిందేనా! బాగా జరిగింది తల్లీ! ఇవ్వాళ వాడు నీనించే గుణపాఠం నేర్చుకున్నాడు!"

విజయ మాట్లాడలేదు. రాసవిహారి కొంచెంసేపు లోలోపలే లీనుడై, తల ఎత్తి మందహాసంచేస్తూ, మృదువుగా–"నా యిద్దరి పిల్లల్లో ఒకడు మహా కర్మిష్ఠి; రెండోవారి హృదయం స్నేహ, మమత, కరుణలతో పరిపూర్ణం! ఒకరికి పని అంటే ఎంత పిచ్చో, రెండోవారికి దయ చూపటమంటే అంత ఉన్మాదం! నేను నిన్నటినించి విస్తుపోయి ఆలోచించేదేమంటే, భగవంతుడు ఈ యిద్దరినీ పూన్చి రథంనడపటం మొదలుపెడితే ఈ దుఃఖమయ ప్రపంచంలోకి స్వర్గందిగి రాదా అని! పోతే ఇక భగవంతునికి నా ప్రార్థన ఒక్కటే తల్లీ, ఆ శుభదినం చూసిందాకా నన్ను బ్రతకనివ్వమని." అని ఈమాటు తల టేబిలుకు ఆనించి ప్రణామం చేశాడు. ఆ తర్వాత తలఎత్తి ఇలా అన్నాడు:

"కాని, చిత్రమేమంటే మతంమీదకూడా వాడికి తక్కువ ఆసక్తిలేదు! మందిర ప్రతిష్ఠాపనకోసం వాడెంత ప్రాణాలొడ్డి పాటుపడ్డాడు! వాడిని బాగా ఎరగనివాళ్ళు చూస్తే, విలాసుడికి ఈ ప్రపంచంలో బ్రాహ్మమతం ప్రచారంచేయటం తప్ప వేరేపని ఏమీ లేదా? అనిపిస్తుంది! వాడు ఇందుకోసమే బ్రతికివున్నాడనీ, ఇది తప్ప వాడికిక ఏమీ పట్టలేదనీకూడా అనుకుంటారు! సరే-భలే బాగుంది. నా కొడుకువిషయమై నేనే అంతా మరిచిపోయి చెప్పుకుపోతున్నాను—నీకేమీ తెలియనట్టు! నాకంటే నువ్వు వాడిమేలు తక్కువకోరేదానివన్నట్టు" అని మందహాసం చేస్తూ మళ్ళీ మొదలుపెట్టాడు:—"నాకింత ఆనందం ఇందుకే తల్లీ! నేను నీ హృదయం అద్దంలాగా చూడగలుగుతున్నాను; మీ భవిష్యత్తు నాకు చాలా ఉజ్వలంగా కనిపిస్తోంది; అదీ కాక ఇలాంటి ధర్మకార్యాలు నీవు తప్ప ఎవరు సహాయం చేయగలరు? అతని ధర్మార్థ కామ మోక్షాలకు సహచరివి నీవే కదా! నీ చేతిలోనే వాడి మంచిచెడ్డలు వున్నై! వాడు శక్తి, నీవు బుద్ధి! వాడు బరువు మోస్తూపోతే, నీవు దోవచూపిస్తూ నడుస్తావు! అప్పుడే మీ ఇద్దరి జీవితాలూ సార్థకమవుతై తల్లీ! అందుచేతనే ఇవాళ నేను ఆనందం పట్టలేకుండా వున్నాను. విలాసుడికి ఇక ఏమీ భయంలేదనీ, వాడి భవిష్యత్తును గురించి ఏమీ చింతపడనక్కర్లేదనీ, ఇవ్వాళ నాకు నమ్మకం కుదిరిపోయింది! కాని, తల్లీ, నిన్ను నేను ఒక్కటి అడుగుతాను చెప్పు—ఇంత ఆలోచనా, ఇంత జ్ఞానమూ, ఇంత దూరదృష్టీ ఈ చిన్నతలలో ఇంతకాలం ఎట్లా దాచావో చెప్పూ?"

విజయ సర్వాంగాలూ చలించినై. కాని ఆమెఏమీ మాట్లాడలేదు. రాసవిహారి గడియారంవంక చూసి చకితుడై—"అరే, పదిగంట లయిందే! దయాళబాబు భార్యను చూట్టానికి పోవాలి!" అన్నాడు.

విజయ మెల్లగా—"ఆమెకిప్పుడు ఎలాగున్నది?" అని అడిగింది.

"బాగానేఉంది" అని అతను వాకిలివేపుకు రెండు అడుగులువేసి తక్కున ఆగి—"నీకింకా అసలు సంగతి చెప్పనే లేదు" అని, మళ్ళీ మామూలుచోటుకువచ్చి కూర్చుని నింపాదిగా ప్రారంభించాడు:—"నీవీ ముసలి కక్కయ్యమాట ఒకటి పాలించాలి విజయా! చెప్పు, పాలిస్తావా?"

విజయ లోలోపల భయపడింది. ఈసంగతి ఆమె ముఖాన్నిబట్టి రాసవిహారి గ్రహించి— "అలా కుదరదు. నీవీ ముసలివాడిమాట వినవలసిందే: చెప్పు, వింటావా" అని అడిగాడు.

"చెప్పండి." అన్నది విజయ అస్ఫుటంగా.

"వాడు నిద్రాహారాలు వదలటమేకాదు, చాలా పశ్చాత్తాప పడుతున్నాడనికూడా నాకు తెలుసు. కాని, నువుమాత్రం తల్లీ! వీడిపట్ల కొంచెం కాఠిన్యం వహించాలి. నిన్నకొంచెం అభిమానంతో రాలేదు, గాని ఇవ్వాళ తప్పకవచ్చి పడతాడు; కాని క్షమించమని అడగంగానే నువ్వుమాత్రం క్షమించకూడదు—ఇదే, నా ఏకైకవాంఛ—ఏ అన్యాయంకోసం నువ్వువాడిని శిక్షించావో, కనీసం నువ్వు అది ఇంకోరోజు అనుభవించనివ్వు." అని రాసవిహారి విజయ ముఖాన విస్మయ చిహ్నాలుచూసి మందహాసంచేసి, స్నేహపూరిత స్వరంతో చెప్పనారంభించాడు.

"నువ్వు లోపల ఎంతకష్టపడుతున్నావో నేను గ్రహించలేదనుకున్నావా, తల్లీ? నిన్ను నేను ఎరగనా? నాతల్లివేగానీవు వాడికంటేకూడా నీవు ఎక్కువ బాధపడుతున్నావని నాకు తెలుసు. కాని అపరాధానికి పూర్తిశాస్తి జరగంది ప్రాయశ్చిత్తంకాదు. కాని ఈ భయంకర బాధను నువ్వింకోరోజు వోర్చుకోలేకపోతే వాడు విముక్తిచెందలేడు! అంతకఠినంగా ఉండ లేవని నీకుతోస్తే నీవు వాడికి కనపడనేవద్దు; కాని ఇవ్వాళమాత్రం వాడు నిరాశతో తిరిగి పోవలసిందే. నాకోరిక ఇదే విజయా! ఈ బాధే వాడిని ఇంకొంచెం పడనివ్వమని."

రాసవిహారి వెళ్ళిపోయిన తర్వాత విజయ నిజమైన ఆశ్చర్యంతో స్థబ్దురాలై కూర్చున్నది. ఈమాదిరిమాటలూ, ఈ ప్రవర్తనా వింటాననిగానీ చూస్తాననిగానీ ఆమె అనుకోనేలేదు; పైగా, మనసును గట్టిపరుచుకుని వాళ్ళరాకకు ఎదురుచూస్తూ ఉంది! విలాసుడు వొంటరిగా చివాట్లు తినిపోయినప్పటికీ, బదులుతీర్చుకునేటప్పుడు తండ్రినికూడా వెంటతీసుకువస్తాడు. వాళ్ళని ఎదుర్కోటం ఎంతకష్టమో ఊహించుకునేవరకు విజయకు శాంతిలేకుండాపోయింది.

ఇవ్వాళ ఈ వృద్ధుడు వెళ్ళిపోయినతర్వాత విజయకు ఒక పెద్దభయం తొలగిపోవటమే కాదు—ఒకప్పుడు ఈ ముసలివాడిని చాలా గౌరవించేదానిననికూడా జ్ఞాపకంతెచ్చుకుంది. ఆ గౌరవం క్రమంగా పోయినందుకు లోలోపల బాధపడిందికూడా. ఇలా అతనిమీద అగౌరవం కలిగినందుకు స్వర్గస్థుడైన తండ్రికి తనమీద కోపంకలిగి ఉండవచ్చుననికూడా భావించింది. రాసవిహారి ఎంత నిక్కచ్చి మనిషి! తప్పువున్నప్పుడు కొడుకునుకూడా క్షమించలేదు—పైగా తన్ను సులువుగా క్షమించవద్దని ఎన్నోవిధాల చెప్పిపోయినాడు.

ఇవన్నీకాక, ముసలివాడుచెప్పిన దాంటోనూ, బలవంత పెట్టినదాంటోనూ, బ్రతిమాలిన దాంటోనూ, గర్భితంగా దాగివుంటూ స్పష్టంగా పైకి కనిపిస్తున్నది విలాసుని అపారమైన ప్రేమా, దానివల్లకలిగిన ప్రబలమైన జెలసీ.

ఈవిషయం విజయ గ్రహించలేదనటానికి వీలులేదు; కాని, ఇప్పుడు బయటి తాకుడు వల్ల ఆమె హృదయంలో కొత్త తరంగంలాగా రేచింది. ఇంతవరకూ హృదయంలోనే అణిగి వున్నది. అందుచేతనే రాసవిహారివెళ్ళి చాలాసేపు అయినప్పటికీ అతను అన్నమాటలు ఆమె చెవిలో మారుమ్రోగుతూవున్నై. ఆమె పరవశమైపోయి కిటికీలోనించి బయటికిచూస్తూ అలానే వుండిపోయింది. ఈర్ష్య ఈ ప్రపంచంలో అందరిచేతా గర్హింపబడినదే. కాని, ఇవాళ విలాసునివిషయంలో ఆమె దానిని గౌరవించ గలిగింది. నిన్నటినించి ఎవరైతే తనకు ప్రత్యర్థులని భావించి, నానావిధమైన ఆలోచనలతో దిక్కుతోచక బాధపడిందో, ఇవాళ వారు తన సొంత మనుషులుగా తెలుసుకుని శాంతితో నిట్టూర్చింది.

కాశీపదుడువచ్చి—"అమ్మగారూ! ఇంటికి ఉత్తరం రాసెయ్యమంటారా? నేనురావటం లేదని?" అని అడిగాడు.

విజయ సందిగ్ధావస్థలో పడి—"సరే" అన్నది.

కాని, వాడు వెళ్ళుతూవుండగా మళ్ళీపిలిచి, సిగ్గుతోకూడిన సంకోచంతో—"అంతకంటే, ఉత్తరం ఎలానూ రాశావుగదా, ఒకమాటు పోయిరాకూడ్దదూ, కాశీవద్! వాళ్ళమాటా వున్నట్టు వుంటుంది, నీవూ పిల్లల్నిచూసి రావచ్చు. నువ్వు ఇంటికిపోయి చాలాకాలమైంది కదూ?" అన్నది.

కాశీపదుడు లోలోపల చాలా ఆశ్చర్యపడి—"సరే, నేనొక నెలపాటు చుట్టివస్తాను, అమ్మగారూ!" అని వాడు వెళ్ళిపోగానే, విజయ తనలోకలిగిన ఈ దుర్బలత్వానికి చాలా సిగ్గుపడసాగింది. అలాగని మళ్ళీ వాడినిపిలిపించి చెప్పనూ లేకపోయింది.

— 20 —

ఇంటి ప్రహరీకి అనించివేసిన కొట్టాలలో జమీందారీ ఆఫీసు వుండేది. దానికి ఎదురుగా ముంతమామిడి చెట్టు ఒకటి గుబురుగా వుండటంమూలాన ఇంటోనించిచూస్తే అవి కనపడేవి గావు. అదీకాక ప్రహరీ గోడకే చిన్న వాకిలివుంది. గుమాస్తాలు ఆ వాకిలిగుండానే వస్తూ పోతూ వుంటంచేత వాళ్ళు ఎప్పుడువచ్చి పోయేదీ అసలు తెలిసేదేకాదు, ఇంటోఉంటే.

ఆనాటినించి మళ్ళీ దయాకబాబు ఇంటికి రాలేదు. పనిలోకివస్తున్నదీ లేనిదీ తెలుసుకోటానికి సంకోచించింది, ఆమె. విలాసవిహారికూడా ఇటువేపు మళ్ళీ రాలేదు. ఈమధ్య రాసవిహారిమాత్రం ఒకమాటువచ్చి కాసేపు వుండిపోయాడు. కాని ఆ పూర్వపు ప్రసంగం తిరిగి తేలేదు. క్షేమసమాచారాలు కనుక్కొని వెళ్ళాడు.

మానవుని మనసులోని సంగతి పరమాత్ముడికే తెలియాలి; కాని, ఆవాళ కొడుకుకు ప్రతికూలంగా మాట్లాడినప్పుడు రాసవిహారి ముఖాన కనపడ్డ ప్రసన్నత ఇప్పుడు పూర్తిగా మాయమైందని విజయ గ్రహించి కొంచెం అదుర్దాపడింది. మొత్తంమీద చెప్పాలంటే విజయ చాలా అసంతృప్తితోనూ, ఏమీతోచకుండానూ దినాలుగడపనారంభించింది. ఇలా కొన్నిరోజులు గడిచినై.

ఇవాళ సాయంత్రం విజయ నదివొడ్డుకు షికారుకు పోదామని బయలుదేరుతుండగా పెద్ద గుమాస్తా ఖాతా పుస్తకాలు చంకను పెట్టుకువచ్చి, నమస్కారంచేసి—"ఎక్కడికైనా వెళ్ళుతున్నారా, అమ్మగారూ? కన్నాయిసింగ్ ఏడీ?" అని అడిగాడు.

విజయ నవ్వుముఖంతో—"ఇక్కడ పక్కనే నదివొడ్డుకు షికారుపోదామని బయలు దేరాను. దర్వాను ఎందుకూ, ఈ కాస్తెదూరానికి? నాతో మీకేమైనా పనిఉందా?" అని అడిగింది.

"కొద్దిగా పనిఉంది తల్లీ! సరే, రేపుచూసుకుందాము." అని అతను పోవటానికి ఉపక్రమించగానే విజయ మళ్ళీనవ్వుతూ—"కొద్దిపని అయితే ఇప్పుడే చెప్పరాదూ! ఇన్ని ఖాతా పుస్తకాలు తీసుకుని ఎక్కడికి వెళ్ళుతున్నారు?" అన్నది.

"మీదగ్గరికే వస్తున్నాను. క్రిందటి సంవత్సరం లెఖ్ఖలు తయారైనవి. తమరు సరిచూసి సంతకంపెట్టండి. అదీకాక, చిన్నబాబుగారు ఈ సంవత్సరంనించి ఏళ్ళోజు పద్దుల మీద ఆరోజే మీచేత సంతకం చేయించమన్నారు."

విజయ చాలా ఆశ్చర్యంతో తిరిగివచ్చి డ్రాయింగ్‌రూంలో కూచుంది. గుమస్తా వెనకనేవచ్చి ఒక పుస్తకంతెరిచి చూపబోతూవుండగా విజయ అడ్డువచ్చి—"ఈ ఆజ్ఞ మీకు ఎప్పుడిచ్చాడు?" అని అడిగింది.

"ఇవ్వాళ ఉదయమే."

"ఇవ్వాళ ఉదయం ఆయన వచ్చాడా ?"

"ఆయన రోజూ వస్తున్నారు."

"ఇప్పుడు కచేరీలో వున్నాడా ?"

గుమాస్తా తల అడ్డంగా తిప్పుతూ—"నన్ను ఇటుపంపి ఆయన ఇప్పుడే వెళ్ళిపోయారు." అన్నాడు.

ఆవాళ జరిగినకాండ అందరికీ తెలిసింది. అందుచేతనే విజయ అడిగిన ప్రశ్నలు పూర్తిగా అర్థంచేసుకున్న వాడిలాగా గుమస్తా చెప్పనారంభించాడు:—విలాసవిహారి ప్రతిరోజూ టంచనగా పదకొండు గంటలకు ఆఫీసుకు వస్తున్నారు. ఎవ్వరితోనూ మాట్లాడరు. తనపని తానుచూసుకుని ఐదుగంటలకు వెళ్ళిపోతారు. ఇంటోవారికి నయమయేటంతవరకూ ఆఫీసుకు రానక్కర్లేదని దయాళుబాబుకు సెలవుఇచ్చి పంపారు—ఇట్లాంటివన్నీ యజమానురాలికి తెలియజెప్పాడు.

విజయ సిగ్గు వ్యక్తమవుతున్న ముఖంతో ఈ సంగతులన్నీవిని, విలాసుడు తనమీద అలిగే, అభిమానంతో ఇలా ప్రవర్తిస్తున్నాడని తెల్సుకున్నది. అయినా (న్నాళ్ళనించీ తను సంతకాలుచేయకపోతే జరగటంలేదా, ఇప్పుడూ జరుగుతుందిలే అని అనలేదు. రేపు ఉదయం తీసుకురండి సంతకాలు చేస్తానని చెప్పి గుమాస్తానుపంపి అలానే స్తబ్ధుగా కూర్చున్నది. బయట ఎండ పోయింది. పొరుగుఇళ్ళలో సాయంకాలపు శంఖధ్వనులతో ఆకాశం ప్రతిధ్వనించింది. అయినా ఆమెలో లేచే లక్షణాలేవీ కనిపించలేదు. ఇంకా ఇలా ఎంతసేపు కూర్చునేదో చెప్పలేము, కాని నౌకరు లాంతరు తీసుకువచ్చి గదిలో యజమానురాలినిచూసి ఎంతగా ఆశ్చర్యపోయాడో విజయకూడా అంతకంటే ఎక్కువ సిగ్గుపడిలేచి బయటికివచ్చి, విస్తుపోతూ నుంచుంది.

ఆమెచూసిన విషయం ఆమె కల్పనకు, ఊహకుకూడా అతీతమైంది. అతను ఏ నెపంతో, ఏ వంకతో ఈ ఇంటో అడుగుపెడతాడు ? కాని ఆ సందెచీకటిలోకూడా స్పష్టంగా అతను ఆనాటి ఆరడుగుల పొడుగు దొరేననీ తన ఇంటోకే వస్తున్నాడనీ గ్రహించింది.

ఇవ్వాళ అతను పోలీసు ఉద్యోగి అని ఈమె భ్రమపడలేదు. కాని, అతన్ని చూసి నందువల్ల కలిగిన ఆనందరేఖను నిరాశ, భయమూ అనే కారుమబ్బు కమ్మివేసింది. అతను చెట్లచాటున మాయమవుతూ, కనపడుతూ ఇటే వస్తున్నాడు. అతన్ని ఆహ్వానించి కూచో బెట్టటం చాలా అన్యాయమని విజయ గ్రహించింది. కాని, అతన్ని నిర్లక్ష్యంచేసి బయటికి పంపటంకూడా అసాధ్యమని గ్రహించింది.

ఈ ఆలోచనలలోపడి ఆమె తెములుకోలేకుండా ఉండగా ఆవ్యక్తి తనదాపుకు రానే వచ్చాడు. విజయ చప్పున వెనక్కితిరిగి గదిలోకిపోయి కూర్చున్నది. ముసలి గుమాస్తా ఈసంగతి గమనించకుండా తలవంచుకుపోతూ, హఠాత్తుగా దొరనుచూసి గాభరాపడ్డాడు. కాని అతని ప్రశ్నవిని దొరకాదని కుదటపడి—"ఆఁ, వారు బయటిహాల్లోనే వున్నారు" అని వెళ్ళిపోయాడు. విజయ ఆ ప్రశ్నా ఈ జవాబూ రెండూ విన్నది. నరేంద్రుడు కాసేపట్లో హాలులోకివచ్చి నమస్కారంచేసి, టోపీ, చేతికర్రా టేబిలుమీదపెట్టి మందహాసంచేస్తూ— "భలే, నా మందు బాగా పనిచేసిందిలాగావుందే, చూస్తే !" అన్నాడు.

ఒక్కక్షణం క్రిందట విజయ ఇవాళ నరేంద్రుడితో మాట్లాడటం అలావుంచి చూడనే లేనని అనుకుంది. కాని చిత్రమేమంటే అతనిమాట వినేవరకు ఆమెలోవున్న సంకోచమూ, సందేహమూ తొలగిపోవటమేకాదు—ఆమె హృదయంలో అజ్ఞాతంగా త్రుతిచేసి పెట్టివున్న

వీణను మీటినట్లయింది. ఒక్కక్షణంలో ఆమె తన విచారాన్ని మరిచిపోయి—"ఎలా తెలుసుకున్నారు ? నన్నుచూశా ? లేక ఎవరన్నాచెప్పితే వినా ?" అని అడిగింది.

"విని. మీరు దయాళుబాబునోట ఎప్పుడూ వినలేదా, నేను రాసినమందు తిననక్కరలేదనీ, ప్రిస్క్రిప్షన్‌చూస్తేనే సగంజబ్బు పోతుందనీ !" అని, తన చాతుర్యానికి పకపక నవ్వేశాడు.

దయాళుదగ్గర అంతావినే ఇవ్వాళ తన్ను ఎగతాళిచేయటానికి వచ్చాడని విజయ భావించింది. అందుచేతనే ఆమె లోలోపల మండిపడి, ఎత్తిపొడుపుగా—"ఓహో, అందుకనేనా ఆ మిగతా సగం బాగుచెయ్యటానికి శ్రమపడి ఇంతదూరం వచ్చారు ?" అన్నది.

ఈ ఎత్తిపొడుపుతో నరేంద్రుడి నవ్వు ఆగిపోయింది. "నేను నిజంచెప్పుతున్నాను. ఇదంతా ఒక గమ్మత్తులాగావుంది" అన్నాడు.

"అందుకనేనా మీకింత సంతోషం ?" అన్నది విజయ.

నరేంద్రుని ముఖం గంభీరమైంది. "నాకా సంతోషం ? బొత్తిగాలేదు. కాని, నిజం చెప్పాలంటే ఈసంగతి నేను మొట్టమొదట విన్నప్పుడు కొంచెం గమ్మత్తుగావుంది; కాని తర్వాత చాలా బాధపడ్డాను. విలాసబాబు తత్వం అంతమంచిదికాదు—అనవసరంగా ఇతర్లను నొప్పిస్తూ వుంటాడు—అలాగని మీరుకూడా ఓర్పుచూపకండా అవమానకరంగా మాట్లాడటం అంతమంచిదికాదు. ఆలోచించిచూడండి, ఈ సంగతులు వెల్లడి అయితే ముందు ముందు మీకు ఎంత చిన్నతనంగానూ, కష్టంగానూ వుంటుందో. నామాట నమ్మండి, నేను మొదట విన్నప్పుడు చాలా బాధపడ్డాను. అందులో నావిషయమై మీ ఇద్దరిమధ్యా ఇలాంటి వైమనస్యంకలగటం—"

ఈ వ్యక్తి హృదయ పరిశుద్ధతకు విజయ లోలోపల ముగ్ధురాలైంది. ఐనా పరిహాసానికి—"కాని, మీకు నవ్వూ ఆగటంలేదుగా !" అని తనూ పకపకా నవ్వింది.

నరేంద్రుడు ఈమాటు బలవంతాన గాంభీర్యంతెచ్చుకుని—"ఎందుకూ మీరు మాటిమాటికీ అదే తీసుకువస్తారు ? నేను నిజంగానే చాలా బాధపడ్డాను. నిజానికి అప్పటికి మీకున్న సంబంధం నాకుతెలియదు." అని కాసేపు ఊరుకుని మళ్ళీ అన్నాడు:—"ఆవాళే, అతనినాన్న నా కన్నిసంగతులూ చెప్పి, ఈర్ష్య అన్నాడు. దయాళుబాబుకూడా నిన్న అదే అన్నాడు. ఇదివిన్నతర్వాత నేను చాలా సిగ్గుపడ్డాను. కాని, ఇంతమందిలో నామీదే ఈర్ష్య పడటానికి నాదగ్గర ఏమివున్నదో నాకు అర్థంకావటంలేదు. మీరు బ్రహ్మసమాజికులు; పనిపడితే అందరితో మాట్లాడతారు, నాతోనూ మాట్లాడారు. ఇందులో ఆయనకి తప్పుఎక్కడ కనపడిందో నాకుతోచకుండావున్నది. సరే, మీరుమాత్రం నన్ను క్షమించండి—పోతే, బెంగాలీలో ఏమంటారు—అభినందనాలు ! వాటినిమీకు తెలుపుతున్నాను—మీరు సుఖంగా వుండండి."

ఇతను ఆవాళ తన ప్రవర్తననుగురించి మాట్లాడుతూ విజయ ప్రవర్తన ఏమీ తేనిసంగతి కూడా ఆమె గమనించింది; కాని చివరి అతనిమాటలకు ఆమె కళ్ళురెండూ నీళ్ళతోనిండినవి. ఆమె తలతిప్పుకుని కన్నీరు ఆపుకోటం మొదలుపెట్టింది.

దీని జవాబుకు ఎదురుచూడకుండా నరేంద్రుడు—"సరే, ఆవాళ హఠాత్తుగా కాళీపదుడి చేతికి మైక్రోస్కోపు ఇచ్చి స్టేషనుకు పంపారు ఎందుకోచెప్పండి ?" అని అడిగాడు.

విజయ గొంతును కొంచెం సవరించుకుని—"మీ వస్తువు మీకే కావాలని ఆవాళ అడిగితిరికదా." అన్నది.

"నిజమే, కాని డబ్బుసంగతి వాడికి చెప్పి పంపలేదుగా ? అలాగైతే నా."

"లేదు. ఆ జ్వరపు తొందరంలో నేను చెప్పటం మరిచిపోయాను. కాని, ఆ మరుపుకు మీరుచేసిన శాస్తికూడా తక్కువది కాదుగా."

"కాని, కాళీపదుడు అన్నది——" అన్నాడు నరేంద్రుడు.

విజయ అడ్డుతూ :—"నేనా సంగతి విన్నాను. వాడు ఏమైనా చెప్పనీండి—మీకు బహూమానంగా పంపే ధైర్యం నాకు వున్నదని మీకెలా తోచింది ! ఒకవేళ చేసేవున్నాననుకోండి, మీకై మీరు నన్నెందుకు దండించలేదు ? ఎందుకు నౌకరుద్వారా నన్ను అవమానించారు ? మీకు నేనేమి అపకారం చేశాను ?" అని అంటూ వుండగానే దుఃఖంతో ఆమె గొంతు పట్టుకుపోయింది.

నరేంద్రుడు సిగ్గుతోనూ, ఆశ్చర్యంతోనూ విజయ ముఖంవంక చూశాడు. ఆమె తల తిప్పుకుని కిటికీలోనించి చూస్తోవుంది. ఆమె ముఖం అతనికి కనిపించలేదు గాని ఆమె మెడను వున్న రవ్వల గొలుసుమాత్రం దీపపు వెలుతురులో తళతళ మెరుస్తోంది. ఉభయులూ కొంచెం సేపు మెదలకండా ఊరుకున్నారు. ఆతర్వాత నరేంద్రుడే పశ్చాత్తాప ధోరణిలో—"నేను చేసిన పని మంచిదికాదని నే నప్పుడే గ్రహించాను——కాని, బండి కదిలిపోయింది. కాళీపదుడి తప్పు ఏముంది ? వాడిమీద కోపపడటం నాదే లోపం." మళ్ళీ కాసేపు ఊరుకుని అన్నాడు :—— "ఈర్ష్య ఎంత చెడ్డదో నే నిప్పుడు బాగా తెలుసుకున్నాను. అది ఒక్కచోటే అంటిపెట్టుకు వుండదు——వీలుచిక్కితే అంటువ్యాధిలాగా అందరికీ వ్యాపిస్తుంది. ఇప్పుడు నన్నుచూసి ఈర్ష్య పడవలసింది ఏమీలేదని విలాసబాబు తెలుసుకున్నాడు——రాసవిహారి బాబుకూడా అతని గత ప్రవర్తనకు పశ్చాత్తాపం వెల్లడించాడు. నిజంచెప్పితే మీకు ఆశ్చర్యంగా వుంటుందేమో కాని అప్పుడు నా పొరపాటూ చాలా వుంది."

విజయ ముఖంతిప్పి——"మీ పొరపాటు ఎలాంటిది ?" అని అడిగింది.

నరేంద్రుడు చాలా సహజంగానే జవాబిచ్చాడు :——"నన్నలా అనవసరంగా అవమానించినందుకు మీకు చాలా కష్టంవేసిందని మీ మాటలనుబట్టి తెలిసింది ; ఆతర్వాత రాసవిహారి నన్ను క్రింద కలుసుకుని అతని కొడుకు ఆమాటలు ఈర్ష్యతో అన్నాడనీ, వాటికి నొచ్చుకోవద్దనీ చెప్పినప్పుడు నాకు నిజంగా చాలా బాధ కలగటం మొదలుపెట్టింది. అసలు కారణం ఏదోఒకటివున్నదనీ, లేకపోతే ఒకరిమీద ఒకరికి ఈర్ష్య కలగదనీ నాకు తోచింది. మీకు నేను నిజం చెప్పుతున్నాను, ఆతర్వాత పదిరోజులవరకూ నాకు 24 గంటలలో 23 గంటలు మిమ్మల్ని గురించిన ఆలోచనే. జబ్బులో మీరు అన్న ఆమాటలే నాకు తలపుకువచ్చేవి. అందుకనే నేను అది భయంకరమైన అంటురోగమని చెప్పుతున్నది—పనిపాటలు పాడయినై. రాత్రింబగళ్లు మీరే నా బుర్రలో తిరుగుతూ వుండేవారు. చెప్పండి, ఇదంతా అనవసరమంటారా, కాదా ? మరి ఇంతటితోనైనా ఆగిందనుకున్నారా ! రెండుమూడు రోజులు అనవసరంగా ఈ రోడ్డున తిరిగాను, మీరు కనపడతారేమోనని. నిజంగా కొన్నాళ్ళపాటు నన్నేదో భూతం ఆవేసించింది !" అని పకపకనవ్వాడు.

విజయ ముఖమూ తిప్పలేదు, మాట్లాడనూలేదు, మెదలకండా లేచి పక్కగదిలోకి వెళ్లిపోయింది. ఆమె ఇలా పోవటంతో నరేంద్రుని ముఖాన నవ్వుకూడా ఒక్కక్షణంలో మాయమైంది. ఆ చీకట్లో అతను అటువైపే చూస్తూ, తనకు తెలియకుండా మళ్ళీ ఏమి కొత్త తప్పుచేశానా అని ఆలోచించసాగాడు.

ఇంతలో నౌకరువచ్చి—"మీకు టీ తయారవుతున్నది, వుండండి." అని చెప్పినప్పుడు నరేంద్రుడు తడబడుతూ—"నాకు టీ అక్కరలేదే!" అన్నాడు.

"కాని అమ్మగారు మిమ్మల్ని కూచోమన్నారు" అని నౌకరు వెళ్ళిపోయాడు. ఈమాట కూడా అతనికి ఆశ్చర్యం కలిగించింది!

దాదాపు పదిహేను నిమిషాలతర్వాత నౌకరుచేతికి టీ సరంజామా ఇచ్చి, ఫలహారాల పళ్లెం తను తీసుకుని విజయవచ్చింది. ఎంత ప్రయత్నించినా ఆమె ముఖంమీదవున్న ఏడుపు చిహ్నాలు తొలగించుకోలేకపోయిందని ఆ లాంతరు వెలుతురులో ఇతరులు కనిపెట్టకపోవచ్చు గాని, డాక్టరు కళ్ళను ఆమె నమ్మించలేకపోయింది. కాని ఈమాటు అతను తన అభిప్రాయ మేమీ వ్యక్తం చెయ్యలేదు. ఈ కొద్దిరోజుల్లోనే అతను చాలా విషయాలు నేర్చుకున్నాడు. పూర్వం ఒకప్పుడు ఇలాంటి పరిస్థితిలోనే!అతను తెలియక విజయ గడ్డంపట్టుకు ఎత్తాడు. కాని యీనాటి అనుభవం వేరు; మెదలకుండా ఊరుకున్నాడు.

నౌకరు టేబిలుమీద టీ పెట్టి వెళ్ళిపోయాడు. విజయ దానిప్రక్కనే ఫలహారపు పళ్లెం పెట్టి తన ఆసనంలో కూచున్నది. నరేంద్రుడు వీటికోసమే తను కూర్చున్నట్టుగా పళ్లెం తన వేపు లాక్కుని తిన నారంభించాడు.

ఐదారు నిమిషాలు గడిచినతర్వాత విజయే ముందు మాట్లాడింది. ఈ నిస్తబ్ధతను ఆమె భరించలేక బలవంతాన నవ్వుతెచ్చుకుని—"ఏదీ, ఆ భూతంసంగతి పూర్తికానిచ్చారు, కాదు?" అన్నది.

నరేంద్రుడు బహుశా ఇంకేదో ఆలోచిస్తూ వుండవచ్చును "ఏ సంగతీ, మీరు మాట్లాడేదీ?" అని అడిగాడు.

"ఆ భూతం సంగతే, మిమ్మల్ని కొంతకాలం ఆవేసించింది కదూ, ఇప్పుడు దిగిందా?" అని అడిగింది.

ఈమాటు నరేంద్రుడు నవ్వుతూ, తల అడ్డంగాతిప్పి—"ఆఁ, దిగిపోయింది." అన్నాడు.

"పోనివ్వండి, తప్పించుకుపోయారు. లేకపోతే మిమ్మల్ని ఇంకెన్నాళ్ళు సవారీలు తీయించేదో!" అన్నది విజయ.

నరేన్ టీ త్రాగుతూ "ఆ," అన్నాడు.

విజయ మళ్ళీ ఏదో మంచిమాట అనాలనుకున్నది కాని, సమయానికి ఏమీ జ్ఞాపకం రాక, నిట్టూర్పు అణుచుకుని ఊరుకున్నది. అతని నెత్తిమీద ఎక్కిన భూతం వదిలినందువల్ల ఆమెకేమీ తృప్తి కానీ, ఆనందం కానీ కలగలేదు.

మళ్ళీ కొన్నిక్షణాలపాటు గది నిశ్శబ్దంగావుంది. నరేన్ నెమ్మదిగా టీ తీసుకుని కప్పు టేబిలుమీద పెట్టి, జేబులోనించి గడియారం తీసిచూసి—"ఇంకా పదినిమిషాలే వుంది, నేను వెళ్లుతున్నాను." అన్నాడు,

"కలకత్తాకు పోవటానికి ఇదే చివరిట్రైనా?" అని అడిగింది, విజయ మెల్లగా.

నరేన్ లేచి నిలబడి, టోపీ తగిలించుకుని—"ఇంకో ట్రైనువుంది. కాని ఇంకో గంట న్నర తర్వాత. సరే, వెళ్ళుతున్నాను. నమస్కారం." అని కఱ్ఱ చేతపుచ్చుకుని బయటికి వెళ్ళిపోయాడు.

విలాసుడు వేళకు ఆఫీసుకువచ్చి తనపని తనుచూసుకుని ఇంటికి వెళ్ళిపోతున్నాడు; ఎంతో అవసరముంటేమాత్రం నౌకర్లనుపంపి విజయ అభిప్రాయం తెలుసుకునేవాడు—తాను వచ్చే వాడుకాదు. తను పిలిపించంది రాడనికూడా విజయ గ్రహించింది. కాని అతని ఈ ప్రవర్తనలో పశ్చాత్తాపమూ, పరువుపోవటంవల్ల కలిగిన అభిమానమూతప్ప ఇంకేదీ కనిపించక పోవటాన విజయ కోపంకూడా తగ్గిపోయింది.

అదీకాక, విజయకు ఆమె ప్రవర్తనలో ఒకవిధమైన నటన కనిపించి సిగ్గుపడసాగింది; లోకులు తన్ను పరిహాసంచేస్తూ వుండవచ్చని ఆమె అనుకోసాగింది. ముఖ్యంగా జమీందారీ వ్యవహారాల్లో విలాసుడు ఎందరినో నొప్పించివుంటాడు-విరోధులను చేసుకువుంటాడు ? ఇవ్వాళ వాళ్ళ అందరి దృష్టిలో అతను ఎంత చులకనై వుంటాడు ? ఇలా జరిగినందుకు విజయ నిజంగా చాలా నొచ్చుకుంటున్నది ; మళ్ళీ ఏవిధంగానైనా ఒక్కమాటుఆ వెనకటిస్థితి తీసుకురాగలిగితే ఎంతబాగుండును !

విజయ ఈవిధంగా తలపోస్తూ వుండగా నౌకరువచ్చి, "విలాసబాబుగారు చూడా లంటున్నారు," అన్నాడు.

విజయ ఉత్తరం రాసుకుంటూ వున్నది. కాని ఈవిధంగా కబురుచేయటం చాలా కొత్తగాతోచి, "సరే, రమ్మను" అని చెప్పింది. ఆమె మనసును అజ్ఞాతమైన భయంఏదో ఆవేశించసాగింది. ఐనా, విలాసుడు రాగానే లేచినుంచుని నమస్కారంచేసి, శాంతంగా— "కూచోండి," అన్నది.

విలాసుడు కుర్చీలో కూచుని—"పనితొందరలో రాలేకపోయాను. వొంటో కులాసాగా వుందా ?" అని అడిగాడు.

విజయ—"ఆఁ." అన్నది తలతిప్పుతూ.

"ఆ మందేనా తీసుకుంటున్నది ?"

విజయ దీనికి జవాబివ్వలేదు. విలాసుడుగూడా మళ్ళీ ఈసంగతి అడగకండా ప్రసంగం మార్చాడు. "రేపు ఉగాది, ఉదయం నలుగురు పెద్దలనూ పిలిపించి ఉపాసనచేయిస్తే బాగుంటుంది."

అతను ఆ వెనకటి ప్రశ్నవేసి తన్ను బాధించనందుకు విజయ ఎంతో సంతోషించి— "అలాగే చేయండి, బాగావుంటుంది," అన్నది.

"కాని అనేక కారణాలవల్ల మందిరానికి పోవటానికి వీలులేదు—ఇక్కడేచేయిస్తే—"

విజయ వెంటనే వొప్పుకోవటమేకాదు, ఎంతో సంతోషించింది—"అలాగైతే ఇంటికి తోరణాలు అవీకట్టి అలంకరిస్తే బాగావుండదా? మీ ఇంటో చాలాపూలు వున్నవనుకుంటాను— తోటమాలికిచెప్పి, రేపు వుదయం—ఏమంటారు ?" అన్నది.

విలాసుడు ఎక్కువ ఆనందంగానీ, ఉత్సాహంగానీ చూపకుండా—"అలాగే, ఆఏర్పాటు లన్నీ నేను చేయిస్తాను." అన్నాడు.

విజయ ఒక్కక్షణం మౌనంగావుండి—"రేపు ఉగాదిగదా, ఫలహారాలకుకూడా ఏర్పాట్లు చేయిస్తే ఎట్లావుంటుంది ?" అని అడిగింది.

విలాసుడు ఆమెసూచన ఆమోదించి దానికికావలసిన వస్తువులుకూడా గుమాస్తాకుచెప్పి సమకూరుస్తానన్నాడు. ఆ తర్వాత రెండు మూడు మామూలు విషయాలు మాట్లాడి విలాసుడు వెళ్ళిపోగానే విజయకు ఎంతో భారంవదిలినట్లయి ఎంతో సంతోషించింది. ఆవాళ

పోట్లాటవల్ల ఆమెకుకలిగిన బాధ ఎంత గురుతరమైనదో ఇవ్వాళ అది పూర్తిగా తొలిగి పోయినాకగాని ఆమెకు కనిపించలేదు. ఇవ్వాళ ఉన్నంతతేలికగా ఆమె మనసు ఎప్పుడూలేదు! విలాసుడు ఈమధ్య జబ్బుపడ్డవాడిలాగా చాలా తగ్గిపోవటంకూడా ఆమె గమనించి నొచ్చు కున్నది. అవమానమూ పశ్చాత్తాపమూ అతనిలో కలిగించిన మార్పు విజయ స్పష్టంగాచూసి ఆమె తనకు తెలియకుండానే నిట్టూర్చింది. రాసవిహారి ఆవాళచెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకుని మననంచేయసాగింది. విలాసవిహారి ఆమెను చాలా ప్రేమిస్తాడని మాటల్లోనూ, చేతల్లోనూ అన్నిటా వ్యక్తమయింది; కాని విజయ హృదయంలోమాత్రం అతనికి తావు కనపడటంలేదు.

సాంధ్యచీకటిలో ఆమె ఒక్కతే ఇంటోకూచున్నప్పుడు, ఒంటరితనం ఆమెకు దుర్భరంగా తోచినప్పుడు ఆమె ఊహకువచ్చే వ్యక్తి విలాసుడుకాదు, ఇంకొకరు. మధ్యాహ్నం టప్పుడు కాలంజరగక, పుస్తకంమీదికి మనసుపోక, కుట్టుపనిమీద అసహ్యంకలిగి, అంత పెద్ద ఇల్లూ బావురుమంటూవుంటే ఆమె భవిష్యత్తునుగురించి కలలుకనేటప్పుడు విలాసుడు ఎక్కడా కనిపించేవాడుకాదు. ఈమెకు కనిపిస్తున్న వ్యక్తిని సంసారయాత్రలో సహకారిగా తీసుకోటానికి విలాసునికివున్న యోగ్యతలేదు. అతను నిస్సహాయుడేకాదు నిపుణతకూడా లేనివాడు. ఆపదలో ఇతనినించి ఏవిధమైన సహాయమూ లభించదు. అయినప్పటికీ, ఆవ్యక్తి ప్రపంచజ్ఞానం తక్కువకావటంవల్ల కలిగిన దుష్ఫలితాలన్నీ తనే మోసుకుంటూ జీవితయాత్ర గడపవలసి వుంటుందని ఆమెకు తట్టినప్పుడు ఆమె ఆనందోద్వేగంతో కంపించిపోయేది. విలాసుడు వెళ్ళిపోయినతర్వాత ఇవ్వాళ విజయలో ఏమీ మార్పురాలేదు. పైగా, ఒకరు కోరకుండానే విలాసుని తప్పులు పునర్విచారణ చేయటానికి పూనుకుంది. ఘటనలనుబట్టి వరుసగాచూస్తే విలాసుడు ఎంత నీచుడుగా కనిపిస్తాడో, నిజానికి అంత నీచుడుకాడని ఆమె ఒకరి వకాల్తాలేకుండానే తేల్చుకున్నది. విలాసునిలాంటి మానసికస్థితిలోపడ్డ వ్యక్తి మరెవ్వరూ ఇంకోవిధంగా ప్రవర్తించరనికూడా ఉదారతతో తేల్చింది. విలాసుని నేరమేముంది? అతను ప్రేమించాడు; దానికిగాను అవమానింపబడ్డాడు, దండింపబడ్డాడు. ఇది తలచుకునేవరకు ఆమెకు విపరీతమైన జాలికలిగి అతన్ని క్షమించింది.

ఉదయం లేచేవరకు విలాసుడు మనుషులను తీసుకొచ్చి ఇల్లు బాగుచేయటంలో మగ్నుడయ్యాడని తెలుసుకుంది. ఆమె త్వరగా దిగివచ్చి, సిగ్గుపడుతూ-"నాకు కబురు చేయలేదేం!" అని అడిగింది.

"అంత అవసరమేముంది?" అన్నాడు విలాసుడు మృదువుగా.

విజయ మందహాసం చేసి, ప్రసన్న ముఖంతో-"నేనీ పనులకుకూడా పనికిరానంత నిష్ప్రయోజకురాలినా? సరే, ఇప్పుడు నాకేదైనా పనిచెప్పండి?" అని అడిగింది.

ఇంత కాలానికిగాను ఇవ్వాళ విలాసుడు నవ్వాడు:—"మీరు ఊరక కనిపెట్టి వుండండి —మావల్ల ఏమైనా పొరపాట్లు జరిగితే చెప్పండి!"

"సరే!" అని విజయ నవ్వుకుంటూ సోఫాలోపోయి కూచున్నది. ఆతర్వాత కాసేపటికి —"భోజనాల సంగతి?" అని అడిగింది.

విలాసుడు తిరిగిచూచి-"ఆ ఏర్పాట్లన్నీ జరుగుతున్నై—ఏమీ ఆదుర్దా పడనక్కర్లేదు." అన్నాడు.

"సరే, నేనటు పోగూడదూ?"

"భేషుగ్గా," అని విలాసుడు మళ్ళీ పనిలోపడ్డాడు.

ఉదయం పదిగంటల లోపలనే యేర్పాట్లన్నీ అయిపోయినై. ఈమధ్య విజయ చిన్న చిన్న విషయాలలో అనేకసార్లు విలాసుని సలహాలు తీసుకున్నది—ఎక్కడా ఆమెకు పట్టింపుగా లేదు. వీరి ఇద్దరిమధ్యా వున్న వైమనస్యం వారికి తెలియకుండా ఎప్పుడు మాయమైందో తెలియదు; ఇద్దరూ ఏమీ జరగనట్టే సహజంగా మాట్లాడుకున్నారు.

"నేను ఎందుకూ కొరగాని దానినని మీరు వదిలిపెట్టారు. నేనుకూడా మీలో ఒక లోపం కనిపెట్టాను, చెప్పనా?" అన్నది విజయ నవ్వుతూ.

విలాసుడు ఆశ్చర్యంతో—"మీరు కొరగానివారని నే నెప్పుడూ అనలేదు. సరే, ఆ లోపమేదో చెప్పండి?" అని అడిగాడు.

"మనం వున్నది ఐదారుగురమే. కాని తినుబండారాలు మాత్రం ఇరవైమందికి చేశారు. మీకు తెలుసా?"

"ఆఁ: నాన్నగారు ఆయన స్నేహితుల్ని కొందరిని పిలిచారు. ఎవరెవరు వస్తారో ఇంకా తెలియదు."

విజయ చాలా ఆశ్చర్యంతో—"ఏదీ, ఈ సంగతి నాకు చెప్పనేలేదే?" అన్నది.

ఈమాటు విలాసుడుకూడా ఆశ్చర్యపడి—"నేను ఇక్కడినించి వెళ్ళినతర్వాత నాన్నగారు మీకు ఉత్తరం వ్రాయలేదా?" అన్నాడు.

"ఉహుఁ."

"మరి వారు గట్టిగా చెప్పారే—" అని విలాసుడు ఆగాడు.

"ఏమి చెప్పారు?" అని అడిగింది విజయ.

విలాసుడు ఒక్కక్షణం మెదలకుండా ఊరుకుని—"ఐతే వినటం నాదే పొరపాటేమో, లేక వారు ఉత్తరం రాస్తానని చెప్పి మరిచిపోయి వుంటారు." అన్నాడు.

విజయ ఇంకేమీ ప్రశ్నించలేదు. కాని ఆమె మనసులో వ్యాపించిన ప్రసన్నత అనే వెన్నెలకు మేఘాలు కమ్మినట్లయింది.

అరఘంట అయినతర్వాత రాసవిహారి ఒక్కడేవచ్చాడు. ఆయన పిలిచిన స్నేహితులు కూడా తొమ్మిదిలోపల ఒక్కొక్కరే వచ్చేశారు. వీరంతా బ్రహ్మసమాజీకులుకారు. బహుశా రాసవిహారి బలవంతం చేయటంవల్లనే వచ్చివుండవచ్చు.

రాసవిహారి అందరినీ చాలా మర్యాదగా ఆహ్వానించాడు. ఇందులో విజయకు పరిచయంలేనివారిని పరిచయంచేస్తూ, ముందు ఈమెకూ తమకూ కలగబోతున్న సంబంధంకూడా కలిపి చెప్పాడు. విజయ అస్ఫుటంగా వారినందరినీ ఆహ్వానించి కూచోబెట్టింది. ఈమె ఈ మామూలు మర్యాదలూ ఆచారాలూ పాటిస్తూ ఉండగా దయాళుబాబు తోటలో కాలిదోవను వస్తూ కనిపించాడు. కాని ఆయన ఒంటరిగా రావటంలేదు—అతనివెంట అపరిచిత యువతి ఒకామె వుంది. అందమైనది, ప్రాయం విజయకంటే కొంచెం ఎక్కువ వుండవచ్చు. దయాళు ఆమె తన మేనకోడలని చెప్పాడు. పేరు నళిని. కలకత్తాలో బి. యే. చదువుతున్నది. ఇంకా ఎండాకాలం సెలవలు ప్రారంభంకాలేదు—అయినా అత్తయ్య జబ్బుసంగతివిని రెండు మూడు రోజులు ముందుగానే వచ్చింది. ఈ సెలవలు ఇక్కడే గడపటానికి నిర్ణయించుకున్నదట.

నళినిని విజయ కలకత్తాలో బొత్తిగా చూడలేదనటానికి వీలులేదు—కాని పరిచయం లేదు. ఇవ్వాళ ఇంతమంది పరిచిత, అపరిచిత పురుషులమధ్య ఆమే విజయకు చాలా అంతరంగిక స్నేహితురాలుగా తోచింది. విజయ రెండుచేతులూచాచి ఆమెను ఆహ్వానించి, హాల్లోకి తీసుకువచ్చి తనపక్కను కూర్చోపెట్టుకుని స్నేహంచేసుకోసాగింది.

ఉపాసన తొమ్మిదిన్నరకు ప్రారంభం కావలసినమాట—ఇంకా వేళకాకపోవటం మూలాన అందరూ బయటి వరండాలో నిలబడి మాట్లాడుకుంటూ ఉన్నారు. ఇలాంటి సమయంలో రాసవిహారి గొంతు ఖంగున వినిపించింది. ఆయన ఎవరినో—"రా నాయనా! రా. నీకెన్నోపనులు. నువ్వు వస్తావని నేననుకోలేదు!" అంటున్నాడు.

ఇన్ని పనులున్న వ్యక్తి ఎవ్వరా అని విజయ బయటికి తొంగిచూసింది—నరేంద్రుడు. కాని వెంటనే నమ్మలేకపోయింది. నళినికూడా కుతూహలంతో బయటికి తొంగిచూసి—"నరేన్ బాబు!" అన్నది.

రాసవిహారి పిలవటం, ఆయన ఆహ్వానం మన్నించి ఇతను తన ఇంటికి రావటం—విజయ ఊహకు అందకుండా వుంది. విజయ ఇక అటు చూడలేకనేపోయింది. విలాసవిహారి కూడా నరేంద్రుని ఆహ్వానించటం ఆమె స్పష్టంగా విన్నది. ఆతర్వాత వీళ్ళిద్దరినీ వెంటబెట్టుకుని రాసవిహారి ఇంటోకివచ్చాడు. వారితోపాటు ఇంకా చాలామంది లోపలికివచ్చారు. వృద్ధుడు అప్పుడు ఈ యువకులనిద్దరినీ సంబోధించి చెప్పటం మొదలుపెట్టాడు:—"మీ తండ్రుల సంపర్కంవల్ల మీరిద్దరూ సోదరులు—నే నివాళ ఈ సంగతే నీకు ముఖ్యంగా చెప్పాలనుకున్నాను, విలాస్! వనమాలి వెళ్ళాడు; జగదీశుడుకూడా పోయాడు—ఇక నేను పి పుకు ఎదురుచూస్తున్నాను. ఈ భవ ప్రపంచంలో మా దేహాలుతప్ప ఇకనేవీ వేరు కావని నేను చెప్పితే ఈనాటి పిల్లలు మీరు నమ్మలేకపోవచ్చును; నమ్మటమూ సంభవంకాదు, నేను నమ్మించటానికి ప్రయత్నమూ చేయను. మీరుమాత్రం వేరయి, ఈ ముసలితనంలో నాకు కళంకంతెచ్చి బాధపెట్టవద్దని బ్రతిమాలుతున్నాను." ఈ చివరిమాటలు అంటున్నప్పుడు అతని గొంతుకంపించి, దుఃఖంతో పట్టుకుపోయింది. నరేను దీనికి తట్టుకోలేకపోయాడు. విలాసుని రెండుచేతులూ పట్టుకుని చాలా ఉద్వేగంతో—"విలాసబాబూ, నా తప్పులన్నీ క్షమించు. నేను క్షమాపణ కోరుతున్నాను." అన్నాడు.

దీనికి జవాబుగా విలాసుడు చేతులు వదిలించుకుని నరేన్ను కావిలించుకుని "తప్పులు నేనే చేశాను, నరేన్. నన్నే క్షమించు" అన్నాడు.

ముసలి రాసవిహారి మూసినకళ్ళతో, కంపిస్తున్న గొంతుతో—"ఓ సర్వశక్తివంతుడైన పరమపిత పరమేశ్వరా! ఈ దయ, ఈ కరుణ చూపినందుకు నీ శ్రీ పాదపద్మములకు కోటి కోటి నమస్కారాలు." అని రెండుచేతులూ తలకు ఆనించి, ఉత్తరీయం కొంగుతో కళ్ళు తుడుచుకొని—"ఈనాటి శుభముహూర్తాన మీ ఇద్దరి జీవితాలూ ధన్యంకావాలి. మీరందరూ వీరిని ఆశీర్వదించండి." అని వచ్చిన అతిథులవంక చూశాడు.

దయాళుడు మినహా ఇకనెవ్వరికీ ఏమీ తెలియదు. అందుచేతనే వారికి ఈ హృదయాలను కదిలించే సన్నివేశం ఏమీ అర్థంకాలేదు. వారికి ఆశ్చర్యం వేసింది. రాసవిహారి ఇది గమనించి వారివంక మందహాసంచేస్తూ చూసి—"ఏమి చెప్పేది నాబాధ, అతనూ నా కొడుకే, ఇతనూ నా కొడుకే!" అని విలాసునీ, నరేంద్రునీ కంటితో చూపించి—"నాకు కుడిచేతికి ఎంత నొప్పో, ఎడమచేతికీ అంత నొప్పే. కాని మీ అందరి కృపవల్ల నాకు నేడు చాలా శుభదినం! ఎంతో సంతోషకరమైన దినం! ఇంకా ఏమి చెప్పేది!" అన్నాడు.

దీని గూఢార్థం తెలియకపోయినా అందరూ హర్షధ్వానులతో ఆయన మాటలు ఆమోదించారు.

రాసవిహారి మరొకమాటు ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకుని దగ్గరవున్న కుర్చీలో కూచున్నాడు. అతని ముఖం చూస్తేనే భావోద్రేకంలో అతను తల మునకలయ్యాడనీ, అతని నోట ఇప్పుడు మాట పెగులదనీ అనుకున్నాడు. దయాళుబాబు నెరిసిన గడ్డాన్ని సవరించుకుంటూ

లేచినుంచుని బ్రహ్మోపాసనకు ఉపోద్ఘాతంగా ప్రారంభించాడు :—"రెండు విరుద్ధహృదయాలు కలిసినచోట భగవంతుడు వుంటాడంటారు ; ఆ లెఖ్ఖను ఇవ్వాళ ఇక్కడ భగవంతుడు వున్నాడు." అని మొదలుపెట్టి ఉగాదినాడు పదిహేను నిమిషాలపాటు సుందరమైన వుపాసనచేశాడు. ఆయన నిష్కళంకమైన విశ్వాసంతోనూ పరిపూర్ణ భక్తితోనూ చెప్పాడు. చెప్పిన నాలుగు ముక్కలూ. అందుచేత అక్కడవున్న వారి హృదయాలన్నీ ద్రవించి కళ్ళవెంట నీరుకారినై. రాసవిహారి విషయం చెప్పనక్కరలేదు. ఉపాసన అయినప్పటికీ ఆయన అక్కడినించి లేవ లేదు. ఆయనలో చైతన్యం వున్నదో లేదోకూడా తెలుసుకోవటం కష్టమైంది.

ఆతర్వాత ఇంకో వ్యక్తి—విజయ సంగతికూడా ఎవ్వరికీ అర్థంకాలేదు. ఆమె కళ్ళు మూసుకుని రాతివిగ్రహంలాగా తలవంచుకుని కూచునివున్నది. ఆతర్వాత తల ఎత్తినప్పుడు కూడా ముఖం తెల్లబడి రాతిలాగా బిగుసుకుని వున్నది.

దయాళుని ఉపాసనావాక్యాలు ఇంకా అందరి చెవులలోనూ గుంజిస్తూనే వున్నై. ఈ సమయంలోనే రాసవిహారి కళ్ళుతెరిచి, లేచినుంచుని దాదాపు రోదనస్వరంతో చెప్పనారంభించాడు :—"నాకు ఆ సాధనాబలంలేదు. కాని దయాళుబాబు ప్రవచనాలు ఎంత సత్యమో నేను తెలుసుకోగలిగాను. సమ్మిళిత హృదయాల మధ్య ఆ ఏకమాత్ర నిరాకార పరబ్రహ్మ వుంటా డనేది నేను ఇవాళ మనోనేత్రాలతో చూసి ధన్యుణ్ణయాను !" అని ఆయన ముందుకు నడిచి దయాళును కావిలించుకుని—"భాయీ ! దయాళ్ ! ఇది కేవలం నీ పుణ్యంవల్లనే, నీ ఆశీర్వాదంవల్లనే," అన్నాడు.

దయాళుకు కళ్ళవెంట నీళ్ళుతిరిగినై. ఏమీ మాట్లాడలేక నిలబడి ఊరుకున్నాడు.

పక్కగదిలోనే ఫలహారాల ఏర్పాటు జరిగింది. ఈమాటు విలాసుడు అది సూచించగానే రాసవిహారి అతిథులను ఉద్దేశించి—"నేను మీవద్ద ఇంకో ఆశీర్వాద భిక్షకూడా కోరుతున్నాను. వనమాలి బ్రతికివున్నట్లయితే ఇవ్వాళ అతనే తన కుమార్తె వివాహంసంగతి చెప్పేవాడు—నాకీబాధ్యత ఉండేదికాదు. కాని ఇవ్వాళ అధారం నామీదనేవుంది. ఇప్పుడు నేనే వర వధువులకు తండ్రిని. నేను వచ్చే పౌర్ణమినాడే లగ్నం నిర్ణయించాను—ఈ శుభకార్యం నిర్విఘ్నంగా నెరవేరాలని మీరు మనస్ఫూర్తిగా ఆశీర్వదించండి." అని ఒకజోడు గాజులు జేబులోనించితీసి దయాళుకు ఇచ్చాడు.

దయాళుడు అవి రెండూ తీసుకుని విజయవద్దకువెళ్ళి చేతులుచాపి-"నా మనోవాక్కాయ కర్మలా నీకు శుభంచేకూరాలని నేను కోరుతున్నాను తల్లీ ! చేతులుచాపు !" అన్నాడు.

కాని, తలవంచుకుని ప్రతిమలాగా కూచున్న ఆ రమణివైపునించి ఏవిధమైన ఆమోదమూ రాలేదు. దయాళు మళ్ళీ అడిగాడు—కాని అటునించి జవాబులేదు. అలాగేకూచున్నది. నళిని ప్రక్కనే కూచున్నది. ఆమె మామ అవస్థ గ్రహించి విజయ చేతులురెండూ తీసిపట్టుకున్నది. దయాళుడు అతనికి తెలియకండానే ఆశీర్వాదమనే నెపంతో అభిశాపంలాంటి రెండు బంగారు గాజులు మూర్ఛపోవటానికి సిద్ధంగావున్న ఒక బాలిక రెండుచేతులకూ, పటుత్వం వేలాడుతున్నవాటికి తొడిగాడు.

కాని ఎవరికీ పరిస్థితి అర్థంకాలేదు. పైగా ఇది సిగ్గు అనుకుని అందరూ ఎంతో పొంగిపోయారు - మరుక్షణంలో అందరి ఆశీర్వాద ధ్వనులతో అగది ప్రతిధ్వనించింది.

ఫలహారాలు అయిపోయినై. వేళ మిగిలిపోతున్నదని ఒక్కరొక్కరే సెలవుతీసుకు వెళ్ళిపోసాగారు. ఈసమయాన విజయమనస్సులో రేగుతున్న తుపానును అణచుకుని అతిథులను ఎలా సాగనంపగలిగిందో ఆమెకే తెలియదు. ఈమెలో రేగుతున్న తుపానును

ఆ అంతర్యామి [మినహా ఇంకెవరైనా] గ్రహించినవారున్నారంటే రాసవిహారి ఒక్కడు మాత్రమే. అతను ఈసంగతియేమీ గ్రహించనట్టే నవ్వుతూ—"అమ్మా, నేను వెళ్ళుతున్నాను. ముసలివాణ్ణి—ఎండఎక్కితే అసలు నడవలేను." అని ఆశీర్వదించి గొడుగువేసుకుని మెల్లగా వెళ్ళిపోయాడు.

అంతా వెళ్ళిపోయారు. విజయా నళినీమాత్రం వరండాలో ఒక ప్రక్కనుంచుని మాట్లాడుతున్నారు. "మీతో పరిచయం అయినందువల్ల నాకెంత సంతోషంగావుందో మీకు చెప్పలేకుండా వున్నాను. ఇక్కడికి వచ్చినప్పటినించీ నేను దాదాపు ఒంటరిగానే ఉన్నాను—రెండుమాటలు మాట్లాడాలన్నా ఎవ్వరూలేరు—మీకు తీరికదొరికినప్పుడు రాదలచుకున్నప్పుడు తప్పక ఇటువస్తూ వుండండి." అన్నది విజయ.

నళిని సంతోషంతో తనసమ్మతి తెలిపింది.

"నేనుకూడా సాయంత్రం మీ అత్తయ్యను చూడటానికి ఇంటికివస్తాను కాని—" అని, ఎండవంకచూసి కొంచెం పస్తాయించి—"దయాళబాబు కచేరీలోకి వెళ్ళాడనుకుంటాను. పిలిపించేదా?" అని నౌకరుకోసం వెతుకుతూవుండగా, నళిని అడ్డువచ్చి—"ఇప్పుడువాగు ఇంటికి రారు, ఒక్కమాటే సాయంత్రం వస్తారట." అన్నది.

విజయ సిగ్గుపడి—"ఈసంగతి నాకు ముందెందుకు చెప్పలేదు? నేను దర్వాన్ను పిలుస్తాను. వాడు—" అన్నది.

"ఊహుఁ. దర్వాన్ అక్కరలేదు. నేను నరేన్‌బాబుకోసం ఎదురుచూస్తున్నాను. వారు ఆయన మామగారిని చూడటానికి పోయారు, ఇప్పుడేవస్తారు." అన్నది.

విజయ చాలా ఆశ్చర్యపడి—"మీతో వారికి పరిచయముందా? ఏదీ, నాకీసంగతే తెలియదే!" అన్నది.

"పరిచయమంతలేదు. నేను మొన్న మా మామ ఉత్తరంరాస్తే ఇక్కడికి వచ్చాను—వీరు స్టేషనులో కనిపించారు. వారివెంటే వచ్చాను." అన్నది నళిని.

"ఓ, అంతేనా?" అన్నది విజయ.

"కాని, వారు ఎంత చిత్రమైనవారనుకున్నావు? రెండురోజులకే ఎంతోకాలంనించి పరిచయం వున్నవాడిలాగా కనిపిస్తున్నాడు. ఈపూట మాయింటోనే భోజనం అదీచేసి సాయంత్రం బండికి కలకత్తా వెళ్లుతారట. మా అత్తయ్య అతన్ని సొంతపిల్లవాడిలాగా చూసుకుంటుంది." అన్నది నళిని.

విజయ తలతిప్పి—"ఆఁ, చిత్రమైనవాడే!" అన్నది.

"ఆయనకి ఎవరితోనైనా శత్రుత్వముంటుందనేది నేను కంటితోచూస్తేగాని నమ్మలేను. ఇవ్వాళ విలాసబాబుతో వారికి స్నేహంకలిసినందుకు నాకు చాలా సంతోషంగావుంది. విలాసబాబు నాయన ఎంతమంచివాడు. మన సమాజంలో అందరూ అలా వుండటానికి ప్రయత్నించాలని నా ఉద్దేశం. వారిని ఆదర్శంగా పెట్టుకున్ననాడు బ్రహ్మసమాజం పవిత్రమౌతుందని నా నమ్మకం! ఏమంటారు? నిజంకాదూ?" అన్నది నళిని.

నరేంద్రుడు టోపీ చేతపుచ్చుకుని వస్తూ కనిపించాడు. విజయ నళిని ప్రశ్నను మరిపించి, అటుచూపుతూ—"అదుగో వారువస్తున్నారు." అన్నది.

నరేంద్రుడు దగ్గరికివచ్చి విజయ నుద్దేశించి—"అదుగో, అప్పుడే ఇద్దరికీ మంచి స్నేహమయిందే! నిజంగా, ఈ ఉగాది నాకు చాలా శుభదినం! ఉదయం బాగా గడిచిపోయింది! చూస్తే ఈ సంవత్సరమంతా బాగానే గడిచేటట్టుగావుంది. కాని, మీరలా వాడిపోయి వున్నారేం? చెప్పండి" అని అడిగాడు.

విజయ కొంచెం విసుగుగా—"ఒక్కరోజునే ఈప్రశ్న ఎన్నిసార్లు వేస్తారో చెప్పండి?" అన్నది.

నరేంద్రుడు నవ్వుతూ—"ఇదివరకు ఒకసారి అడిగాను, కదూ? అయితేమాత్రమేం? సరే మీకు ఊరకనే అంత కోపమెందుకు వస్తుందో చెప్పండి? అదే మీలోవున్న దుర్గుణం." అని మళ్ళీ నవ్వసాగాడు.

విజయ బలవంతాన నవ్వు నాపుకుని, ఛద్మ గాంభీర్యంతో—ఈవిషయంలో అంతా మీమాదిరి నిర్దోషులు వుంటారంటారా?" ఐనా మీలాంటి సాధువ్యక్తులుకూడా ముక్కోపులని చెప్పటానికి కాశీపదుడిలాంటివారు కొందరు వుంటారు." అన్నది.

కాశీపదుడిపేరు వినేవరకు నరేంద్రుడు పకపక నవ్వాడు. నవ్వు ఆగినతర్వాత—"మీది మహా పట్టుదల–ఇతర్ల తప్పులను ఏమాత్రమూ క్షమించలేరు. కాని, కాశీపదునిలాంటి వాళ్ళన్నారే, ఆ 'లాంటివాళ్లు' ఎవ్వరూ? కాశీపదుడూ, మీరేనా?" అని అడిగాడు.

"ఇంకా ఆ స్టేషనులో చూసినవాళ్ళంతా?" అన్నది విజయ.

"ఇంకా?"

"అది విన్నవాళ్ళంతా కూడా."

"అలాగైతే, నన్నుగురించి ప్రపంచానికింతా ఇదే అభిప్రాయమని చెప్పండి."

విజయ వెనకటి గాంభీర్యం తగ్గనివ్వకుండా—"ఆఁ, మా అందరి అభిప్రాయమూ అదే." అన్నది.

"అయితే, ధన్యవాదాలు. ఈమాటు మిమ్మల్ని గురించి లోకుల అభిప్రాయమేమిటో చెప్పండి?" అని నవ్వసాగాడు.

అతని ఉద్దేశం గ్రహించి విజయముఖం సిగ్గుతో ఎర్రపడింది. కాని వెంటనే నవ్వేసి అన్నది–"ఎవరి కీర్తి వారు చెప్పుకోకూడదు–తప్పు. కాబట్టి నా సంగతి మీరే చెప్పండి. కాని, ఇప్పుడు కాదు, స్నాన, భోజనాలయినాక." అని కొంచెం ఆగి"—ఇప్పుడు చాలా వేళ మిగిలింది–ఆపని ఇక్కడే పూర్తి చేయకూడదూ?" అని నళిని ముఖంవంక చూసింది.

"మా అత్తయ్య ఎదురుచూస్తూ వుంటుందే?" అన్నది నళిని.

"నే నిప్పుడే మనిషిద్వారా కబురు పంపుతాను."

నళిని కొంచెం మధనపడి–"మా అత్తయ్య రోగిష్టి. సాయంత్రందాకా ఎవరూ వెంట లేకపోతే బాగుండదు," అన్నది.

ఇది యధార్థమే, కాబట్టి విజయ ఇక వత్తిడి చేయలేదు. కాని ఆమె ముఖంవంక చూసి నళిని ఏమో ఆలోచించి–"కాని, మీరిక్కడే భోంచెయ్యండి, నరేన్ బాబుగారూ! నేను వెళ్ళి అత్తయ్యకు చెప్పుతాను. మీరు సాయంత్రం వెళ్ళేటప్పుడు ఒకమాటువచ్చి అత్తయ్యను చూసి పొండి." అన్నది.

"మిమ్మల్ని ఒక్కర్నీ ఈ ఎండలో పోనివ్వటానికి నేనంత కృతఘ్నుణ్ణీ, నరపశువునీ అనుకున్నారా?" అని నవ్వుతూ విజయ వంకచూసి–"మీవద్ద నేను ఒకరోజున మంచి భోజనం తినవలసి వుండనే వుంది–ఆనాడు నేను ఉదయమే వచ్చి బాకీ అణాపైసాలతోపాటు తీర్చుకుంటాను. సరే, నమస్కారం!" అని నళినితో–"ఇంకెందుకూ ఆలస్యం, పదండి" అని టోపీ తలకు పెట్టుకున్నాడు.

నళిని దిగి దగ్గరకువచ్చింది. ఆ రెండోవ్యక్తి కట్టెలాగా అలానే నిలబడిపోయింది; ఆమె కళ్ళు రెండు సానపెట్టిన కత్తిలాగా తళతళ మెరుస్తున్నై. ఈ సంగతి ఎవ్వరూ గమ

వించలేదు. గమనిస్తే నరేంద్రుడు పోయేవాడల్లా వెనక్కు తిరిగి ఈమాట అనటానికి సాహసించి వుండేవాడు కాదు :—"సరే, ఒక్కపని చెయ్యకూడదూ ? ఇన్ని అనర్థాలకూ, మనోమాలిన్యానికీ కారణమైన వస్తువు, దేనిమూలాన దేశమంతటా నేను చెడ్డవాడినయ్యానో దాన్ని, ఈ ఆనంద సమయంలో నాకే బహుమానంగా ఇచ్చివేయకూడదూ ? ఆ రెండువందల రూపాయలూ రేపుగానీ ఎల్లుండిగానీ పంపిస్తాను." అని ఇంకోమాటు నవ్వబోయాడు ; కాని, ఈ మాటు ఉత్సాహం తగ్గటంవల్ల నవ్వురాలేదు. కాని రెండో వైపునించిమాత్రం అనుకోనంత కటువుగా జవాబు వచ్చింది.

"డబ్బు తీసుకుఇవ్వటాన్ని నేను బహుమానమనను ; అమ్మటం అంటాను. ఇలాంటి బహుమానాలిచ్చి మీరు సంతోషిస్తారేమో గాని, మావల్ల కాదు. మా శిక్షణ వేరు. అందుకనే ఈ ఆనంద సమయంలో నేను దాన్ని విక్రయించ దలచుకోలేదు." అన్నది విజయ.

ఈ ఎత్తిపొడుపుకు నరేంద్రుడు స్తంభించిపోయాడు. అసలే విజయస్వభావం ఇంతవరకూ అతనికి అంతు పట్టకుండావుంది. ఇప్పుడిలా అకారణంగా ఆమెకు కోపంరావటం చూసి నరేంద్రుడికి అసలు అర్థంకాలేదు. అతను ఒక క్షణకాలం బిగుసుకునివున్న విజయ ముఖం వంక చూసి, చాలా నొచ్చుకున్నట్టు—"నేను నా దీనస్థితిని మరిచిపోలేదు ; మరిచిపోవాలని ప్రయత్నించనూలేదు–మీరు జ్ఞాపకం చేయటానికి" అని, నళినిని చూపి–"నేను వీరికికూడా నా సంగతి అంతా చెప్పాను. నాన్నగారు చాలా ఇబ్బందులూ బాధలూపడి చనిపోయారు. వారు చనిపోయిన తర్వాత ఇల్లూ వాకిలీ, వున్నదంతా అప్పులకింద పోయింది, అనే నేను అందరికీ చెప్పాను. నేను బహుమాన మిచ్చానని ఎవ్వరికీ చెప్పలేదు. ఏమండీ మీకు నేను చెప్పలేదా ?" అని అడిగాడు.

నళిని సిగ్గుతో–"అవును." అన్నది.

విజయముఖం సిగ్గుతో, వేదనతో, దుఃఖంతో మలినమైపోయింది. ఆమె పిచ్చిదానిలాగా వారిద్దరివంకా చూస్తూ ఉండిపోయింది.

నరేంద్రుడు ఆమె బాధను మరింత చిలుకుతూ, విచారంగా–"నా మాటలకు మీరెప్పుడూ కోపగించుకుంటూ వుంటారు. బహుశా, నేను నా హద్దుదాటి మీతో సమకక్షినని చాటటానికి ప్రయత్నిస్తున్నానేమోనని మీరనుకుని వుండవచ్చు. కాని నా కా ఉద్దేశంలేదు–నేను అన్ని మాటలూ, తూచి మాట్లాడలేను–అది నేను పరధ్యాన్నంగా వుండటంవల్ల వచ్చిన లోపం ;— సరే, నేను మిమ్మల్ని ఏమైనా నొప్పించిగానీ అవమానంగానీ చేసివుంటే క్షమించండి." అని ముఖంతిప్పుకుని వెళ్ళిపోయాడు.

## - 22 -

దోవపొడుగునా వారిద్దరూ రెండుమాటలే మాట్లాడారు. "ఏమిటి మీరడిగిన బహుమానం?" అని అడిగింది నళిని.

"ఇంకోరోజున చెప్తానుమీకు, ఇవ్వాళకాదు." అన్నాడు నరేన్ విచారం ఉట్టిపడుతూ.

వెదురువంతెన దగ్గరికివచ్చినాక నరేంద్రుడు టక్కున ఆగి–"ఇవ్వాళ నన్ను క్షమించండి, నేను తిరిగివెళ్ళుతున్నాను." అని నళిని చాలా ఆశ్చర్యపడటంచూసి—"నేనెంత అన్యాయం చేస్తున్నానో నాకుతెలుసు—ఐనా మీరు క్షమించాలి. నేనేవిధంగా ఇప్పుడురాలేను. మీ అత్తయ్యకు చెప్పండి, నేనింకో రోజునవచ్చి—"అన్నాడు.

అసలతని వుద్దేశం హఠాత్తుగా మారటంచూసే నళినికి ఆశ్చర్యంకలిగింది, పైగా అతనిగొంతూ, ముఖమూ చూసేవరకు ఇంకా ఆశ్చర్యంవేసింది. బహుశా అందుకనే ఆమె

ఇక ఏమీ వత్తిడిచేయలేదు. "కాని, మీరింకా భోజనంచేయలేదుగా ! మళ్ళీ ఎప్పుడువస్తారు?" అనిమాత్రం అడిగింది.

"ఎల్లుండి వస్తాను." అని నరేంద్రుడు వచ్చినదోవనే రైలుస్టేషనువైపుకు నడిచాడు. మైదానం దాటుతూవుండగా ఒక కుర్రవాడు చేయిఎత్తి తన్ను పిలుస్తూవున్నట్టుగా భావించి అతను ఆగిపోయాడు. కొంచెంచేపటికి పరేశుడువచ్చి రొప్పుతూ—"అమ్మగారు మిమ్మల్ని పిలుస్తూవున్నారు, రండి ! అన్నాడు.

"నన్నా ?"

"ఆఁ. రండీ :"

నరేంద్రుడు కాసేపు అలాగే నిలబడి, సందిగ్ధస్వరంతో—"నీకు సరిగాతెలియదు, నన్నుకాదు." అన్నాడు.

పరేశుడు తల అడ్డంగాతిప్పుతూ—"ఊఁ, మిమ్మల్నే. మీ నెత్తినేగా దొరటోపీవుంది—రండీ." అన్నాడు.

నరేంద్రుడు మళ్ళీ కాసేపు మెదలకుండా ఊరుకుని—"మీ అమ్మగారు నీకేంచెప్పారు ?" అని అడిగాడు.

"అమ్మగారు పైమిద్దెమీదినించి పరిగెత్తుకుంటూవచ్చి, 'పరేశ్, పరుగెత్తుకుపోయి ఆ పోయే బాబుగారిని తీసుకురా——నెత్తిమీద దొరటోపీవుందే ఆయన్ని. పో, పరిగెత్తు—నీకు బొంగరం కొనిపెడతారు' అన్నది—ఇకరండీ !"

ఇప్పుడు అర్థమైంది నరేంద్రునికి వాడి ఆదుర్దా ఎందుకో—వాడు బొంగరంకోసం ఈ మండుటెండలో రైలు ఎంజిన్‌లాగా పరుగెత్తుకుంటూ వచ్చాడు. కాబట్టి ఇప్పుడు వాడు ఎలానూ వదలడు. వాడికి బొంగరం కొనుక్కోటానికి తనే డబ్బులుఇచ్చి పంపాలని ఒకమాటు నరేంద్రుడు అనుకున్నాడుకాని ఇవ్వాళే తన్ను పిలిపించటం ఎందుకో తెలుసుకోవాలనే కుతూహలం ఒకవైపున బాధింపసాగింది. వెళ్తామా వద్దా అని ఎంతసేపు ఆలోచించినా అతను ఒకనిర్ణయానికి రాలేకపోయాడు. అయినా అతనికాళ్ళు వానివెంటనే నడిచినై. అతను దోవపొడుగునా పిలిపించటానికి కారణమేమిటా ? అని ఆలోచిస్తూనే వున్నాడు. కాని పిలిపించటమే పెద్ద కారణమని అతనికి తోచలేదు. వరండాలోకి వెళ్లేవరకు విజయవచ్చి ఎదురు నిలుచుంది. తడిగా ఉత్సుకతతోఉన్న రెండుకళ్ళూ అతనిమీదనిలిపి తీక్ష్ణస్వరంతో—"ఈవేళ టప్పుడు భోంచెయ్యకుండానే పోతున్నారే, మహా ? నేను చాలా కోపిష్టిదాన్ని, చాలా చెడ్డదాన్ని——మరి మీరో ?" అన్నది.

నరేంద్రుడు చాలా ఆశ్చర్యంతో-"అంటే? ఎవరన్నారు మీరు చెడ్డవారని? ఎవరన్నారూ ఆమాటలన్నీ మిమ్మల్ని ?" అని అడిగాడు.

విజయ పెదవులు వొణకసాగినై :—"మీరే అన్నారు. ఎందుకు మీరు నళినిముందు నన్నలా అవమానించింది ? ఆ అవమానించింది చాలక, పైగా నాకు శాస్తి చేయటానికి భోం చెయ్యకుండా కూడా పోతున్నారా ? మీకు నేనేం చేశాను చెరుపు ?" అని అంటూ వుండగానే ఆమె కళ్ళు రెండూ నీళ్ళతో నిండినై. బహుశా అవి ఆపుకోటంకోసం అనుకుంటాను ఆమె ముఖం తిప్పుకుని కిటికీ వైపుకుచూస్తూ నుంచుంది. నరేంద్రుడు దిగ్భ్రమచెంది మాటా పలుకూ లేకుండా నిలబడ్డాడు. ఈ ఆరోపణలకు సమాధానంమాట అలా వుంచి, దీనికి కారణంకూడా అతనికేమీ తోచలేదు.

"స్నానానికి నీళ్లు తోడాను" అని వొకరువచ్చి చెప్పిపోయారు. విజయ తిరిగివచ్చి చాలా శాంతంగా—"ఇక ఆలస్యం చెయ్యకండి, వెళ్ళండి." అన్నది.

స్నానంచేసి నరేంద్రుడు భోజనానికి కూర్చున్నాడు. విజయ విసనకఱ్ఱ చేతపుచ్చుకుని అతని దాపుకువచ్చి కూర్చోగానే సిగ్గుతో ఆమెశరీరం ఒక్కమాటు జలదరించింది. నరేంద్రుడు ఆమె విసరబోవటం చూసి సంకుచితుడై—"నాకు గాలి అక్కర్లేదు. మీరు వీవన అవతల పెట్టండి." అన్నాడు.

విజయ మందహాసంచేస్తూ—"మీకు అక్కర లేకపోయినా, నాకు అక్కరవుంది. ఆడ వాళ్ళు వుత్తచేతులతో కూచోకూడదని మానాన్న అంటూ వుండేవారు." అన్నది.

"మరి మీ భోజనంకూడా కాలేదుగా?"

"మగవారు భోంచేయంది మేము తినము." అన్నది విజయ.

నరేంద్రుడు సంతోషంతో—"అయితే మీరు బ్రహ్మసమాజం వారయినప్పటికీ మా ఆచారాలే పాటిస్తారన్నమాట." అన్నాడు.

"చాలామంది బ్రాహ్మల ఇళ్ళలో ఈ ఆచారం లేదు; మా నాన్నగారు మాత్రమే ఈ ఆచారం నిలిపారు" అని విజయ చెప్పాలనుకున్నది కాని చెప్పలేదు:—"మేము యూరపు నించీ రాలేదు. కాబూలునించీ మా ఆచారాలు దించలేదు. ఇందులో ఆశ్చర్యమేమున్నది? ఇలా లేకపోతేనే ఆశ్చర్యపడాలి." అన్నది.

నౌకరు వాకిటిదగ్గరకు వచ్చి—"అమ్మగారూ! అయ్యవారు కాతా పుస్తకాలతో వచ్చారు మీ కోసం. రేపు రమ్మనమని చెప్పమంటారా?" అని అడిగాడు.

విజయ తలతిప్పుతూ—"ఆఁ. ఇవ్వాళ నాకు తీరదు. రేపు రమ్మనమని చెప్పు." అన్నది.

నౌకరు వెళ్ళిపోయిన తర్వాత నరేంద్రుడు విజయవంక చూస్తూ—"నాకు ఇదే అన్నిటికంటే చాలా ఆనందమిస్తుంది." అన్నాడు.

"ఏదీ?"

"నౌకర్లనోట ఆ పిలుపు." అని నవ్వి—"మీరు బ్రాహ్మలు. చదువు సంస్కారం వున్నవారు. మంచి భాగ్యవంతులు నేను ఇలాంటి ఇళ్ళకు చాలా వాటికి ఈమధ్య చికిత్సకు పోతున్నాను. వారి ఇళ్ళలో నౌకర్లు ఇంటి ఆవిడను 'మేం సాహెబ్' అని పిలుస్తూవుంటారు. అసలు దొరసానులు. వీరిని ఎలా చూస్తారో తెలియబట్టే జీతం ఇచ్చిన నౌకర్లచేత 'మేం సాహెబ్' అని పిలిపించుకుని తృప్తిపడుతూ వుంటారనుకుంటాను!" అని పకపక ఇల్లు అదిరిపోయేటట్టు నవ్వాడు.

విజయకూడా నవ్వింది. నరేంద్రుడు నవ్వు ఆగిన తర్వాత మళ్ళీ అన్నాడు:—"ఇంటి నౌకర్లనోట 'అమ్మగారూ' అనే పిలుపుకంటే 'మేం సాహెబ్' అని పిలిపించుకోటం గౌరవమైన సంగతి! మొదట నౌకరు ఎవర్ని పిలుస్తున్నాడో నాకర్థం కాలేదు. వాడిని అడిగితే వాడు—"ఏమి చెప్పేది బాబూ, నేను చాలామంది దొరల ఇళ్ళలో పనిచేశాను—మేం సాహెబని ఎవర్ని పిలిచేదికూడా నాకు తెలుసు. కాని ఏం చేయను, పొట్టకోసం పిలవక తప్పదు బాబుగారూ? మొన్న ఈమధ్య హిందుస్తానీ నౌకరు 'అమ్మగారూ' అని పిలిచినందుకు రూపాయి జరిమానా వేసింది. రూపాయిపోతే పోయింది. ఉద్యోగం నిలిచింది దానికి సంతోషించాలి!" అన్నాడు. సరే, మీరుకూడా ఇలాంటి వారిని చాలామందిని చూసి వుంటారనుకుంటాను. లేదా?" అన్నాడు.

విజయ నవ్వి తల ఆడించింది.

"మనం ముందు ముందుచూడాలి. ఈ 'మేం సాహెబ్' పిల్లలు తల్లిని అమ్మా అని పిలుస్తారో, 'మేం సాహెబ్' అని పిలుస్తారో!" అని నరేంద్రుడు మళ్ళీ పకపకనవ్వాడు.

విజయ నవ్వుముఖంతో—"మీరు భోంచేసినాక సాయంత్రంవరకూ పరనిందచేసి ఆనందించండి. నాకేమీ అభ్యంతరంలేదు. కాని నేనుకూడా భోంచెయ్యాలిగదా?" అన్నది.

నరేంద్రుడు సిగ్గుపడి, గటగట రెండుముద్దలు నోటపెట్టుకుని, తర్వాత మళ్ళీ మరిచిపోయి అన్నాడు:—"నేనుకూడా నాలుగైదేళ్ళు ఇంగ్లండులో వున్నాను. కాని, ఈ నాటుదొరలమాదిరి—"

విజయ తర్జనిచూపుతూ - "మళ్ళీ పరనిందా ?" అని కృత్రిమంగా శాసించింది.

"సరే, ఇక మాట్లాడను !" అని నరేంద్రుడు కాసేపు భోంచేసి "ఇక నేను తినలేనే-" అన్నాడు.

విజయ తడబడపడి - "బాగుంది. మీరు ఏమితిన్నారు ? ఉహుం, మీరు లేవటానికి వీల్లేదు. సరే, అలాగయితే పరనిందచేస్తూనే అన్యమనస్కంగా తినండి, నేనేమీ అనను." అన్నది.

నరేంద్రుడు నవ్వబోయి హఠాత్తుగా గాంభీరుడై "మీరు దీనికే తినలేదు అంటున్నారు— నేను రోజూ కలకత్తాలో తినేదిచూస్తే ఇక మీరేమంటారో ! చూశారుగా, ఈ నాలుగైదు మాసాలకే నేనెంత తగ్గిపోయానో. నాకు వంటచేసేవాడు దొంగముండాకొడుకు—పొద్దున్నే ఎనిమిదిగంటలకు వండి అవతలపారవేసిపోతాడు. మళ్ళీ పత్తాదొరకడు. నేను మధ్యాహ్నం రెండుగంటలకు, ఒకోరోజు నాలుగుగంటలకు వచ్చేవరకు అంతా చల్లబడిపోయివుంటుంది. ఒకోరోజున పిల్లులుతాగిపోతై పాలు - కాకులు కిటికీలలోంచివచ్చి అన్నం కెలికిపోతై - అవిచూస్తే తిన బుద్ధిపుట్టదు—ఒకోరోజున తిననుకూడా తినను." అన్నాడు.

కోపంతో విజయముఖం ఎర్రబడింది. "ఇలాంటి నౌకర్లను ఇంకఎందుకు ఉంచుకున్నారు వెళ్ళగొట్టక ? సొంతఇంటో ఇంత ఖర్చుపెట్టినాకూడా తిండి అమరకపోతే ఇంకా ఈ సంపాదన ఎందుకూ ?" అన్నది.

"ఒకలెఖ్ఖను మీమాట నిజమే. ఒకమాటు నాపెట్టెలోవి రెండువందల రూపాయలు పోయినై. ఒకరోజున నేను జేబులో రెండువందల రూపాయలకాగితాలు పారేసుకున్నాను. పరధ్యానంగా వుండేవారికి ఎన్నో ఇబ్బందులు వస్తుంటై !" అని కొంచెం ఆగి అన్నాడు:— "అయితే, ఇలాంటికష్టాలు నాకు ఎంతోకాలంనించి అలవాటు కాబట్టి నన్నంత బాధపెట్టవు. కాని, మరీ ఆకలి అయినప్పుడుమాత్రం భోజనానికిపోతే ఒకోరోజున చాలాకష్టంగా వుండేది."

విజయ తలవంచుకుని మాట్లాడకండా ఊరుకున్నది. నరేంద్రుడు చెప్పుకుపోయాడు:- "నిజంగా, నౌకరీమీద నాకంత ఇష్టమూలేదు, నేను చేయనూలేను. నాకు అవసరాలుకూడా కొద్ది—మీలాంటి భాగ్యవంతులు నాకు రెండువేళలా భోజనంపెడితేచాలు, నేను నాపని చూసుకుంటూ ఉండిపోగలను. నాకిక వేరే ఏమీ అక్కరలేదు. కాని, ఇప్పుడల్లాంటివారు ఎక్కడున్నారు ?" అని మళ్ళీ ఇంకోమారు బిగ్గరగా నవ్వాడు. విజయ వెనకటిమాదిరిగానే మెదలకుండా కూర్చున్నది. నరేంద్రుడు మళ్ళీ అన్నాడు:—"కాని, మీ నాన్నగారు బ్రతికి వున్నట్టయితే నాకేమైనా సహాయంచేసి వుండేవారు—కనీసం నాకీ ముష్టిఎత్తుకునే పని తప్పించేవారు."

విజయ ఉత్సుకతతో—"మీకెలాతెలుసు ? వారిని మీరు ఎరగనే ఎరగరుగా ?" అని అడిగింది.

"నిజమే, నేను వారినిచూడలేదు; బహుశా వారూ నన్నుచూసివుండరు. ఐనా, వారికి నేనంటే చాలాఇష్టం. నన్ను ఇంగ్లండుకు పంపించింది ఎవరో తెలుసునా ? వారే. సరేగాని, వారు మా అప్పువిషయమై మీకేమీ చెప్పిపోలేదా ?"

"చెప్పే వుండవచ్చు. కాని, మీఉద్దేశం ఏమిటో స్పష్టంగాతెలియందే నేనుచెప్పలేను."

నరేన్ కాసేపు లోలోపల మధనపడి—"సరే, పోనివ్వండి;ఇప్పుడు ఆ ప్రసంగంతేవటం అనవసరం" అన్నాడు.

"కాదు, చెప్పండి, నేనువినాలి" అన్నది విజయ వేగిరపడుతూ.

నరేంద్రుడు ఇంకొంచెంసేపు ఆలోచించి—"పోనివ్వండి ఇప్పుడు గతించినదాన్ని తవ్వి తీసిమాత్రం ఏంలాభం ?" అన్నాడు.

"ఉహుఁ. అదికుదరదు. మీరు చెప్పవలసిందే." అని పట్టుపట్టింది విజయ.

ఆమె పట్టుదల చూసేవరకు నరేంద్రునికి నవ్వువచ్చింది. "చెప్పటం అనవసరమేకాదు- చెప్పాలంటే నాకు సిగ్గేస్తున్నది. బహుశా మీరు, నేను యుక్తిగా మీ సెంటిమెంటును టచ్ చేస్తున్నా ననుకోవచ్చు—"

విజయ ఓరిమివహించలేక మధ్యనే అడ్డుతూ—"నేనిక మిమ్మల్ని ఖుషామద్ చెయ్యలేను—కాళ్ళుపట్టుకుంటాను, చెప్పండి" అన్నది.

"భోంచేసినతర్వాత."

"కాదు, ఇప్పుడే—"

"సరే, చెప్తాను. చెప్తాను. కాని, ముందు ఒక్కవిషయం అడుగుతాను చెప్పండి. మా ఇంటివిషయమై వారు మీకేమీ చెప్పిపోలేదా ?"

విజయ ఈ ప్రశ్నలకు విసుక్కున్నది. కాని జవాబేమీ చెప్పలేదు. నరేంద్రుడు మందహాసంచేసి—సరే, కోపంతెచ్చుకోమాకండి. నేనుచెప్పతున్నాను. నేను యూరపు వెళ్ళేటప్పుడు మానాన్న నన్ను మీనాన్నగారే పంపుతున్నారని చెప్పాడు. ఇవ్వాళకి మూడు రోజులక్రిందట దయాళుబాబు నాకు ఒక ఉత్తరాలకట్ట యిచ్చాడు. మూల పాతసామానుల్లో అది పడిఉన్నదట—నాన్నగారివని ఆయన నాకిచ్చాడు. చదివిచూస్తే అందులో రెండుమూడు మీనాన్నగారు రాసినవిఉన్నవి. మీరు వినేఉండవచ్చు, చివరిరోజుల్లో మానాన్న అప్పులబాధ ఎక్కువై జూదం ఆడటం మొదలుపెట్టాడు. బహుశా ఈవిషయమయ్యే కామాలు ఉత్తరం మొదటిభాగంలో ఉపదేశధోరణిలో ఓదార్పుకురాసిన వాక్యాలు కొన్నివున్నవి. అందులో 'ఇంటికోసం చింతపడవద్దనీ నరేంద్రుడు తనకుకూడా అబ్బాయేననీ, ఆ యిల్లు వాడికి కట్నంగా ఇస్తున్నా'ననీ రాశాడు."

"ఆ తర్వాత" అన్నది విజయ తలఎత్తి.

"ఆ తర్వాత ఏవేవో సంగతులు. అయితే అది రాసి చాలాకాలమైంది. బహుశా, ఆ తర్వాత వారి అభిప్రాయం మారి మీకేమీ చెప్పి వుండకపోవచ్చు."

తండ్రి చెప్పిన తుదివాక్యాలు ప్రతి అక్షరమూ విజయకు జ్ఞాపకంవచ్చి నిట్టూర్చింది. ఆ తర్వాత చాలాసేపు అలానే కూర్చుని—"అయితే ఆ యింటికోసం దావా వేస్తారన్నమాట !" అని నవ్వింది.

నరేన్‌కూడా నవ్వాడు. ఈ ప్రస్తావన హాస్యాస్పదమైనదని గ్రహించి—"దావా తప్పక వేస్తాను. పైగా సాక్షిగా మిమ్మల్నే వేస్తాను. మీరు అబద్ధం చెప్పరని నా నమ్మకం" అన్నాడు.

"తప్పకుండా, కాని నన్నెందుకు సాక్ష్యం వేసుకుంటారు ?"

"లేకపోతే ఎలా రుజువవుతుంది ? ఆ ఇల్లు నాదేనని కోర్టులో రుజువుకావాలి కదా ?"

విజయ గంభీరంగా—"నాకు ఇంకో కోర్టుతో అవసరంలేదు. నాన్నగారి మాటే నాకు కోర్టు. అయిల్లు మీకు ఇచ్చేస్తాను."

ఆమె ముఖ కవళికా, గొంతూ ఎంత నిగూఢంగా వున్నయంటే ఆమె మినహా ఇక నెవ్వరకీ అర్థంకాదేమో ననిపించింది. ముఖ్యంగా విజయ పరిహాసం ఆమె ముఖంచూసి గ్రహించటం కష్టం. అందుచేతనే నరేంద్రుడుకూడా గాంభీర్యం వహించి—"ఐతే వారి ఉత్తరం చూడకుండానే ఇల్లు ఇచ్చేస్తారా ?" అన్నాడు.

"ఉహుం. వారి ఉత్తరం నేను చూడాలి. కాని, ఈమాట గనక అందులో వుంటే నేనే విధంగానూ వారి ఆజ్ఞ అతిక్రమించను."

"వారి అభిప్రాయం చివరివరకూ మారలేదని మనకు ఆధారమెక్కడ వున్నది?"

"మారిందనటానికి మాత్రం ఆధారమెక్కడున్నది?" అని అడిగింది విజయ.

"కాని నేను తీసుకోకపోతే? అడగకపోతే?"

"అది మీ ఇష్టం. మీరు తీసుకోకపోతే మీ మేనత్తకొడుకులు వున్నారు కదా? వారికి చెప్పితే వారు అడుగుతారని నా నమ్మకం!"

"ఈ నమ్మకం నాకూ వుంది. కావాలంటే వొట్టుపెట్టుకుకూడా చెప్పుతాను." అన్నాడు నరేంద్రుడు నవ్వుతూ. విజయ ఈ నవ్వులో కలవలేదు, ఊరుకుంది. నరేంద్రుడు మళ్ళీ—"ఐతే నేను తీసుకున్నా తీసుకోకపోయినా మీరు ఇచ్చేస్తారన్న మాట" అన్నాడు.

"అంటే, నాన్నగారు దానంచేసింది నేను తీసుకోకూడదని నా ప్రతిజ్ఞ."

ఆమె పట్టుదలచూసి నరేంద్రుడు లోలోపల ఆశ్చర్యపోయాడు, ముగ్ధుడయాడు. కాని, కాసేపు మెదలకండా వూరుకుని మృదుస్వరంతో—"ఆ ఇల్లు మీరు సత్కార్యానికి దానం చేసినప్పుడు నేను తీసుకోకపోయినప్పటికి అది చెందిన దోషం అంటదు. అదీకాక, తీసుకుని ఏమిచేసేది చెప్పండి? నా వాళ్లుకూడా ఎవ్వరూలేరు, వుంటానికి. నేను బయటికిపోయి ఎక్కడో ఒకచోట పనిచేయవలసిందే. అంతకంటే ఇప్పుడు జరిగిన ఏర్పాటే బాగుంది. ఇంకో సంగతి ఏమంటే, విలాసబాబు ఈ మార్పుకు ఒప్పుకోడనుకుంటాను." అని అన్నాడు.

ఈ చివరిమాటకు విజయ లోలోపల మండిపోయి—"నా వస్తువు నేను ఇవ్వటానికి ఇతర్లను వొప్పించే ప్రయత్నంగానీ, తీరికగానీ నాకు లేదు. కాని, మీరింకో పని చెయ్య వచ్చును. ఇల్లు మీకు ఎలానూ అక్కరలేదు కాబట్టి దాని ఖరీదు మీరు తీసుకోవచ్చు. అలా అయితే మీరు నౌకరీ చేయనక్కరలేదు; సొంతపని చూసుకుంటూ హాయిగా వుండవచ్చు. మీరు వొప్పుకోండి, నరేన్ బాబుగారూ!" అన్నది తలవంచుకునీ. బ్రతిమాలుతున్నట్టు అన్న ఈమాటలు నరేంద్రుని గుండెకు బాణాలలాగా తగిలి చంచలుడైనాడు. ఆమె ప్రార్థనలో అసలు ఉద్దేశమేమిటో నరేంద్రునికి అంతుపట్టలేదు గాని, ఇవి వూరక అన్నమాటలు కావని మాత్రం గ్రహించాడు. తండ్రి రుణానికిగాను ఇల్లు కలుపుకుని ఈ అమ్మాయి లోలోపల చాలా బాధపడుతున్నదని అతను తెలుసుకునేవరకు అతని హృదయం నిండిపోయింది. అలాగని ఆమె ఈ ప్రస్తావన ఆమోదించటానికి వీలులేదు. తనది కానిది దానంగా ఎలా తీసుకుంటాడు? అదీకాక, ఇంకో పెద్దవిషయం వుంది. ఇలాంటి ప్రాపంచిక విషయాలు ఇదివరకు ఒక సమస్యగా వుండేవి అతనికి—కాని ఈమధ్య అతనికి ఇవి బాగా అంతుపట్టినవి. విజయ ఆవేశంలో ఏమైనా చెప్పనీయండి; అవి కార్యరూపం దాల్చాలంటే విలాసుడు అడ్డుపడతాడనీ, పని జరగదనీ తెలుసుకున్నాడు. ఇందువల్ల ఆమెకు కష్టమూ, బాధా ఎక్కువవుతుందే గాని, ఏ విధమైన శాంతీ కలగదు.

కొన్ని క్షణాలు వంచుకున్న ఆమె ముఖంవంక స్నేహపూరిత దృక్కులతో చూసి, పరిహాసంగా—"మీ మనసులో సంగతి నాకు తెలిసింది. దరిద్రుడికి ఏదో ఒక నెపంతో ఇవ్వాలని. అంతేనా?" అన్నాడు.

సరిగ్గా ఈమాటే ఇవ్వాళ ఒకసారి అన్నాడు. అదే మళ్ళీ అనటంచూసి విజయ చాలా బాధపడి, కళ్ళుపైకెత్తి-"ఈమాట అంటే నాకెంత కష్టంగా వుంటుందో తెలుసునా?" అన్నది.

"నరేంద్రుడు లోలోపల నవ్వుకుని—"అయితే అసలుసంగతి ఏమిటో చెప్పండి ?" అన్నాడు.

"నేను అసలుసంగతే చెప్తున్నాను. మీ మనస్సులో మలినం వుండడంవల్లనే సరిగా తీసుకోలేకుండా వున్నారు. మీరు బీదవారైతే నాకేం, భాగ్యవంతులైతే నాకేం ? నేను మా నాన్నగారి ఆజ్ఞను పాలించటంకోసమే మీకు అది ఇస్తున్నాను."

నరేంద్రుడు చప్పున గాంభీర్యంవహించి—"నేనుచెప్పిందికూడా కొంచెం దాచేచెప్పాను. అది అలా ఉండనివ్వండి. మీరు పెద్ద పెద్ద ప్రతిజ్ఞలు మహాచేస్తున్నారుగాని మీనాన్నగారి ఆజ్ఞలు పాలించవలసివుంటే ఈ ఒక్కఇంటితోనేపోదు, ఇంకా ఎన్నో ఇవ్వవలసి వుంటుంది, తెలుసునా ?" అన్నాడు.

"తీసుకోండి, మీ ఆస్తి అంతాకూడా."

ఈమాట నరేంద్రుడు నవ్వుతూ, తల అడ్డంగాతిప్పి—"మహాపెద్ద గొంతుతో నన్ను ఆస్తికి దావావెయ్యమన్నారు—నేను వెయ్యకపోతే మా మేనత్త కొడుకులచేత వేయిస్తానని బెదిరించారు. కాని, వారి మాటప్రకారం నేను దావాచేస్తే ఎంతవరకు పోతుందో తెలుసున ? మా ఇల్లూ, పొలమేకాదు ఇంకా చాలావున్నై, రావలసినవి !" అన్నాడు.

"నాన్నగారు ఇంకా ఏమిచ్చారు మీకూ ?" అని అడిగింది విజయ ఉత్సుకతతో.

"వారి ఉత్తరంకూడా నాదగ్గరేవుంది. వారు కట్నంగా నాకు మా ఇల్లేఇచ్చి సాగనంప లేదు. ఇక్కడనాకు కనపడుతున్నదంతా అందులోదే. నేను మా ఒక్క ఇంటికేకాదు, దావావెయ్యగలిగింది, ఈ ఇల్లూ, ఇందులో సామానులూ, ఈ ఇంటి నౌకర్లూ, చాకర్లూ ఆఖరికి ఇంటి యజమానురాలితోసహా నాదని వేయగలను. నాన్నగారి ఆజ్ఞ అట— ఇస్తారా ఇవన్నీ ?"

విజయకు నిలువెల్లా జలదరించింది. కాని, ఆమెఏమీ జవాబివ్వకుండా తలవంచుకు అలానే కూర్చున్నది. నరేంద్రుడు విజయంపొందినట్టుగా—"ఏమంటారు ? ఇవ్వగలమని తోస్తున్నదా ? అంతకంటే ఒకమాటు విలాసబాబుతో చాటుగా మంతనంచేసి చూడగూడదూ?" అని పగలబడి నవ్వాడు.

కాని ఈమాటు విజయ ముఖం పైకెత్తగానే, నరేంద్రునినవ్వు టక్కున మాయమైంది ! విజయముఖాన నెత్తురుచుక్కలేదు. పాలిపోయిన ఆమె ముఖంచూసి నరేంద్రుడు తత్తరపడి— "మీకు పిచ్చాఏమిటి ? నేను నిజంగా దావాచెయ్యబోతున్నా ననుకున్నారా ? ఒకవేళవేస్తే మాత్రం నాకువస్తుందా? అలావేస్తే నన్నుతీసుకెళ్ళి పిచ్చి ఆసుపత్రిలో పడవేస్తారు." అన్నాడు.

విజయ ఈ మాటలన్నీ విన్నట్టేలేదు—"ఏదీ, నాన్నగారిఉత్తరం చూపించండి" అని అడిగింది.

నరేంద్రుడు ఆశ్చర్యంతో—"బాగా వుంది. నేను జేబులోపెట్టుకు తిరుగుతున్నా నను కున్నారా, ఏమిటి ? పైగా అది చూస్తేమాత్రం మీకేం లాభం ?" అని అడిగాడు.

"లాభం వుండనీండి, లేకపోనీండి. ఇవ్వాళే దర్వాణ్‌చేతికి ఆ వుత్తరాలివ్వండి, మీ వెంట వాడు కలకత్తా వస్తాడు."


"అంత తొందరా ?

"ఆc."

—వచ్చేసంచికతో ముగింపు.

# భావ పరిచయ పోటీ

## బహుమానం 10-0-0




ఈ కార్టూనుకు హాస్యయుత వ్యాఖ్య (Caption) కావాలి. వ్యాఖ్య గద్యంగా గానీ పద్యంగాగానీ ఉండవచ్చు. క్లుప్తంగా ఉండాలి. మాకు చేరినవాటిలోకెల్లా ఉత్తమంగా ఉన్నదానికే బహుమాన మిస్తాము. బహుమతి నిర్ణయంలో సంపాదకునిదే తుది తీర్పు. దీనిమీద ఉత్తర ప్రత్యుత్తరాలు నడపము.


ఆంధ్రజ్యోతి పాఠక పాఠకులంతా దీనిలో పాల్గొనవచ్చును. ప్రవేశరుసుము ఏమీలేదు. వాఖ్య మాకు 23-వ జూన్‌లోగా చేరాలి. ఆ తర్వాత చేరునవి అంగీకరింపబడవు.

[గతమాసంలో దీనికి సరియైన వ్యాఖ్య రాలేదు గాన పోటీ ఇంకోమాసం పొడిగించాము.]

# ఆంధ్రజ్యోతి పజిల్స్

శ్రీ. శ్రీ.

[ ప్రస్తుతం వినోదంకోసమే. ఇంకా విత్తంమీద కాంక్షలేదు. ]



## అడ్డము : పజిలు నెం. 11 నిలువు :

**అడ్డము :**

1. ఎటుచూచినా ఒకలాగే కనబడే శరీరభాగం.
3. కులం రంగు 5. నల్లనిసిరాలో రాత్రి.
7. పవారిలేని దాసరివారిమార్గం. 8. వ్రాత.
0. రాక్షసి వికృతరూపం. 12. పాత్రిక.
3. మూడో అవతారం. 15. బంగారం.
6. నాలుగంగుళాలు.
7. అల్లికలో మొనగాడు కాబోలు.
3. వృక్షం.
0. ముదిరినదాని మొదలు వార్ధక్యం.
2. తామరపూలలో యంత్రం.
4. వెనుకటి తెనుగుపత్రిక. 25. చంద్రుడు.
7. వకీలుగారి లోకిటుకు. 28. పాత్ర.
0. బలవదహితతేజోదవానలుడు. 31. మాయ

**నిలువు :**

1. బలరాముడు వృద్ధుడు. 2. ఋషి.
3. సస్యవిశేషం.
4. ....మెగముతోలు కిరీటముగ ధరించి.
6. కలానికి కావాలి.
7. హిందీఫిల్ము: తెలుగునవల. 9. కోకిలమ్మ.
11. యుక్తితో కలిస్తే ఒక సంవత్సరం.
12. ఒకమంత్రి. 14. ఒకదేశం. 15. ఒకకాలం
18. చెచ్చెరలో సగం.
19. ఇతనిని మౌని అనవచ్చును.
21. ఆదిశక్తిలోని దిక్కు. 22. మాదయగారికవి.
23. నదవగలిగిన నాలుగోవంతు.
24. విదేశీదొంగ. 26. నెమిలి.
25. మేలెంచడానికిముందు ఎంచేది. 29. స్థలం

---

బి. ఎన్. కె. ప్రెస్, 43, ఆచారప్పన్ వీధిలో బి. నాగిరెడ్డిగారిచే ముద్రింపబడి
అదేచోట బి. ఎన్ గుప్త గారిచే ప్రకటించబడింది. ఎడిటర్: చక్రపాణి.

# ఆంధ్రజ్యోతి

## సచిత్ర మాసపత్రిక

జులై 1946 నించి రెండోసంవత్సరంలో ప్రవేశిస్తుంది. కొత్తకొత్త శీర్షికలతో, సరికొత్త అందచందాలతో అనేక వ్యంగ్యచిత్రాలతో వెలువడుతుంది. కాగితం కోటా తగ్గటంవల్ల ఏజంట్లకు వలసినన్ని కాపీలు సప్లయి చేయలేకపోవచ్చును. కాన పాఠకులు చందాదారులుగా చేరటం మంచిదని మా ప్రార్థన. సాలు చందా 5-0-0 లు మాత్రమే.

37 ఆచారప్పన్ వీధి,<br>మద్రాసు.

మేనేజరు<br>ఆంధ్రజ్యోతి.

---

# ★ జర్మెక్సు ★

అన్ని చర్మవ్యాధులను నివారించే 'ఏంటి సెప్టిక్' అయింటుమెంటు




తామర,
గజ్జి,
మొటిమలు,
కురుపులు,
కోతలు;

మొదలగు వాటన్నిటిని సులభంగా నివారించును.

## లిటిల్స్ ఓరియంటల్ బామ్ అండ్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్,

పో. బా. నెం. 67, మద్రాసు.

# ఈస్ట్ అండ్ వెస్ట్

## ఇన్షూరెన్సు కంపెనీ, లిమిటెడ్, బొంబాయి.

[1913 లో స్థాపితం]

ప్రధాన కార్యాలయం :

'ఈస్ట్ అండ్ వెస్ట్ బిల్డింగ్', ఫోర్టు, బొంబాయి.

33 సంవత్సరాలుగా దేశసేవచేస్తూ జాతీయోన్నతి పెంపొందిస్తూ ఉన్న ప్రముఖ భారతీయ భీమాసంస్థ.

చైర్ మెన్:

డా॥ ఆర్. ఎం. అళగప్ప చెట్టియార్,

కెటి., ఎం. ఎ., డి. లిట్., యల్. యల్. డి. బార్-ఎట్-లా.

ఆర్థికంగా సుస్థిరమై, పాలసీదార్లతోనూ, ఏజంట్లతోనూ వ్యవహరించుటలో సంస్కారానికి పేరెన్నికగన్న సంస్థ.

1944 లో జరిపిన అదనపువ్యాపారం కోటిరూపాయలు మించింది.

చురుకైనటువంటివారున్నీ, పలుకుబడి కలిగినటువంటివారున్నీ వ్యక్తులు ఏజన్సీలకొరకు దరఖాస్తులు పెట్టుకోవచ్చును.

వివరాలకు:

శ్రీ జె. యస్. రెడ్డి
బ్రాంచి సెక్రటరీ.,
377, ఎస్ప్లనేడ్,
మద్రాసు.

శ్రీ ఎ. వెంకటరెడ్డి
ఇన్స్పెక్టర్ ఆఫ్ ఏజన్సీస్,
మోదుకూరు, వయా—పొన్నూర్,
గుంటూరు జిల్లా.



# లిటిల్స్ ఓరియంటల్ బాం




తలనొప్పి
బెణుకులు
నడుమునొప్పి
తుంటినొప్పి
కీళ్లవాతము
కండరముల పోటులను
నివారించును.

## వాడినవారి అభిప్రాయాలు

బెరెల్లీనుండి సి. ఎర్లేగారు ఇలా వ్రాశారు :

"తలనొప్పులకు, కీళ్లనొప్పులకు, ఇతర నొప్పులన్నిటికీకూడ నేను మీ అంజనం వాడుతున్నాను. అన్నివేళలా బాధానివారణ పొందాను."

ఫరీద్‌పూర్‌నుంచి సుశీల చంద్రసేన్‌గారు ఇలా వ్రాశారు :

"నా ఎడమ మోకాలులో తీవ్రమైన కీలునొప్పితో బాధపడినప్పుడు, లిటిల్స్, ఓరియంటల్ బాం, ఇంద్రజాలంగా పనిచేసింది."



# లోధ

**గర్భాశయరోగనివారిణి**

ప్రతి వనితకు, గర్భకోశ సంబంధమైన
వ్యాధులనుండి విముక్తినొసగి,
ఆనందం చేకూర్చుతుంది.




**కేసరికుటీరం లిమిటెడ్. రాయపేట, మద్రాస్.**

ఆంధ్ర, తమిళ, నైజామ్ రాష్ట్రాలకు
ఏజంట్లు:

## సీతారామజనరల్ స్టోర్స్

సికందరాబాదు • బెజవాడ • మధుర.





*For the Delightfully Refreshing Soap*

**KERALA SOAP INSTITUTE, CALICUT**

FAS-197

కేరళసోప్ ఇన్‌స్టిట్యూట్,
కాలికట్.




శాస్త్ర యుక్తముగా
తయారుచేసిన వస్తువులు

- మాంగో జామ్
- మాంగో రెలిష్
- ఆరంజ్ మార్మలేడ్
- టొమాటో సాస్
- లైమ్‌జూస్ కార్డియల్
- లెమన్ స్క్వాష్
- లెమన్ బార్లీ
- ఆరంజ్ స్క్వాష్

పెద్దవర్తకుల అందరివద్దనూ దొరుకుతవి

THE INDIA FRUITS LTD., KADIAM

# యువ ప్రచురణలు

## చలం

| | |
|---|---|
| స్త్రీ .... | 2– 0–0 |
| బిడ్డల శిక్షణ .... | 1– 8–0 |
| ఖర్మమిట్లా కాలింది .... | 1– 8–0 |
| చిత్రాంగి .... | 1– 8–0 |
| దైవమిచ్చిన భార్య .... | 1– 8–0 |
| శశాంక .... | 1– 0–0 |
| జయదేవ ... | 1– 0–0 |
| మైదానం .... | 1– 0–0 |
| అమీనా .... | 1– 0–0 |
| సత్యం శివం సుందరం .... | 1– 4–0 |
| మంగమ్మ .... | 1– 0–0 |
| త్యాగం .... | 1– 8–0 |
| కన్నీటి కాలవ .... | 0–12–0 |
| పాపం .... | 0–12–0 |
| హంపీకన్యలు .... | 0–12–0 |
| బ్రాహ్మణీకం .... | 0–12–0 |
| అరుణ .... | 0–12–0 |

## శరత్ బాబు

| | |
|---|---|
| వాగ్దత్త .... | |
| దేవదాసు .... | 1– 8–0 |
| పల్లీయులు .... | 1– 8–0 |
| పరిణీత .... | 0–12–0 |
| బడదీదీ .... | 0–12–0 |
| పతివ్రత .... | 0–12–0 |
| హేమాంగిని .... | 0–12–0 |
| నిష్కృతి .... | 0–12–0 |
| మహేశుడు .... | 0–12–0 |
| నారీర్ మూల్య .... | 0–12–0 |
| మావారు .... | 0–1 –0 |
| రూం టులెట్ [వి. బి. శాస్త్రి] | 0–12–0 |
| పొగడదండ [పద్మావతి] .... | 0–12–0 |
| స్వప్నవాసవదత్తము [కాటూరి] | 0–12–0 |
| సిపాయికథలు [శిష్ట్లా] | 0–12–0 |

## చక్రపాణి

| | |
|---|---|
| తోకచుక్క .... | 0–12–0 |
| పాతమంగలి .... | 0–12–0 |
| మెట్టవేదాంతం .... | 1– 0–0 |
| బెంగాలీ కథలు .... | 0–12–0 |
| ప్రగల్భ ప్రేతము .... | 0–12–0 |
| పాంచజన్యం .... | 0–12–0 |
| హనుమంతుని స్వప్నం .... | 0–12–0 |
| రష్యన్ కథలు .... | 0–12–0 |
| వల్లభపురం చిట్టడవిలో .... | 0–12–0 |
| పరాజయం .... | 0–12–0 |
| నారీ ద్వేషి .... | 1– 8–0 |

## కుటుంబరావు

| | |
|---|---|
| నిలవనీరు .... | 1– 8–0 |
| కాలభైరవుడు .... | 0–12–0 |
| కవిరాట్టు .... | 0–12–0 |
| నీకేం కావాలి .... | 0–12–0 |
| కులంలేని మనిషి | |
| మాఘపెళ్లి .... | 0–12–0 |
| వరప్రసాదం .... | 0–12–0 |

---

| | |
|---|---|
| సుందర్ [సోరీన్] .... | 3– 0–0 |
| ఆనాపీలను .. .... | 0–12–0 |
| మూగజీవాలు [గోఖలే] ... | 1– 8–0 |
| కదంబం [నార్ల] .... | 0–12–0 |
| రాజూ-మంత్రీ [మూర్తి] .... | 0–12–0 |
| చుక్కలూ గీతలూ .... | 1– 0–0 |
| మాలోమేము [కృష్ణమూర్తి] | 1– 0–0 |
| పలితకేశము [దువ్వూరి] .. | 1– 0–0 |
| ఋణవిముక్తి [క. స.] .... | 1– 0–0 |
| సెలవు .... | 1– 0–0 |
| తెల్లవారుఝాము పాఠాలు | 0–12–0 |

43, ఆచారప్పన్ వీధి.
జి. టి. మద్రాసు.

**యువ బుక్ డిపో**

గవర్నర్ పేట.
బెజవాడ.




AN INTERNATIONAL FILMS RELEASE